

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

నేను హోంమంత్రినైతే.. బీఆర్‌ఎస్‌ను కంట్రోల్ చేస్తా

కేసీఆర్ కుటుంబం సహా జగదీశ్‌రెడ్డి జైలుకే
అసెంబ్లీ భేటీ తర్వాత మంత్రివర్గ విస్తరణ
అధిష్ఠానం నుంచి నాకు హామీ ఉంది
మీడియాతో చిట్‌చాట్‌లో రాజగోపాల్‌రెడ్డి
మీ లాగే మాకూ ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతోంది..
మంత్రి పదవిపై కేటీఆర్‌తో సంభాషణ

13

శుక్రవారం | 9-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 295

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి ఉ. 8.04, అమావాస్య తె. 4.28 వరకు, నక్షత్రం: శ్రవణం రా. 11.30 తదుపరి ధనిష్ఠ వర్జ్యం: తె. ఉ. 7.12 వరకు, తె. 3.00 -4.25, దుర్ముహూర్తం: ఉ. 9.05-9.51, మ. 12.53-1.38, అమృతఘడియలు: మ. 2.17-3.41; రాహుకాలం: ఉ. 10.30-12.00, సూర్యోదయం: 6.49, సూర్యాస్తమయం: 6.11 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆ రోజులు అంతమయ్యాయి!

కాళోజీ కవితతో బీఆర్ఎస్ సర్కారును దునుమాడిన రాష్ట్ర గవర్నర్ తమిళిసై

బడ్జెట్ సమావేశాల తొలి రోజు శాసనసభలో ప్రసంగం
అధికారమున్నదని హద్దు పద్దు లేక అన్యాయ మార్గాలనార్జింపబూనిన రోజులంతమైనాయంటూ ప్రారంభం
వ్యవస్థలకు విలువలు.. సంస్థలకు స్వేచ్ఛ.. ప్రజా పాలన
నిర్దిష్ట గడువులోనే ఆరు గ్యారెంటీలు.. త్వరలోనే మరో రెండు
ఎంఎస్ఎంఈలు, పరిశ్రమలు, సేవా రంగాలకు నూతన విధానం
సమగ్ర ఇంధన, పర్యాటక పాలసీల రూపకల్పన
జనావాసాలకు దూరంగా 10 నుంచి 12 ఫార్మా విలేజ్ క్లస్టర్లు
కొత్త శిఖరాలకు తెలంగాణ.. మాటల్లో కాదు చేతల్లో చూపిస్తాం
మన్మోహన్, సోనియాకు రాష్ట్రం రుణపడి ఉంటుంది: తమిళిసై



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):

అధికారమున్నదని హద్దు పద్దు లేక
అన్యాయమార్గాలనార్జింపబూనిన
అచ్చి వచ్చే రోజులంతమైనాయి
అచ్చి వచ్చే రోజులంతమైనాయి

..ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు కవిత ఇది! అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ తమిళిసై ఈ కవితతోనే ప్రసంగాన్ని ప్రారంభించారు. తద్వారా, గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని దునుమాడారు. మార్పు, ధర్మబద్ధమైన ప్రగతి ఉమ్మడి ఆకాంక్షగా

మిగతా 13వ పేజీలో...

సభకు కేసీఆర్ గైర్హాజరు

బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు వచ్చే అవకాశం
విపక్ష నేతగా కేసీఆర్‌కు చిన్న గది.. అభ్యంతరం
గవర్నర్ ప్రసంగం పేలవం: హరీశ్‌రావు
నేడు గవర్నర్ ప్రసంగంపై చర్చ.. రేపు బడ్జెట్

13

కేసీఆర్.. ఎక్స్‌పైర్డ్ మెడిసిన్

తెలంగాణ పట్ల ఆయనకు కమిట్‌మెంట్ లేదు.. మొహం చెల్లకనే అసెంబ్లీకి దూరం
పదవి పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.. ప్రజలు బీఆర్ఎస్‌ను పట్టించుకోవట్లేదు
కాళేశ్వరంలో అవినీతి తేలడంతో తెరపైకి కేఆర్ఎంబీ.. ప్రాజెక్టులు అప్పగించిందే కేసీఆర్
సాగర్‌పైకి జగన్ పోలీసులను పంపితే ఏం చేశారు?.. ఇది తెలిసే ప్రజలు తిరస్కరించారు
మరింత పకడ్బందీగా టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లు.. 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం
పాత గ్రూప్-1 రద్దు చేసి మళ్లీ నోటిఫికేషన్.. ప్రస్తుత అసెంబ్లీలోనే కులగణనపై తీర్మానం
అసెంబ్లీ చాంబర్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

3



త్వరలో ఇసుక పాలసీ

25 శాతం ఇసుక తరలిపోతోంది
అధికారులూ నిద్ర పోతున్నారా?
టీఎస్ఎండీసీపై సీఎం ఆగ్రహం
ప్రక్షాళన.. విజిలెన్స్, ఏసీబీ తనిఖీ
కొడంగల్ లిఫ్ట్‌కు 2,945 కోట్లు

ఏపీలో టీడీపీ.. రాష్ట్రంలో హస్తం

తెలంగాణలో కాంగ్రెస్‌కు 10 ఎంపీ సీట్లు
బీఆర్ఎస్, బీజేపీలకు మూడేసి మాత్రమే
ఏపీలో అధిక స్థానాలు టీడీపీకి
మొత్తం 25లో 17 సైకిల్‌కు.. వైసీపీకి 8
కేంద్రంలో మళ్లీ మోదీ సర్కార్
బీజేపీకి 304 సీట్లు.. ఎన్డీఏకు 335
ఇండియా కూటమి 166కే పరిమితం
కాంగ్రెస్ స్కోరు 71కి పెరిగే అవకాశం
ఇండియాటుడే 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే

2

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ సత్తా చాటనుందని ఇండియాటుడే.. 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే వెల్లడించింది. బీఆర్ఎస్‌కు మళ్లీ షాక్ తప్పదని, బీజేపీ ఒక సీటు కోల్పోతుందని, మజ్లిస్ తన స్థానాన్ని తిరిగి కైవసం చేసుకుంటుందని ఈ సర్వే తెలిపింది. ఏపీలో టీడీపీ పునర్వైభవాన్ని సాధిస్తుందని, రాష్ట్రంలో మెజారిటీ సీట్లను కైవసం చేసుకుంటుందని పేర్కొంది. జాతీయస్థాయిలో మోదీ సారథ్యంలో బీజేపీ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసి, వరుసగా మూడోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని ఇండియా టుడే సర్వే వెల్లడించింది.

ఐఏఎస్‌కు 10 కోట్లు

ఆ అధికారి చెప్పినట్లు చేశా.. పలు దఫాలుగా నగదు రూపంలో చేరవేశా



ఏసీబీ కస్టడీలో వెల్లడించిన శివబాలకృష్ణ
ఐఏఎస్‌ను విచారించేందుకు రంగం సిద్ధం
ప్రభుత్వ అనుమతి కోరిన ఏసీబీ అధికారులు
బడా స్థిరాస్తి సంస్థలపైనా ఏసీబీ ఫోకస్
డొల్ల కంపెనీలు.. బినామీలపై ఐటీ నజర్
నిధుల మళ్లింపుపై రంగంలోకి ఈడీ..


హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ వ్యవహారం కొత్త మలుపు తిరిగింది..! ఆయన వెనక ఓ ఐఏఎస్ అధికారి ఉన్న విషయం వెలుగులోకి వచ్చింది..! సదరు అధికారికి శివబాలకృష్ణ పలు దఫాలుగా రూ.10 కోట్లు ముట్టజెప్పినట్లు.. ఆయన చెప్పిన ఫైళ్లకు వెనువెంటనే అనుమతులు ఇచ్చినట్లు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) తేల్చింది..! అంతేకాదు.. ఆ అధికారి సూచించిన మేరకే అక్రమంగా సంపాదించిన డబ్బుతో శివబాలకృష్ణ వరంగల్ వైపు భూములను కొనుగోలు చేసినట్లు గుర్తించింది.

ఇటీవల శివబాలకృష్ణను ఏసీబీ అధికారులు ఎనిమిది రోజులపాటు కస్టడీకి తీసుకుని, విచారించిన విషయం తెలిసిందే.! ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించి, ప్రస్తుత సర్కారులోనూ మంచి పొజిషన్‌లో ఉన్న ఓ ఐఏఎస్ అధికారి పేరును శివబాలకృష్ణ వెల్లడిస్తూ.. వాంగ్మూలం(కన్ఫెషన్) ఇచ్చినట్లు సమాచారం. కోర్టుకు సమర్పించిన కన్ఫెషన్ రిపోర్టులో ఏసీబీ అధికారులు సదరు ఐఏఎస్ పేరును ప్రస్తావించినట్లు తెలిసింది. ఏసీబీ కస్టడీలో.. శివబాలకృష్ణ తన ఆస్తుల వివరాలు, బినామీల పేర్లు, ఎవరి ఆదేశాల మేరకు ఈ పనులు చేశారు? అధికారులకు ముట్టజెప్పిందెంత? అనే వివరాలను

మిగతా 14వ పేజీలో...

సాగునీటి శాఖలో.. ఎన్నికల టెండర్లు రద్దు!

రూ. 8,877 కోట్ల విలువైన 69 పనులకు స్వస్తి



అసెంబ్లీ ఎన్నికలకు ముందు పిలిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం
వాటితో ఏ ఉపయోగం లేదని కాంగ్రెస్ సర్కారు భావన
పనులు దక్కించుకుని, ముడుపులు చెల్లించిన కాంట్రాక్టర్లు
ఇప్పుడు ఆ టెండర్లు రద్దు చేయనుండడంతో లబోదిబో
'తక్కువ వ్యయం.. ఎక్కువ ఆయకట్టు' సూత్రంతో రీ టెండర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం సాగునీటి శాఖలో పిలిచిన టెండర్లను రద్దు చేయాలని కాంగ్రెస్ సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.8,877 కోట్ల విలువ చేసే 69 టెండర్లను రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వీటిలో రూ.6,655 కోట్ల విలువైన పనులు ఒక్క పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి చెందినవే. ఇక, రూ.1,658 కోట్లతో చేపట్టిన చెన్నూరు ఎత్తిపోతల పథకం కూడా రద్దు జాబితాలో ఉంది. దీనిపై గత ఏడాది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కుప్టి ప్రాజెక్టును చేపడితే గ్రావిటీతో నీటిని తరలించేందుకు అవకాశం ఉంటుందని, అలాకాకుండా చెన్నూరు ఎత్తిపోతలను చేపడితే దీర్ఘకాలం ఉపయోగం ఉండదని వివరించారు. ఈ ప్రాజెక్టును పైసల కోసమే చేపట్టినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. నిజానికి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టాలని భావిస్తున్న

మిగతా 12వ పేజీలో...





ఇక కొలువుల జాతర

నియామకాలకు తొలగిన అడ్డంకులు.. గురుకులాల ఉద్యోగ ఫలితాల వెల్లడి
త్వరలో పోలీస్ ఉద్యోగాల భర్తీ పూర్తి.. గ్రూప్-4 ఫలితాల వెల్లడికి కసరత్తు
గ్రూప్-1 పరీక్ష రద్దు.. తిరిగి ఉత్తర్వు!.. పాతవారు దరఖాస్తు చేయనక్కర్లేదు
కొత్త వారికి అవకాశం కల్పించడమే!.. సమాంతరంగా మహిళా రిజర్వేషన్లు
ఈ ఏడాదంతా నియామకాల జాతరే.. 2 లక్షల ఉద్యోగాల భర్తీకి సర్కారు రెడీ

12

మోటమర్రి-విష్ణుపురం రైల్వే లైన్ డబ్లింగ్!

మోటమర్రి వద్ద రైల్ ఓవర్ రైల్ ప్రాజెక్టు సహా ఆరు ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర

- మత్స్య, ఆక్వాకల్చర్ సదుపాయాల అభివృద్ధి
- వచ్చే నాలుగేళ్లలో రూ.6 వేల కోట్లతో మత్స్య రంగానికి ఊతమిచ్చే 'పీఎం-ఎంకేఎస్ఎస్‌వై'కి కేంద్ర క్యాబినెట్ ఆమోదం

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మోటమర్రి-విష్ణుపురం మధ్య 88.81 కిలోమీటర్ల డబుల్ లైన్, మోటమర్రి వద్ద 10.87 కిలోమీటర్ల మేర రైల్ ఓవర్ రైల్ పనులకు ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపినట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో గురువారం భేటీ అయిన ఈ కమిటీ.. ఈ ప్రాజెక్టు సహా మొత్తం ఆరు ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, అసోం, నాగాలాండ్ రాష్ట్రాల్లోని 18 జిల్లాల్లో రైల్వే నెట్‌వర్క్‌ను మెరుగుపరిచే ఈ ఆరు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుల విలువ రూ.12,343 కోట్లు. పూర్తిగా కేంద్ర నిధులతోనే ఈ ప్రాజెక్టులను పూర్తిచేస్తారు. వీటిలో మన తెలుగు రాష్ట్రాల్లో రైల్వే నెట్‌వర్క్‌ను మెరుగుపరిచే ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,746.20 కోట్లు. మోటమర్రి-విష్ణుపురం లైన్‌ను డబ్లింగ్ చేస్తే.. జగ్గయ్యపేట సిమెంటు పరిశ్రమలకు, త్వరలో జెన్‌కో ప్రారంభించనున్న 4 వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు ఎంతగానో ఉపయోగం. అంతేకాదు.. ఈ లైన్ డబ్లింగ్‌తో సికింద్రాబాద్- విజయవాడ మధ్య రైళ్ల రాకపోకలు పెరుగుతాయని.. కాజీపేట, వరంగల్, ఖమ్మం మీదుగా సాగే రైళ్లలో రద్దీ తగ్గుతుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆరు ప్రాజెక్టుల వల్ల ఆరు రాష్ట్రాల్లోని రైల్వే నెట్‌వర్క్ మరో 1020 కిలోమీటర్ల మేర పెరుగుతుందని.. ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు 3 కోట్ల పనిదినాల మేర ఉపాధి లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అలాగే, ప్రధాని నేతృత్వంలో గురువారం భేటీ అయిన కేంద్ర మంత్రి మండలి మత్స్య పరిశ్రమకు ఊతమిచ్చే రెండు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. వాటిలో ఒకటి.. మత్స్య, ఆక్వాకల్చర్ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధిని(ఎఫ్ఐడీఎఫ్) మరో మూడేళ్లపాటు (2025-26 వరకూ) పొడిగించడం. రెండోది.. ప్రధాన మంత్రి మత్స్య సంపద పథకానికి అనుబంధంగా 2023-24 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన 'ప్రధాన మంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహయోజన (పీఎం-ఎంకేఎస్ఎస్‌వై)'కి పచ్చజెండా. ఈ పథకం ద్వారా మత్స్య రంగంలోని సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు నాలుగేళ్ల వ్యవధిలో రూ.6000 కోట్ల మేర వ్యవస్థాగత ఆర్థిక సాయం అందించనున్నారు.



ప్రధాని మోదీ ఓబీసీ కాదు

- కులం పేరుతో దేశ ప్రజలను మోసగిస్తున్నారు: రాహుల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ప్రధాని నరేంద్ర మోదీ తనను తాను ఓబీసీగా ప్రకటించుకొని దేశ ప్రజలను మోసగిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. 'తాను ఓబీసీగా జన్మించానని మోదీ చెబుతున్నారు. కానీ ఆయన ఓబీసీలో పుట్టలేదు. ఆయన జనరల్ కేటగిరీకి చెందిన కుటుంబంలో పుట్టారు' అని ఒడిశాలో రెండో రోజు గురువారం కొనసాగిన భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ వ్యాఖ్యానించారు. గుజరాత్ సీఎం అయిన తర్వాత మోదీ తన కులాన్ని ఓబీసీగా మార్చుకున్నారని, ఆయన పుట్టుకతోనే ఓబీసీ కాదని స్పష్టంచేశారు. 2000వ సంవత్సరంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు మోదీ పుట్టిన ఘాంచీ కులాన్ని జనరల్ నుంచి ఓబీసీ కేటగిరీలో చేర్చారని తెలిపారు. ఆయన ఓబీసీలో పుట్టలేదు కాబట్టి ఆయన కులగణనకు ఎప్పటికీ అంగీకరించరని రాహుల్ విమర్శించారు. కాగా, ప్రధాని మోదీ సామాజిక వర్గానికి సంబంధించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించబోనని, అయితే కొందరు తమ పుట్టుకతో కాకుండా సర్టిఫికెట్ ఆధారంగానే ఓబీసీలుగా గుర్తింపు పొందుతున్నారని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే నోటిఫికేషన్...: కేంద్రం

ప్రధాని మోదీ ఓబీసీ కేటగిరీలో జన్మించలేదంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం గురువారం స్పందించింది. 'ప్రధాని కులంపై రాహుల్ చేసిన ప్రకటనలో వాస్తవాలు' పేరిట ఒక సంక్షిప్త నోట్ విడుదల చేసింది. 'మండల్ కమిషన్ గుజరాత్‌లో చేపట్టిన సర్వే అనంతరం ఇండెక్స్ 91(ఏ)కింద ఓబీసీ జాబితాను తయారు చేసింది. ఆ రాష్ట్రానికి చెందిన 105 ఓబీసీ కులాల జాబితాలో మోద్-ఘాంచీని కూడా చేర్చారు" అని తెలిపింది.

సమయం లేదు.. అభ్యర్థులను ప్రకటిస్తున్నాం

- ఇండియా కూటమి ఆలస్యంపై ఆప్ వ్యాఖ్య

గువాహటి, ఫిబ్రవరి 8: ఇండియా కూటమికి ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) మరోసారి ఝలక్ ఇచ్చింది. ఇప్పటికే పంజాబ్, ఢిల్లీల్లో తమ వైఖరిని స్పష్టం చేసిన ఆప్.. అసోంలో మూడు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. దిబ్రూగఢ్ నుంచి మనోజ్ ధనోవర్, గువాహటి నుంచి భాబెన్ చౌదరి, తేజ్‌పూర్ నుంచి రిషి రాజ్ కౌటిన్య పోటీ చేస్తారని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఎంపీ, ఆప్ ప్రధాన కార్యదర్శి(సంస్థాగతం) సందీప్ పాఠక్ విలేకరులతో మాట్లాడుతూ.. ఇండియా కూటమి సీట్ల పంపిణీని తేల్చకపోవడంపై విసిగిపోయినట్లు చెప్పారు. అయినా.. తాము ఇండియా కూటమితోనే ఉంటామని చెప్పారు.

మధ్యంతర బడ్జెట్‌కు పార్లమెంటు ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్‌కు పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. గురువారం రాజ్యసభ ఆర్థిక బిల్లు, ద్రవ్య వినియోగ బిల్లులకు ఆమోదం తెలిపి తిరిగి వాటిని లోక్‌సభకు పంపించింది. దీంతో బడ్జెట్ ప్రక్రియ పూర్తయినట్టయింది. రాజ్యసభలో జరిగిన చర్చకు ఆర్థిక మంత్రి నిర్మల సమాధానం ఇచ్చిన అనంతరం ఆ సభ బడ్జెట్‌కు ఓకే చెప్పింది.

సౌదీతో 225 మిలియన్ డాలర్ల ఒప్పందం

- ఆయుధ సామగ్రి ఎగుమతికి కాంట్రాక్టు కుదుర్చుకున్న మైల్

రియాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి గల్ఫ్): భారత ఆయుధ తయారీ సంస్థ మైల్.. సౌదీ అరేబియాకు 225 మిలియన్ డాలర్ల ఆయుధ సామగ్రిని ఎగుమతి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. సౌదీ అరేబియాలో నాలుగు రోజులుగా జరుగుతున్న ప్రపంచ డిఫెన్స్ ప్రదర్శన సందర్భంగా భారత రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ ఒప్పందం కుదిరినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ సహాయ మంత్రి అజయ్‌భట్ ప్రసంగిస్తూ, ముగ్గురు భారత మహిళా ఆర్మీ అధికారులను ప్రత్యేకంగా కొనియాడారు. భారత సేనకు చెందిన కల్నల్ పోనుగ్ డోమింగ్, నౌకాదళ లెఫ్టినెంట్ కమాండర్ అన్నా ప్రకాశ్, వాయుసేన స్క్వాడ్రన్ లీడర్ భావన కాంత్‌లను ఆయన ప్రత్యేకంగా స్టేజీపైకి పిలిచి అభినందించారు.

ఉత్తరాఖండ్ హల్ద్వానీలో అల్లర్లు..

- అక్రమ మదర్సా కూల్చివేతతో పరిస్థితి ఉద్రిక్తం

హల్ద్వానీ, ఫిబ్రవరి 8: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన ఓ మదర్సాను గురువారం అధికారులు కూల్చేయడం ఉద్రిక్తతలకు దారితీసింది. అక్కడ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగగా.. కొందరు దుండగులు రెచ్చిపోయి బీభత్సం సృష్టించారు. అధికారులు, పోలీసులపై రాళ్లు రువ్వారు. పోలీసు వాహనాలతో పాటు ఇతర వాహనాలకు నిప్పుపెట్టారు. ఈ నేపథ్యంలోనే పరిస్థితి అదుపు తప్పడంతో సీఎం పుష్కర్ సింగ్ ధామి అత్యవసరం సమావేశం ఏర్పాటు చేశారు. హల్ద్వానీ నగరంలో కర్ఫ్యూ విధించడంతో పాటు బంభుల్‌పురాలో 'కనిపిస్తే కాల్చివేత' ఉత్తర్వులు జారీ చేశారు. ఇటు అల్లర్ల సమయంలోనే అధికారులు, పోలీసులు, కొందరు జర్నలిస్టులు బంభుల్‌పురా పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లి తలదాచుకోగా.. ఆందోళనకారులు దాన్ని కూడా ముట్టడించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు అదనపు బలగాలను రంగంలోకి దింపారు. అల్లర్లలో 60 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. పారామిలటరీని కూడా రంగంలోకి దింపి పరిస్థితి అదుపులోకి తెచ్చామని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

కేటీఆర్ అనుమతితోనే..
ఫార్ములా-ఈ రేస్‌కు రూ. 54 కోట్లు


- హెచ్ఎండీఏ నుంచి చెల్లించాలని ఆయనే ఆదేశించారు
- ప్రభుత్వానికి సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్ వివరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ రేసుకు రూ. 54 కోట్ల ముందస్తు చెల్లింపులు అప్పటి మునిసిపల్, పట్టణాభివృద్ధి మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాల మేరకే జరిగాయని సీనియర్ ఐఏఎస్, మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ చెప్పారు. ఫార్ములా- ఈ రేసుకు గత సీజన్‌లో ప్రధాన భాగస్వామిగా ఉన్న గ్రీన్కో సంస్థను తొలగించి ఆ స్థానంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చేరింది. ఈ నిర్ణయం తీసుకునే సమయంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ హెచ్ఎండీఏ ఎండీగా ఉన్న అరవింద్‌కుమార్ సొంత నిర్ణయం తీసుకున్నట్టు విమర్శలు వచ్చాయి. దీంతో ప్రభుత్వానికి రూ. 54 కోట్ల నష్టం జరిగిందని, దీనిపై వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం అరవింద్‌కుమార్‌కు గత నెలలో షోకాజు నోటీసులు జారీచేసింది. లేదంటే డబ్బులు వెనక్కి కట్టాలని ఆదేశించింది. దీనికి ఆయన ఇచ్చిన సమాధానం తాజాగా బయటికి వచ్చింది. ఫార్ములా- ఈ రేసుకు రాష్ట్రప్రభుత్వం ప్రమోటర్‌గా ఉండటంతోనే రూ. 54 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని తెలిపారు. కేటీఆర్ ఆదేశాలతోనే ఆ డబ్బును హెచ్ఎండీఏ నుంచి చెల్లించామని చెప్పారు. నిధులను ఆర్థికశాఖ నుంచి తీసుకోనందున ఆశాఖ ముందస్తు అనుమతి తీసుకోలేదని తెలిపారు. ఈవెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రమోటర్‌గా మారడం వెనుక, నిధుల విడుదల వెనుక తన సొంత నిర్ణయం ఏమీ లేదని అన్నారు. అన్ని విషయాలు కేటీఆర్ ఆదేశాలతోనే జరిగాయని అరవింద్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన వివరణలో పేర్కొన్నారు.

బ్లాక్ & వైట్ కాంగ్రెస్ - బీజేపీ ఫైట్

ప్రెస్‌కు నల్ల పత్రం విడుదలచేసిన కాంగ్రెస్.. రాజ్యసభలో శ్వేతపత్రం చదివిన బీజేపీ

- ఎన్నికల వేళ పత్రాల యుద్ధంతో కాక
- ఒక్కసారిగా అట్టుడికిన రాజ్యసభ
- ఆర్థికవ్యవస్థను నాశనంచేసిన యూపీఏ
- సభలో విరుచుకుపడ్డ మోదీ సర్కారు
- ఈ పదేళ్లు అన్యాయ కాలం
- 'బ్లాక్ పేపర్' లో దుమ్మెత్తిపోసిన కాంగ్రెస్



బ్లాక్ పేపర్‌ను విడుదల చేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఎన్నికల వేళ పార్లమెంటు వేదికగా గురువారం 'పత్రాల' యుద్ధం హోరాహోరీ సాగింది. ఇదిగో మోదీ పాలన నిర్వాకం అంటూ విపక్షం యూపీఏ నల్లపత్రం మీడియాకు విడుదల చేయగా, యూపీఏ పదేళ్ల పాలన అసలు గుట్టు ఇదిగో అంటూ అధికార ఎన్డీయూ 'శ్వేతపత్రం'తో దీటుగా ఎదుర్కొంది. గురువారం ప్రభుత్వం సభలో శ్వేతపత్రం పెట్టనుందని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ముందే అప్రమత్తం అయింది. పార్లమెంటు సమావేశాలు ప్రారంభానికి ముందే మీడియాను పిలిచి నల్ల పత్రం విడుదలచేసింది. అనంతరం ఆ పార్టీ సభ్యులు నల్లవస్త్రాలు ధరించి రాజ్యసభకు వచ్చారు. అవే దుస్తుల్లో రాజ్యసభలోకి ప్రవేశించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'నల్ల పత్రం'లోని అంశాలను ప్రస్తావిస్తూ, మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అందరూ అనుకున్నట్టే భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేత పత్రాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. గత యూపీఏ ప్రభుత్వ పాలనతో తమ పరిపాలనను పోల్చుతూ ఈ పత్రంలోని అంశాలను ఆమె వివరించారు. "మంచి స్థితిలో ఉన్న ఆర్థిక వ్యవస్థతో యూపీఏ 2004లో తన పాలన ప్రారంభించింది. కానీ, మా చేతికి 2014లో అప్పగించేసరికి అది పతనావస్థలో ఉంది. అవినీతి తారస్థాయిలో ఉండేది. ఆర్థిక క్రమశిక్షణ లేదు. నిధుల దుర్వినియోగానికి అంతులేదు. సర్వత్రా సంక్షోభ ఛాయలు కనిపించాయి" అని తెలిపారు. కాంగ్రెస్ 1991లో ప్రారంభించిన ఆర్థిక సంస్కరణలను తన హయాంలో కొనసాగించడంలో విఫలమయిందని విమర్శించారు. దీంతో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి గత పదేళ్లలో అనేక కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని నిర్మల వివరించారు. అంతకుముందు.. "పదేళ్ల అన్యాయ కాలం" పేరిట కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 54 పేజీలతో కూడిన బ్లాక్ పేపర్‌ను విడుదల చేశారు. గత పదేళ్లలో జరిగిన ఆర్థిక, సామాజిక, రాజకీయ అన్యాయాలను ఎత్తిచూపుతూ మోదీ ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు ఎక్కుపెట్టారు. మోదీ ప్రభుత్వం ఈ పదేళ్ల కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయరంగాన్ని సర్వనాశనం చేసిందని, నిరుద్యోగాన్ని పెంచిందని, మహిళలపై నేరాలు పెరుగుతున్నా పట్టించుకోలేదని, మైనారిటీలకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. "ప్రధాని మోదీ పార్లమెంటులో మాట్లాడినప్పుడల్లా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటున్నారు. అందుకే బ్లాక్ పేపర్ ద్వారా బీజేపీ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలనుకుంటున్నాం" అని ఖర్గే అన్నారు.

అన్నీ లోపభూయిష్ఠ నిర్ణయాలే...


మోదీ పాలనలో దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగిందని, పెద్దనోట్ల రద్దు, లోపభూయిష్టమైన జీఎస్టీ వంటి ఆర్థిక విపత్తులు చోటుచేసుకున్నాయని బ్లాక్ పేపర్‌లో కాంగ్రెస్ ఆరోపించింది. లక్షలాది మంది రైతులు, దినసరి కూలీల భవిష్యత్తును నాశనం చేశారని విమర్శించింది. భారత భూభాగంలో చైనా ఆక్రమణలపై మోదీ ప్రభుత్వం మౌనంగా ఉందని కాంగ్రెస్ ఆరోపించింది. అగ్నిపథ్ పథకంతో సైన్యాన్ని బలహీన పరుస్తోందని, ఎన్నికల కమిషన్, ఈడీ, ఆర్బీఐల స్వతంత్రతను దెబ్బతీస్తోందని, మీడియాతో పాటు ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని వాటిని అంతం చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించింది. విద్వేషం, విభజన రాజకీయాలతో దేశ సామాజిక వ్యవస్థను నాశనం చేశారని దుయ్యబట్టింది.

సస్పెండ్ చేసి బిల్లుల ఆమోదమా?

ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి సభలో బిల్లులు ఆమోదింపజేసుకోవడం ప్రజాస్వామ్యం అవుతుందా అని మోదీ సర్కారును ఖర్గే నిలదీశారు. "బిల్లుల నాణ్యతను పరిశీలించిన అనంతరం వాటిని ఆమోదించేందుకే ఈ సభ ఉందని రాజ్యసభ మొదటి చైర్మన్ ఎస్ రాధాకృష్ణన్ చెప్పారు. కానీ, మీరు ఆ పని చేయడం లేదు. స్టాండింగ్ కమిటీకి పంపకుండా సభ్యులను సస్పెండ్ చేసి బిల్లులకు ఆమోదం పొందుతున్నారు. ప్రజాస్వామ్యం అనేది సభ్యుల సంఖ్యపై ఆధారపడి ఉండదని రాజ్యసభలో ఖర్గే అన్నారు.

మన్మోహన్ స్ఫూర్తిప్రదాత

- ఆగ్రహ స్వరానికి భిన్నంగా కాంగ్రెస్ మాజీ ప్రధానిపై మోదీ ప్రశంసలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌ను స్ఫూర్తిప్రదాత అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కూడా, చక్రాల కుర్చీలో రాజ్యసభకు వచ్చి ఢిల్లీ సర్వీసు బిల్లు-2023పై చర్చలో మన్మోహన్ పాల్గొన్నారని మోదీ గుర్తుచేశారు. గురువారం పార్లమెంటులో ఆయన.. రాజ్యసభ నుంచి పదవీవిమరణ చేస్తున్న 52మంది సభ్యుల గౌరవార్థం మాట్లాడారు. ఈ సందర్భంగా రాజకీయ విభేదాలను కొంత పక్కనపెట్టి ఒకింత భావోద్వేగ ధోరణిని ప్రదర్శించారు. రాజ్యసభనూ, దేశాన్నీ తన హయాంలో స్ఫూర్తిమంతంగా మన్మోహన్ నడిపించారని కొనియాడారు. "ప్రధానమంత్రిగా మన్మోహన్ 2004 నుంచి 2014 వరకు పనిచేశారు. ప్రజాస్వామ్యం ప్రస్తావనకు వచ్చినప్పుడల్లా మన్మోహన్ సింగ్ సుదీర్ఘకాలం అందించిన సేవలనూ దేశం గుర్తు చేసుకుంటుంది. చర్చల సందర్భంగా ఎన్నోసార్లు మేం సభలో పరస్పరం విభేదించుకున్నాం. కానీ అది తాత్కాలికమే. ఓ బిల్లును అధికార పక్షం తేలిగ్గా నెగ్గించుకోగలదని అర్థం అవుతున్నా, మన్మోహన్ సింగ్ చక్రాలకుర్చీలో రాజ్యసభకు వచ్చి ఓటింగ్ చేశారు. ప్రతిపక్ష సభ్యునిగా తన విధులను విస్మరించని ఆయన అంకితభావానికి ఇదే నిదర్శనం" అని మోదీ వ్యాఖ్యానించారు. కాగా, యూపీఏ పాలనపై శ్వేతపత్రంతో సిద్ధమైన నరేంద్ర మోదీ, అందులోభాగంగా వ్యూహాత్మకంగానే మన్మోహన్ సింగ్‌ను పొగడ్తలతో ముంచెత్తారని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి.

తెలంగాణలో కాంగ్రెస్‌కు 10 సీట్లు

- కమలానికి 3.. కారుకు 3.. మజ్లిస్‌కు 1
- ఇండియా టుడే 'మూడ్ ఆఫ్ ద నేషన్' పోల్‌లో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అసెంబ్లీలో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికల్లో కూడా మెజారిటీ సీట్లు గెలుచుకుంటుందని ఇండియా టుడే 'మూడ్ ఆఫ్ ద నేషన్' అభిప్రాయ సేకరణలో తేలింది. తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ 10 సీట్లు గెలుచుకుంటుందని ఇండియా టుడే తెలిపింది. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ కేవలం మూడు సీట్లే దక్కుతాయని.. తెలంగాణలో ఎక్కువ సీట్లపై ఆశలు పెట్టుకున్న బీజేపీకి 3 సీట్లే వస్తాయని.. మజ్లిస్‌కు యథాప్రకారం ఒక్క సీటు లభిస్తుందని పేర్కొంది. బీఆర్ఎస్‌కు 29.1%, బీజేపీకి 21.1% ఓట్లు లభిస్తే.. కాంగ్రెస్‌కు 41.2% మేరకు భారీగా ఓట్లు లభిస్తాయని ఈ పత్రిక అంచనా వేసింది. ఈసారి లోక్‌సభలో 400 సీట్లు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ.. తెలంగాణపై మరింతగా దృష్టి సారించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ కిందటిసారికన్నా ఈసారి ఆ పార్టీకి ఒక సీటు తక్కువగానే వస్తుందని ఇండియా టుడే సర్వేలో తేలడం గమనార్హం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 9 సీట్లు రాగా బీజేపీకి 4, కాంగ్రెస్‌కు 3 సీట్లు వచ్చిన సంగతి తెలిసిందే. కాగా.. ఇండియాటుడే సంస్థ ఈ సర్వేను 2023 డిసెంబరు 15 నుంచి 2024 జనవరి 28 నడుమ నిర్వహించింది. అన్ని లోక్‌సభ సీట్ల పరిధిలో 35,801 మందిని ప్రశ్నించి ఈ రిపోర్టు విడుదల చేసింది.

ఏపీలో మూడ్ మారుతోంది!

- టీడీపీ గెలుపు ఖాయం.. వైసీపీ ఓటమి తథ్యం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ ప్రజల మూడ్ మారింది! వైసీపీ సర్కారుకు మూడినట్లే అని తేలింది. తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమని స్పష్టమైంది. 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరుతో నిర్వహించిన తాజా సర్వే ఫలితాలను 'ఇండియా టుడే' సంస్థ గురువారం వెల్లడించింది. 'ఇండియాటుడే' ప్రతి ఆరు నెలలకోసారి ఈ సర్వే నిర్వహిస్తోంది. రెండేళ్లుగా ఏపీలో ప్రజల మూడ్ మారుతోందని, జగన్ పాలన పట్ల విముఖత, తెలుగుదేశానికి ఆదరణ పెరుగుతోందని ఈ సర్వే ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. డిసెంబరు 15వ తేదీ నుంచి జనవరి 28 మధ్య సర్వే నిర్వహించారు. దీని ప్రకారం.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే రాష్ట్రంలోని పాతిక ఎంపీ సీట్లలో టీడీపీ 17 సీట్లు గెలుచుకునే అవకాశముంది. వైసీపీకి ఎనిమిది వస్తాయని ఈ సర్వే వెల్లడించింది. టీడీపీకి 45% ఓట్లు వస్తాయని.. వైసీపీ 41.1 శాతానికే పరిమితమవుతుందని తేలింది. ఇక బీజేపీకి 2% కాంగ్రెస్‌కు 3% ఓట్లు వస్తాయని సర్వేలో వెల్లడైంది. జనసేనకు పోయినసారి వచ్చినంతే ఈసారీ వస్తాయని అనుకొంటే జనసేన ఓట్లు సుమారుగా ఏడు శాతం అవుతాయి. టీడీపీకి వచ్చే 45% ఓట్లకు జనసేన 7% కలిపితే.. ఈ కూటమికి 52% ఓట్లు పడే అవకాశముంది. ఇక బీజేపీకి 2% ఓట్లు పడతాయన్నది ఈ సర్వే అంచనా! దీనిప్రకారం టీడీపీ-జనసేన-బీజేపీ కలిసి పోటీ చేస్తే.. కూటమి ఓట్లు 54శాతానికి చేరుకుంటాయి.

మోదీ హ్యాట్రిక్ ఖాయం!

- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా 304 సీట్లు.. ఎన్‌డీఏకు 335
- ఇండియాకు 166 సీట్లు.. కాంగ్రెస్-71
- ఇండియాటుడే 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో బీజేపీ మరోసారి విజయ కేతనాన్ని ఎగరవేయనుందని 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరుతో ఇండియాటుడే చానల్ నిర్వహించిన సర్వే వెల్లడించింది. బీజేపీ 304 సీట్లతో సొంతంగా మెజారిటీ సాధించి వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని, బీజేపీ భాగస్వామ్య పక్షాలను కూడా కలుపుకొంటే ఎన్‌డీఏ కూటమి బలం 335 స్థానాలకు చేరుకోనుందని ఈ సర్వే తెలిపింది. బీజేపీని ఈసారి కేంద్రంలో గద్దె దించాలని భావిస్తున్న ప్రతిపక్ష ఇండియా కూటమి 166 సీట్లకే పరిమితమవుతుందని, కాంగ్రెస్ 71 సీట్లను గెల్చుకుంటుందని పేర్కొంది. సర్వేలో భాగంగా గత ఏడాది డిసెంబరు 15-జనవరి 28 మధ్య దేశంలోని 543 నియోజకవర్గాల్లో 35,801 మంది వ్యక్తులను ఇండియాటుడే సర్వే చేసింది. ఈ సర్వే వెల్లడించిన వివరాల ప్రకారం.. అత్యధికంగా 80 స్థానాలున్న యూపీలో మరోసారి బీజేపీ ప్రభంజనం సృష్టించనుంది. ఆ పార్టీ సొంతంగా 70 సీట్లను, మిత్రపక్షం అప్నాదళ్ (ఎస్) 2 సీట్లను గెల్చుకోనున్నాయి. 2019లో ఈ రెండు పార్టీలకు కలిపి 64 సీట్లు (బీజేపీ 62) రాగా ఇప్పుడు అవి పెరగనున్నాయి. ఇక ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన సమాజ్‌వాదీపార్టీ గత ఎన్నికల్లో గెల్చుకున్న 15 స్థానాల్లో 8 కోల్పోయి, ఈసారి కేవలం ఏడు స్థానాలకు పరిమితం కానుంది. కాంగ్రెస్ కేవలం ఒక్క సీటునే గెల్చుకోనుంది. బీఎస్పీకి ఒక్క సీటు కూడా దక్కే అవకాశాలు లేవు. యూపీ తర్వాత అత్యధిక సీట్లున్న మహారాష్ట్ర (48)లో ప్రధాన పార్టీలుగా ఉన్న శివసేన, ఎన్సీపీలు అంతర్గతపోరుతో రెండు శిబిరాలుగా చీలిపోయిన విషయం తెలిసిందే. శివసేనలో ఉద్ధవ్ వర్గం, ఎన్సీపీలో శరద్‌పవార్ వర్గం ఇండియా కూటమిలో ఉండగా, సీఎం ఏక్‌నాథ్‌షిండే నాయకత్వంలోని శివసేన, అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ ఎన్‌డీఏలో ఉన్నాయి. ఈ రాష్ట్రంలో మెజారిటీ సీట్లు (26) ఇండియా కూటమి గెల్చుకోనుంది. కూటమిలోని కాంగ్రెస్ 12 సీట్లు, మిత్రపక్షాలతో కలిసి 14 సీట్లు గెల్చుకోనున్నాయి. ఇక 42 సీట్లు ఉన్న పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ 22 సీట్లను గెల్చుకోనుంది. బీజేపీకి 19 సీట్లు, కాంగ్రెస్‌కు ఒక్క సీటు లభించవచ్చు. 40 సీట్లున్న బిహార్‌లో ఎన్‌డీఏ 32, ఇండియా 8 సీట్లను గెల్చుకోవచ్చు. 39 సీట్లున్న తమిళనాడులో అన్ని సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్‌లతో కూడిన ఇండియా కూటమి గెల్చుకోనుంది. గుజరాత్, రాజస్థాన్‌లను గత ఎన్నికల్లోలాగే ఈసారి కూడా బీజేపీ పూర్తిగా స్వీప్ చేయనుం

ఎవరికెన్ని సీట్లు?

రాష్ట్రం (మొత్తం సీట్లు)	ఎన్‌డీఏ	ఇండియా
	(2019తో పోల్చితే పెరుగుదల/తగ్గుదల)	
ఉత్తరప్రదేశ్ (80)	72 (+8)	8 (-8)
మహారాష్ట్ర (48)	22 (-19)	26 (+21)
పశ్చిమ బెంగాల్ (42)	19 (+1)	23 (-1)
బిహార్ (40)	32 (-7)	8 (+7)
తమిళనాడు (39)	0	39 (+1)
మధ్యప్రదేశ్ (29)	27 (-1)	2 (+1)
కర్ణాటక (28)	24 (-3)	4 (+3)
గుజరాత్ (26)	26	0
రాజస్థాన్ (25)	25	0
ఆంధ్రప్రదేశ్ (25) ఇతరులు (టీడీపీ-17; వైఎస్సార్‌సీపీ-8)	0	0
కేరళ (20)	0	20
తెలంగాణ (17)	3 (-1) ఇతరులు-4	10 (+7)
ఝార్ఖండ్ (14)	12	2
అస్సాం (14)	12 (+3)	2 (-1)
పంజాబ్ (13)	2 (-2) ఇతరులు-1	10 (+1)
హరియాణ (10)	8 (-2)	2 (+2)
ఢిల్లీ (7)	7	0
ఉత్తరాఖండ్ (5)	5	0
జమ్మూకశ్మీర్ (5)	2	3
హిమాచల్ ప్రదేశ్ (4)	4	0

(+/- గుర్తులు లేనివి.. 2019 ఎన్నికలతో పోల్చితే మార్పు లేనివి. ఆయా రాష్ట్రాల్లో ఫలితాలు నాడు, నేడు ఒకే విధంగా ఉంటాయని అంచనా)

'ధరణి' పెండింగ్ దరఖాస్తులు నెలలో క్లియర్!

- వీటి పరిష్కారానికి గ్రామ సభల నిర్వహణ
- మధ్యంతర నివేదికను సిద్ధం చేసిన ధరణి కమిటీ.. త్వరలోనే ప్రభుత్వానికి అందజేత

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ధరణిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను నెల రోజుల్లో పరిష్కరించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వీటి పరిష్కారం కోసం ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ఆధారంగా వాటిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ధరణి పోర్టల్ ద్వారా వివిధ జిల్లాల నుంచి సీసీఎల్ఏకు వచ్చి పెండింగ్‌లో ఉన్న 2.31 లక్షల దరఖాస్తులతోపాటు పార్ట్-బిలో నమోదు చేసిన 18 లక్షల అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన కీలక సిఫారసులను ధరణి కమిటీ తన మధ్యంతర నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది. ఈ నివేదికను కమిటీ త్వరలోనే ప్రభుత్వానికి అందించనున్నట్లు సమాచారం. ధరణి కమిటీ కన్వీనర్, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిత్తల్, సభ్యులు మాజీ సీసీఎల్ఏ రేమండ్ పీటర్, కోదండరెడ్డి, మధుసూదన్‌లతోపాటు సీఎంఆర్వో ప్రాజెక్టు డైరెక్టర్ వి.లచ్చిరెడ్డి.. భూములతో ముడిపడి ఉన్న ఆయా శాఖల ఉన్నత అధికారులతో దాదాపు 15రోజులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇందులో భాగంగా కమిటీ సభ్యులు గుర్తించిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు పలు సిఫారసులతో కూడిన నివేదికను రూపొందించారు. ఇందులో కమిటీ రెండు ప్రధానమైన సిఫారసులు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. వీటిలో మొదటి సిఫారసు విషయానికివస్తే.. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారులు భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టి అప్పుడు భూ రికార్డులను పార్టు-ఎ, పార్ట్-బిగా విభజించారు. పార్ట్-ఎలో వివాదాలు లేని, రికార్డులు స్పష్టంగా ఉన్న వాటిని నమోదు చేశారు. పార్ట్-బిలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు సంబంధించినవి, అభ్యంతరాలున్న పట్టా భూములను నమోదు చేశారు. పట్టా భూమి అయినప్పటికీ ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది మధ్య నెలకొన్న వివాదాలు, కోర్టుల పరిధిలో ఉన్నవి, ఎండోమెంట్, వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉన్నవి, అటవీ శాఖకు చెందిన భూములను పార్ట్-బిలో నమోదు చేశారు. వారసుల మధ్య పంపకాల సందర్భంగా నెలకొన్న వివాదాలు, పీవోబీ జాబితాలోని భూములు నమోదు చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహించాలి. ఈ సదస్సులకు తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారు, ఆర్ఐ, సర్వే అధికారులు హాజరై పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిటీ పేర్కొన్నట్టు తెలిసింది. ధరణి చట్టంలో మార్పులు చేయకుండానే ఓ సర్క్యులర్ ద్వారా తహశీల్దారుకు అధికారాలు కట్టబట్టవచ్చని కమిటీ సూచించినట్టు తెలిసింది.

ఆ సమస్యల పరిష్కారానికి చట్టసవరణ!

రెండో సిఫారసులో భాగంగా దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారానికి చట్ట సవరణ అవసరమని కమిటీ పేర్కొన్నట్టు సమాచారం. కమిటీ ఇప్పటికే జిల్లాల కలెక్టర్లు, ఎండోమెంట్, వక్ఫ్‌బోర్డు, సర్వేలాండ్ సెటిల్‌మెంట్, రిజిస్ట్రేషన్, అటవీశాఖ, గిరిజన సంక్షేమశాఖ, టీఎస్ఐఐసీతో సమావేశమైంది. ఆయా శాఖల నుంచి సమస్యలు, పరిష్కార మార్గాలు, సూచనలు, సలహాలు స్వీకరించింది. ధరణిలో పెండింగ్ ఉన్న అర్జీల వివరాలను సైతం సేకరించి ఆయా శాఖల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం జాబితాలో నమోదు చేశారు. వీటి పరిష్కారానికి భూసర్వే తప్పనిసరిగా చేయాలని కమిటీ పేర్కొన్నట్టు సమాచారం. సాదాబైనామా కోసం చట్టానికి సవరణ చేయాలని సూచించినట్టు తెలిసింది. వివాదాల కేసులు కోర్టుల్లో ఉండగా వాటిని కూడా పరిష్కరించాలని సిఫారసు చేసినట్టు సమాచారం. ధరణి కమిటీ తన నివేదికను త్వరలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అందజేయనున్నట్టు కమిటీ సభ్యుడు కోదండరెడ్డి తెలిపారు.

కేసీఆర్.. ఎక్స్‌పైర్డ్ మెడిసిన్

తెలంగాణ పట్ల ఆయనకు కమిట్‌మెంట్ లేదు

అధికారం పోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు

» మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ఎక్స్‌పైర్డ్ మెడిసిన్ లాంటి వారని, అధికారం పోవడాన్ని ఆయన ఇంకా జీర్ణించుకోలేక పోతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ పట్ల ఆయనకు కమిట్‌మెంట్ లేదని విమర్శించారు. ఉంటే.. ఉభయసభలను ఉద్దేశించి చేసిన గవర్నర్ ప్రసంగానికి, శాసనసభ బీఏసీ సమావేశానికి కేసీఆర్ ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. శాసనసభకు కేసీఆర్ బరాబర్ రావాలని, ప్రతిపక్ష నేతగా ఆయన బాధ్యత నిర్వర్తించాలనే తాను కోరుకుంటానన్నారు. కానీ ఆయనకే మొహం లేక రావట్లేదన్నారు. ప్రజలు కూడా కేసీఆర్, బీఆర్ఎస్ గురించి పట్టించుకోవడం, ఆలోచించడం మానేశారన్నారు. అసెంబ్లీలోని తన చాంబర్‌లో గురువారం మీడియా ప్రతినిధులతో సీఎం రేవంత్ చిట్‌చాట్‌గా మాట్లాడారు. కాళేశ్వరం నిర్మాణంలో అవినీతిపై నిబంధనల ప్రకారమే ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. ప్రాజెక్టుపై విచారణకు సిట్టింగ్ జడ్జిని ఇవ్వలేమని, రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించుకోవాలని హైకోర్టు సూచించినట్లు వెల్లడించారు. దీనిపై మంత్రివర్గంలో గానీ, అసెంబ్లీలో గానీ చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మిషన్ భగీరథపైనా విచారణకు ఆదేశించామన్నారు. కాళేశ్వరం అవినీతిని పక్కదారి పట్టించేందుకు కేఆర్ఎంబీ అంశాన్ని కేసీఆర్ తెరపైకి తెచ్చారని ఆరోపించారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని విమర్శించారు. ఏపీ మంత్రి రోజా పెట్టిన చేపల పులుసు తిని.. రాయలసీమను రతనాల సీమగా మారుస్తానంటూ కేసీఆర్ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. బేసిన్లు లేవు.. బేషజాలూ లేవు.. అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలే తెలంగాణ పట్ల ఆయనకున్న కమిట్‌మెంట్‌ను తెలియజేస్తోందన్నారు. కేసీఆర్ కమిట్‌మెంట్‌పై ఆయన మేనల్లుడు హరీశ్‌కూ అనుమానం ఉందన్నారు. కృష్ణా జలాల విషయంలో ఆయన చిత్తశుద్ధిని చూసే.. ఆయకట్టు ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను తిరస్కరించారని, ఆయా జిల్లాల్లో ఆ పార్టీకి ఆ పార్టీకి కేవలం నాలుగు సీట్లే వచ్చాయని గుర్తు చేశారు. ఏపీ సీఎం వైఎస్ జగన్.. నాగార్జున సాగర్‌కు పోలీసులను పంపి ఆక్రమించినప్పుడు కేసీఆర్ ఎక్కడున్నారు? ప్రశ్నించారు.

పకడ్బందీగా టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లు

టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ల అంశంలోనూ ప్రొసీజర్ ప్రకారమే ముందుకు వెళుతున్నామని సీఎం రేవంత్ తెలిపారు. నిరుద్యోగులు ఇబ్బందులుపడకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని పునరుద్ఘాటించారు. గతంలో జరిగిన గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయం మార్పు అన్నది స్పీకర్ నిర్ణయమని చెప్పారు. బీఏసీ సమావేశానికి బీఆర్ఎస్ తరఫున కేసీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్లు మాత్రమే ఇచ్చారని, ఇచ్చిన పేర్లలో హరీశ్‌రావు పేరు ఉంటే ఎందుకు అడ్డుకుంటామని ప్రశ్నించారు. అనుమతించాలా.. లేదా అన్నది స్పీకర్ నిర్ణయమని స్పష్టం చేశారు. రేపు కేటీఆర్‌కు బదులుగా హిమాన్షు వస్తానంటే.. అనుమతించేస్తామా? అని నిలదీశారు. కులగణనపై ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తీర్మానం ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తనను కలవడంపై స్పందిస్తూ.. సీఎం తాను ఎవరినైనా కలుస్తానని, అవసరమైతే కేసీఆర్‌నూ కలుస్తానన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందంటూ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై రేవంత్ స్పందిస్తూ.. ఆయన ఒక నాన్ సీరియస్ పొలిటీషియన్, అలాంటి వాళ్ల మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని సోనియాగాంధీని కలిసి కోరామని తెలిపారు.

ఇసుక అంతా.. అవినీతి దందా

"ఇసుక అక్రమ రవాణాపై ఈనెల 3 నుంచి రవాణా విభాగంతో నిజామాబాద్, వరంగల్ రూట్లలో ఆకస్మిక తనిఖీలు చేయించాను. 83 ఇసుక లారీలను తనిఖీ చేస్తే.. 22 లారీలకు అసలు అనుమతే లేదు. ఒకే పర్మిట్, ఒకటే నెంబర్‌తో నాలుగైదు లారీలు ఇసుక రవాణా చేస్తున్నట్లు తేలింది. ఈ లెక్కన మొత్తం ఇసుకలో 25 శాతానికిపైగా అక్రమంగా తరలిపోతోంది.. అక్రమాలను గుర్తించాల్సిన టీఎస్‌ఎండీసీ అధికారులు ఏం చేస్తున్నారు? నిద్రపోతున్నారా?" అని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఎస్ఎండీసీ అధికారులతో గురువారం సచివాలయంలో సమీక్షించారు. ప్రస్తుత ఇసుక విధానం అవినీతి దందాగా మారిందన్నారు. అక్రమాలకు ఆస్కారం లేని విధంగా కొత్త పాలసీని తీసుకురావాలని సూచించారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలని, 48 గంటల్లోగా అధికారులు పద్ధతి మార్చుకోవాలని గడువు విధించారు. రెండురోజుల తర్వాత విజిలెన్స్, ఏసీబీలతో తనిఖీలు చేయించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. టోల్‌గేట్ల వద్ద నమోదైన డేటా ఆధారంగా ఇసుక లారీల తతంగాన్ని బయటకు తీయాలని, బాధ్యులైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టవద్దని స్పష్టం చేశారు. టీఎస్‌ఎండీసీ కేంద్రంగా జరుగుతున్న అక్రమాలను అరికట్టి, గనులు, భూగర్భ వనరుల విభాగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని సీఎస్‌ను ఆదేశించారు. కాగా, హైదరాబాద్ చుట్టుపక్కల అనుమతి లేకుండా నిర్వహించే స్టోన్ క్రషర్స్‌ను సీజ్ చేయాలని సీఎం ఆదేశించారు. అనుమతులు ఇచ్చేటప్పుడే ఆ భవనాల వివరాలు సదరు విభాగానికి చేరేలా ఇంటిగ్రేటెడ్ ఆన్‌లైన్ విధానం అమలు చేయాలని సూచించారు. గ్రానైట్, ఖనిజాల అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు జియో ట్యాగింగ్, జీపీఆర్ఎస్‌ను వినియోగించాలని పేర్కొన్నారు. గ్రానైట్‌తోపాటు ఇతర క్వారీలకు సంబంధించిన పెండింగు కేసుల వివరాలు, పురోగతిపై నివేదిక అందించాలని ఆదేశించారు.

నాయకుల జోక్యం ఉండదు

భూగర్భ గనుల శాఖలో అవినీతిపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులు తమ సమస్యలనూ సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. దీనిపై సీఎం స్పందిస్తూ.. "ఇప్పుడు మీపై ఎవరి ఒత్తిడి ఉండదు. అవినీతి, అక్రమాలపై కఠినంగా వ్యవహరించండి.. అక్రమాలను అడ్డుకోకుండా మీ విధుల్లో ఎవరూ జోక్యం చేసుకోరు" అని చెప్పినట్లు తెలిసింది.

నేటి నుంచి పుస్తకమహోత్సవం!

» 10 రోజుల పాటు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): పుస్తక ప్రియులకు పండగే పండగ! 200కు పైగా ఇంగ్లిష్, 110కి పైగా తెలుగు, 30కి పైగా హిందీ తదితర భాషలతో 360కుపైగా స్టాళ్లతో కూడిన హైదరాబాద్ జాతీయ పుస్తక మహోత్సవం! ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభం కానుంది. 10 రోజుల పాటు.. అంటే 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. శని, ఆదివారాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు, మిగతా రోజుల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సందర్శకులను అనుమతిస్తారు. ఈ మేరకు బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్ వెల్లడించారు. ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన గద్దర్ స్మారక పుస్తక ప్రదర్శన ప్రాంగణాన్ని శుక్రవారం మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అమరవీరుల స్మారకంగా ఇక్కడ ఏర్పాటు చేయనున్న 12 అడుగుల స్థూపాన్ని తెలంగాణ ఉద్యమనేత కోదండరాం, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి ప్రారంభించనున్నట్లు కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ తెలిపారు. ఫిబ్రవరి 10-18 వరకు రోజూ మధ్యాహ్నం బాల వికాస్ పేరుతో రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యక్షుడు కోయ చంద్రమోహన్ వివరించారు. వారం పాటు రోజూ సాయంత్రం సాహిత్య చర్చాగోష్ఠులు, రచయితలతో ముఖాముఖి కార్యక్రమాలున్నట్లు తెలిపారు.

ప్రేమపై నెత్తుటి కత్తి!

22 ఏళ్ల యువతిని నరికి చంపిన ఉన్మాది





అలేఖ్య (ఫైల్), నిందితుడు శ్రీకాంత్

» ఖానాపూర్‌లో పట్టపగలు నడిరోడ్డుపై ఘాతుకం

» మరో మహిళ, మూడేళ్ల బాలుడికి తీవ్రగాయాలు

ఖానాపూర్, ఫిబ్రవరి 8: ప్రేమ పేరుతో కొన్నాళ్లుగా యువతి వెంట పడుతున్న ఓ యువకుడు ఉన్మాదిగా మారాడు. పథకం ప్రకారం ఆమెను పట్టపగలు నడ్డిరోడ్డు మీద అందరూ చూస్తుండగా కత్తితో నరికి దారుణంగా హత్య చేశాడు. నిజామాబాద్ జిల్లా ఖానాపూర్‌లో ఈ ఘోరం జరిగింది. యువతిపై దాడిని అడ్డుకునేందుకు యత్నించిన హతురాలి బంధువు, ఆ బంధువు మూడేళ్ల కుమారుడిపైనా ఉన్మాది కత్తి దూయడంతో ఆ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. హతురాలు 22 ఏళ్ల అలేఖ్య (22), నిందితుడు 23 ఏళ్ల జూకింది శ్రీకాంత్. ఇద్దరు కూడా ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి చెందినవారు! నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఖానాపూర్ ఎస్సై లింబాద్రి, హతురాలి కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. ఖానాపూర్‌లోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో అలేఖ్య శ్రీకాంత్ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అలేఖ, శ్రీకాంత్ డిగ్రీ దాకా చదివారు. అలేఖ్య టైలరింగ్ చేస్తుంటే.. శ్రీకాంత్ ఏ పనీ చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. రోజూ మద్యం తాగుతూ ఆ మత్తులో స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. శ్రీకాంత్ తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. పద్ధతిగా ఉండాలంటూ తల్లి ఎంతగా నచ్చజెప్పినా శ్రీకాంత్ వినిపించుకోలేదు. ఈ క్రమంలోనే ప్రేమిస్తున్నానంటూ తనను పెళ్లి చేసుకోవాలంటూ గత ఐదేళ్లుగా అలేఖ్యను వెంటపడి వేధిస్తున్నాడు. తన కా ఉద్దేశం లే దని, తన జోలి కి రావొద్దంటూ అలేఖ్య మొదట్నుంచీ అతడిని హెచ్చరిస్తూ వస్తోంది. శ్రీకాంత్ మాత్రం వేధింపులను మానుకోలేదు. అతడి చేష్టలు మితిమీరడంతో విషయాన్ని అలేఖ్య తన కుటుంబసభ్యులకు చెప్పింది. రెండు నెలల క్రితం ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో శ్రీకాంత్‌పై ఫిర్యాదు కూడా చేసింది. పోలీసులు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి, హెచ్చరించారు. అయినా అలేఖ్యను వేధించడం మానుకోలేదు. గురువారం అలేఖ్య తన వదిన జయశీల, జయశీల మూడేళ్ల రియాన్స్‌తో కలిసి ఖానాపూర్‌లోని మార్కెట్ నుంచి ఇంటికి తిరిగి వెళుతుండగా శివాజీనగర్ వద్ద శ్రీకాంత్ అడ్డుకున్నాడు. తన వెంట తెచ్చుకున్న పదునైన కత్తితో అలేఖ్యపై విచక్షణారహితంగా దాడి చేశాడు. అలేఖ్య మృతిచెందగా, దాడిని అడ్డుకునేందుకు యత్నించిన జయశీల, రియాన్స్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని నిర్మల్‌లోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తమ కూతురును దారుణంగా చంపిన శ్రీకాంత్‌ను ఉరితీయాలని అలేఖ్య కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. నిందితుడు శ్రీకాంత్‌ను కఠినంగా శిక్షించాలని ఖానాపూర్ వాసులు, ప్రభుత్వాస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు.

అలేఖ్యకు పెళ్లి కుదరడంతోనే

అలేఖ్య, శ్రీకాంత్.. తొమ్మిదేళ్ల క్రితమే ప్రేమించుకున్నారని, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి చెప్పడం గమనార్హం. శ్రీకాంత్ వ్యవహార శైలి నచ్చకపోవడంతోనే అతడిని అలేఖ్య దూరం పెట్టిందని పేర్కొన్నారు. అలేఖ్యకు ఇటీవల పెళ్లి కుదరడంతో శ్రీకాంత్ కక్షగట్టి ఆమెను దారుణంగా హత్య చేశాడని తెలిసిందన్నారు.

కత్తులతో దాడి చేసి.. మర్మాంగాలు కోసి..

» రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణహత్య

» లావాదేవీల పరంగా స్పర్థలతో స్నేహితుడి ఘాతుకం

» పథకం ప్రకారం మహిళతో ఫోన్ చేసి పిలిపించి..

» పది మంది దుండగులతో వెళ్లి ఆయుధాలతో దాడి



రాము (ఫైల్)

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణహత్యకు గురయ్యాడు. ఆర్థిక లావాదేవీల పరంగా తేడాలు రావడంతో కిరాయి మనుషులతో కలిసి స్నేహితుడే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. హతుడు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ సమీపంలోని సింగోటం గ్రామానికి చెందిన పుట్ట రాము అలియాస్ సింగోటం రామన్న (35). ఆయనో వ్యాపారి. అదనపు ఆదాయం కోసం రియల్ ఎస్టేట్ రంగంలోకి దిగాడు. నాగర్‌కర్నూల్ నుంచి కుత్బుల్లాపూర్ వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని విస్తరించాడు. కుటుంబసభ్యులను స్వగ్రామంలోనే ఉంచి రాము మాత్రం పేట్‌బషీరాబాద్‌లో ఓ విల్లాలో ఉంటున్నాడు. కొల్లాపూర్ ప్రాంతంలో అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ పేరుతో సేవా సంస్థ ఏర్పాటు చేసి పలు సామాజిక కార్యక్రమాలు చేస్తున్నాడు. త్వరలో బీజేపీలో చేరి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయాలనే ఆలోచనలో ఉన్నాడు. వ్యాపారాన్ని మరింత విస్తరించే క్రమంలో మణికంఠ అనే వ్యక్తితో రాముకు పరిచయం ఏర్పడింది. అతడితో వ్యాపార లావాదేవీలు పెరగడంతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఇద్దరు కలిసి యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్‌లో ఓ మహిళ వద్దకు వచ్చి వెళుతుండే వారు. అక్కడే పేకాటాడడం, మద్యం తాగడం వంటివి చేస్తుండే వారు. వ్యాపార లావాదేవీల విషయంలో రాము, మణికంఠ మధ్య విభేదాలు తలెత్తాయి. ఇవి పరస్పరం దాడులు చేసుకునేదాకా వెళ్లాయి. పరస్పరం కేసులు కూడా పెట్టుకున్నారు. రాము మీద కక్ష పెంచుకున్న అతడికి మణికంఠ హత్య చేసేందుకు పథకం వేశాడు. బోరబండకు చెందిన రౌడీషీటర్‌కు సుపారీ ఇచ్చాడు. ఆ రౌడీషీటర్ కొంత మంది తన అనుచరులను సిద్ధం చేసుకున్నాడు. పథకం ప్రకారం మణికంఠ ఎల్ఎన్‌నగర్‌లోని మహిళ ఇంటికి వెళ్లాడు. ఆమెతో రాముకు ఫోన్ చేయించి పిలిపించాడు. బుధవారం రాము మహిళ ఇంటికి వచ్చి మద్యం తాగుతుండగా మణికంఠతో పాటు మరో తొమ్మిది మంది కత్తులు, ఆయుధాలతో వచ్చారు. రాముపై విచక్షణారహితంగా దాడి చేశారు. అతడి మర్మాంగాలను కోసేశారు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆయన మృతి చెందాడని నిర్ధారించుకున్నాక దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. స్థానికుల సమాచారంతో అర్ధరాత్రి దాటిన తర్వాత జూబ్లీహిల్స్ పోలీసులు, క్లూస్ టీమ్ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కాగా మణికంఠతో పాటు రౌడీషీటర్.. పోలీసుల ముందు ఆయుధాలతో లొంగిపోయినట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చీల్చినవారిదే పార్టీ!

అఖిలభారత జాతీయ కాంగ్రెస్‌కు విదేశీ సోనియాగాంధీ నాయకత్వం వహించడాన్ని సవాలుచేసి, పార్టీనుంచి సస్పెండ్ అయి, పి.ఎ.సంగ్మా, తారీఖ్ అన్వర్లతో కలసి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన శరద్‌పవార్ పాతికేళ్ళ తరువాత పార్టీపేరూ, గుర్తూ కోల్పోవాల్సి వచ్చింది. ఎన్సీపీని, గడియారం గుర్తును చీలికవర్గానికి ఎన్నికల సంఘం దఖలుపరిచి, మూడురకాల పేర్లలో ఏది కావాలో ఎంచుకోమనడంతో ఈ మరాఠా రాజకీయయోధుడి పార్టీ చివరకు శరద్‌చంద్రపవార్ ఎన్సీపీగా మిగిలింది. సమయాన్ని చూపించే గడియారం తమ వద్దే ఉన్నందుకు ఇది అజిత్‌పవార్ కాలం అని ఎన్డీయేలో చేరిన వర్గం గుర్తుచేస్తున్నది. ఎన్నిపోయినా పర్లేదు, పెద్దాయన ఉన్నందున కాలం మాకే కలిసొస్తుందని మరో వర్గం గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది.

సార్వత్రిక ఎన్నికల తరుణంలో ఈ ఎదురుదెబ్బకు ప్రతీకారంగా కుటుంబం కంచుకోట బారామతి నుంచి శరద్‌పవార్ లోక్‌సభకు పోటీచేయబోతున్నారని ఓ పెద్ద ప్రచారం ఊపందుకుంది. శరద్‌పవార్ కుమార్తె సుప్రియాసూలే ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ స్థానంలో తమ అభ్యర్థిని దింపబోతున్నట్టు ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ ప్రకటించిన నేపథ్యంలో, బారామతి బరిలోకి పెద్దాయనే రావాలని కార్యకర్తలంతా ఆశపడ్డారు. శరద్‌పవార్ రాజ్యసభ సభ్యత్వం ఇంకా ఉన్నదని, ఆయన లోక్‌సభ పోటీలోకి దిగే ప్రశ్నే లేదని రాష్ట్రశాఖ అధ్యక్షుడు జయంత్ పాటిల్ గురువారం స్పష్టంచేయడంతో కార్యకర్తలు నిరుత్సాహపడ్డారట. తన జీవితకాలంలో పార్టీలను నిర్మించి, పలుమార్లు చీల్చిన ఈ రాజకీయదురంధరుడికి ఎనభైమూడేళ్ళ వయసులో ఉన్నది కోల్పోవడం, ఎన్నికలముందు కొత్తగా పునాదులు వేసుకోవాల్సిరావడం దురదృష్టకరమైన స్థితే.

గతానికి ఇప్పటికీ తేడావుంది. ఇప్పుడు ఆయన తన కుటుంబీకుడు, అప్పుడు, ఇంతకాలమూ పార్టీలో చక్రం తిప్పిన అజిత్‌పవార్‌తో పోరాడాలి. సార్వత్రిక ఎన్నికలు దూరంలో లేనందున, పార్టీ పేరును ఆయన ప్రజల్లోకి అతివేగంగా తీసుకుపోవాలి. గడియారం గుర్తుకు ఓటేయడానికి అలవాటు పడిన జనసామాన్యానికి తనకు ఖరారు కాబోతున్న కొత్త గుర్తునూ పరిచయం చేయాలి. పోయినవారు పోను మిగిలిన నాయకులనూ, కార్యకర్తలనూ యుద్ధానికి సిద్ధం చేయాలి. ప్రజల్లో ఉన్న ఆదరణను, సానుభూతినీ ఓట్లరూపంలోకి మార్చుకోవడం అంత సులభం కాదు.

ఇటీవల శివసేన, ఇప్పుడు ఎన్సీపీ, రెండూ బీజేపీ చేతిలో దెబ్బతిన్నాయి. ఎన్నికల సంఘం నిర్ణయం వెనుక అదృశ్యశక్తులున్నాయని పవార్ కుమార్తె వ్యాఖ్యానించడం రాజకీయమే కావచ్చు కానీ, ఈసీ నిర్ణయాలు చీలికవర్గాలను ఎత్తిపట్టే రీతిలో ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. పార్టీ నియమావళి సక్రమంగా లేకపోవడం, పాటించకపోవడం, అంతర్గత ఎన్నికలు సక్రమంగా జరగకపోవడం ఇత్యాది కారణాల రీత్యా చివరకు శాసనసభలో బలాబలాలనే ప్రధానంగా పరిగణించి తాను నిర్ణయానికి రావాల్సివచ్చిందని ఎన్నికల సంఘం అంటోంది. శివసేన, ఎన్సీపీ చీలికల నేపథ్యంలో ప్రాంతీయపార్టీలన్నీ నియమావళి, అంతర్గత ప్రజాస్వామ్యం విషయంలో నేర్చుకోవాల్సిందేమిటో చర్చ జరుగుతోంది. కానీ, ఎన్నికల సంఘం పవిత్రంగానే వ్యవహరించిందన్న నమ్మకం సామాన్యులకు లేకపోవడానికి ప్రధాన కారణం, దాని కమిషనర్ల నియామకం విషయంలో సుప్రీంకోర్టు సూచనలను కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బేఖాతరుచేయడం. కమిషనర్ల ఎంపిక కమిటీలోకి ప్రధానితో పాటు ఓ కేంద్రమంత్రిని కూడా చేర్చి బీజేపీ సంఖ్యాబలంతో చట్టం చేసుకుంది. ఈసీ మీద అధికారపక్షం ఇంతటి శ్రద్ధపెడుతూంటే, అది స్వతంత్రంగా ఉంటుందని, ఫిరాయింపులకు అడ్డుపడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుందని ఎవరు నమ్ముతారు? వివిధ ఎన్నికల సందర్భంలో సంఘం వ్యవహరిస్తున్న తీరు తెన్నులు కూడా అనుమానాలకు ఆస్కారం కలిగించే రీతిలోనే ఉంటూ వస్తున్నాయి.

గత సార్వత్రిక ఎన్నికలనుంచి ఇప్పటివరకూ మహారాష్ట్రలో జరిగినన్ని చీలికలు, చేరికలు ఎక్కడా లేవు. రెండు బలమైన ప్రాంతీయశక్తుల చీలికనుంచి బలంగా అవతరించిన అక్కడి ప్రభుత్వం పార్లమెంటు ఎన్నికల్లో అద్భుతాలు చేయాలి. కానీ, ఏక్‌నాథ్ షిండే, అజిత్‌పవార్ సృష్టితో ఎన్డీయే బాగుపడలేదని, పైగా గతంలో కంటే ఎక్కువ పార్లమెంటు స్థానాలు కోల్పోవచ్చునని సర్వేలు అంటున్నాయి. నాయకుల చేరికతో అధికారాన్ని అందుకోవచ్చుకానీ, ప్రజావిశ్వాసాన్ని పొందడం అంత సులభం కాదు.

పత్తాలేని ప్రజాస్వామ్య నైతికత





▪ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

మీరు, ఈ సంపాదకీయ పుటలోని NW వ్యాసంపై దృష్టి పెట్టే ముందే, మొదటి పేజీలో పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికలపై వార్త చదివే వుంటారు. పాకిస్థాన్‌లో ఎన్నికలా!? రాజకీయ పరిశీలకులతో పాటు పాక్ ఓటర్లలో అత్యధికులు సైతం ఆ ప్రక్రియను ఒక 'ఎంపిక'గా మాత్రమేగానీ, ఒక 'ఎన్నిక'గా చూడడం లేదన్నది ఒక నిష్ఠుర సత్యం. పాకిస్థాన్‌లో ప్రజాస్వామిక మాంద్యానికి కారణమేమిటో మరి చెప్పనవసరం లేదు. ఆ దేశ సర్వం సర్వాధిపత్య సైన్యం ఒక పద్ధతి ప్రకారం తమ వ్యవస్థలోని సమస్త స్థాపరమైన నిరోధక సమతౌల్యాల (చెక్స్ అండ్ బ్యాలెన్సెస్)ను ఒక పద్ధతి ప్రకారం నిర్మూలించింది. పాకిస్థాన్‌కు భిన్నంగా భారతీయ ప్రజాస్వామ్యం ఇప్పటికీ సుదృఢంగా ఉన్నది. అయితే మన వ్యవస్థ అంతా సజావుగా, సక్రమంగా ఉందని భావించడం తొందరపాటే అవుతుంది. 'మ్యాచ్ ఫిక్సింగ్' (లాలూచీ క్రీడ) అనేది భారత ఉపఖండపు అంటువ్యాధి కాదూ? కనుక దేనినైనా వెన్వెంటనే విశ్వసించకుండా సంశయాత్మక వైఖరితో వివేచించడం ఆరోగ్యకరం.

చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక ఆ వాస్తవాన్ని మరోసారి నొక్కి చెప్పింది. ప్రపంచ అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక మేయర్ ఎన్నిక పెద్దగా ప్రాముఖ్యం లేని వ్యవహారమే. ఉపేక్షణీయమైనది. అయితే చండీగఢ్ మేయర్ పదవికి తాజాగా జరిగిన ఎన్నిక మరో విధంగా ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. అవును, ప్రస్తావిత మేయర్ ఎన్నిక భారత ప్రజాస్వామ్య దౌర్బల్యాలను బహిర్గతపరిచింది. ఎంతగా అంటే ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయక తప్పలేదు. పోలింగ్ ప్రక్రియను నిర్వహించిన రిటర్నింగ్ అధికారి అవకతవకలకు పాల్పడడం నియమ నిబంధనలను కెమెరా సాక్షిగా ఉల్లంఘించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అతడి చర్యలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే కాదు, హత్య చేయడమేనని సుప్రీంకోర్టు ఆగ్రహించింది. సదరు రిటర్నింగ్ అధికారిని కఠినంగా శిక్షించాలని ఖండితంగా పేర్కొంది. ఇప్పటికివి న్యాయపరమైన వ్యాఖ్యలే కావచ్చుగానీ, అయితే చండీగఢ్‌లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన వారిని ఎట్టి పరిస్థితులలోనూ శిక్షించి తీరాల్సిందేనన్న విషయమై సుప్రీంకోర్టు దృఢ సంకల్పంతో ఉన్నది. అత్యున్నత న్యాయవ్యవస్థ తీవ్ర ఆగ్రహం సమర్థనీయమైనదే, సందేహం లేదు. అయితే ఇబ్బంది కలిగించే ప్రశ్న ఒకటి ఉన్నది: మేయర్ ఎన్నికలోనే అవకతవకలు అంతగా జరిగితే అంతకంటే కీలక ప్రాధాన్యమున్న (అసెంబ్లీ లేదా పార్లమెంటు) ఎన్నికలలో అటువంటి అక్రమాలు చోటుచేసుకుంటే సంభవించేది ఏమిటి? మన ప్రజాస్వామ్యం ఏమైపోను?

చండీగఢ్ మేయర్ ఎన్నిక ఈ ఏడాది జనవరి 18నే జరగవలసి ఉండగా చివరిక్షణంలో వాయిదా వేశారు. రిటర్నింగ్ అధికారిగా నియమితుడైన వ్యక్తి హఠాత్తుగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిపాలు కావడం వల్లే ఎన్నికను వాయిదా వేయడం అనివార్యమయింది. అయితే న్యాయస్థానం జోక్యంతో ఆ ఎన్నికను సత్వరమే నిర్వహించక తప్పలేదు. కానీ నిర్వహించిన తీరుతెన్నులు అనేక అనుమానాలకు తావిచ్చేవిగా ఉన్నాయి. ఎనిమిది ఓట్లను రిటర్నింగ్ అధికారి చిత్రంగా రద్దు చేశారు. అవన్నీ ఆమ్ ఆద్మీ పార్టీ– కాంగ్రెస్ కూటమికి చెందినవే. ఆ రద్దయిన ఓట్ల బ్యాలెట్ పత్రాలను పరిశీలించేందుకు పోలింగ్ ఏజెంట్లకు అనుమతి నివ్వలేదు. ఈ అల్ల కల్లోలంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కొత్త మేయర్‌గా ఎన్నికైనట్టు ఏకపక్షంగా ప్రకటించడం జరిగింది. ఆ ప్రకటన చేసిన రిటర్నింగ్ అధికారి అనీల్ మాసి బీజేపీ మైనారిటీ మోర్చా సభ్యుడు, మునిసిపల్ కార్పొరేషన్ నామినేటెడ్ కౌన్సిలర్ కావడంతో మేయర్ ఎన్నికలో అతడి పాత్ర మరింతగా అనుమానాస్పదమయింది.

చండీగఢ్ మేయర్ ఎన్నికను స్థానిక పాలనా సంస్థల సంకుచితత్వ రాజకీయాలకు మరొక తార్కాణంగా కొట్టివేయవచ్చు. అయితే ప్రతిపక్ష 'ఇండియా' కూటమి భాగస్వాములుగా ఆప్, కాంగ్రెస్ పార్టీలు కలసికట్టుగా మొట్టమొదటిసారి బీజేపీని సవాల్ చేస్తూ ముందుకు రావడంతో ఆ మేయర్ ఎన్నిక ఎనలేని ప్రాధాన్యం సంతరించుకున్నది. ఆరంభ దశలో ఉన్న 'ఇండియా' కూటమి తన సంఖ్యాబలం ప్రత్యర్థి ప్రాబల్యాన్ని తీవ్రంగా సవాల్ చేయగలదని 'ఇండియా' కూటమి ప్రప్రథమంగా రుజువు చేసింది. కాగా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 'ఇండియా' కూటమి ఐక్యతను, మనోస్థైర్యాన్ని మరింతగా దెబ్బ తీసేందుకు చండీగఢ్ మేయర్ ఎన్నిక బీజేపీకి ఒక అవకాశాన్ని కల్పించింది.

ఈ కారణంగానే చండీగఢ్ మేయర్ ఎన్నిక పర్యవసానాలు భావి రాజకీయాలకు సూచనలుగా ఉన్నాయి. ఒక విధంగా అవి అమంగళకరంగా ఉన్నాయని చెప్పక తప్పదు. ప్రతిపక్షానికి స్పష్టమైన సంఖ్యాబలం ఉన్నప్పటికీ ఆప్–కాంగ్రెస్‌కు 20 మంది కౌన్సిలర్ల మద్దతు ఉండగా, బీజేపీకి 16 మంది కౌన్సిలర్ల మద్దతు ఉన్నది. అయినప్పటికీ ఆ మేయర్ పదవి 'తస్కరణ'కు గురయింది. అయినప్పుడు భావి ఎన్నికల పోరాటాలలో ఇటువంటి పరిణామాలు సంభవించవనేందుకు భరోసా ఏమిటి? మరింత ముఖ్యమైన విషయమేమిటంటే రిటర్నింగ్ అధికారి కపట ప్రవర్తన, రాజ్యాంగ అధికారులు, ప్రజాస్వామిక సంస్థలూ అంతకంతకూ నిరంతర నిఘాకు గురవుతున్న తీరుతెన్నులకు అనుగుణంగా ఉన్నది. గవర్నర్ల పాత్రను – జార్ఖండ్ గవర్నర్ ఇందుకొక తాజా ఉదాహరణ– పాలకులు అంతకంతకూ తమ తీవ్ర పక్షపాత దృక్పథం నుంచి చూస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కానివ్వండి లేదా సీబీఐ కానివ్వండి, చట్టాలను అమలుపరిచే సమస్త అధికార యంత్రాంగమూ అధికారంలో ఉన్న పార్టీకి పూర్తి అనుకూలత, విధేయతతో వ్యవహరించడం మామూలు విషయమయిపోయింది. చివరకు ఎన్నికల సంఘం తటస్థతను కూడా ప్రశ్నించడం జరుగుతోంది!

కార్యనిర్వాహక వర్గం అధికారాల దుర్వినియోగంలో భాగంగానే ఈ పరిణామాలు సంభవిస్తున్నాయనే వాదన ఒకటి గట్టిగా ఉన్నది. అందులో నిజం లేకపోలేదు. అయితే ఇవి కేవలం 2014లో మాత్రమే ప్రారంభం కాలేదు. దశాబ్దాలుగా మన అధికార రాజకీయాలలో అవి చాలా సహజంగా, తరచు చోటుచేసుకుంటున్నాయనేది ఎవరూ కాదనలేని సత్యం. ఇందిరాగాంధీ ఒక అర్ధరాత్రి అత్యవసర పరిస్థితిని ప్రకటించి తన ప్రత్యర్థులు అందరినీ అరెస్ట్ చేయలేదా? రికార్డు స్థాయిలో రాష్ట్రాలలో 50 సార్లు కేంద్ర పాలన విధించిన ఘన చరిత్ర కూడా ఆమెదే కాదూ? ఆమె తనయుడు రాజీవ్‌గాంధీ పరువు నష్టం బిల్లు తీసుకువచ్చి పత్రికా స్వాతంత్ర్యానికి భంగం కలిగించలేదూ? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన మంత్రులు తరచూ విమర్శిస్తుండే జవహర్‌లాల్ నెహ్రూ ప్రజాస్వామ్య విలువలు, సంప్రదాయాలను నిష్ఠగా పాటించిన నేతగా ప్రసిద్ధుడు. మరి ఆయన సైతం రాజ్యాంగానికి మొదటి సవరణతో వాక్ స్వాతంత్ర్యానికి అవరోధాలు కల్పించారు. కేరళలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని రద్దు చేశారు.

అందరికీ 'మంచిరోజులు' తీసుకువస్తామనే హామీతో నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చింది. బీజేపీ భిన్నమైన పార్టీ అని, కాంగ్రెస్‌కు భిన్నమైన పాలనా సరళిని అనుసరించి ప్రజలకు శ్రేయస్సు సమకూరుస్తుందని నొక్కి చెప్పారు. అత్యవసర పరిస్థితి, చీకటి రోజుల్లో జైలువాసం గడిపిన బీజేపీ నాయకులకు తమ సొంత ప్రభుత్వ హయాంలో కళంకిత రాజకీయ వ్యవస్థను ప్రక్షాళించే అవకాశం లభించింది. మరి వారు ఆ విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించారా? మోదీ పదేళ్ల పాలనలో విపక్ష నేతలను భయభీతులకు గురిచేసి లేదా ప్రలోభాలతో కనీసం నాలుగు ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చి వేశారు. మరో రెండు విపక్ష ప్రభుత్వాలను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఎన్నికలలో ప్రజలు ఇవ్వని మెజారిటీలను తమ 'సొంత' పద్ధతులలో సాధించుకున్నారు. ఈడీ, సీబీఐ మొదలైన కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఎంత చురుగ్గా ఉంటున్నాయో, బీజేపీ పాలిత రాష్ట్రాలలో అంత మందకొడిగా వ్యవహరిస్తున్నాయి. ఇక ప్రలోభాల గురించి చెప్పనవసరం లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు కోట్ల రూపాయలు అందినట్టు ప్రజలు బాహాటంగా చెప్పుకుంటున్నారు. మంత్రి పదవులు, వివిధ కేసుల నుంచి నిర్దోషిగా బయటపడుతున్న వైనాన్ని గమనిస్తే ప్రలోభాలు వాస్తవమేనని అర్థమవుతుంది. గత రెండు సంవత్సరాలుగా ఎన్నికలు జరగని ముంబై మునిసిపల్ కార్పొరేషన్ రూ.500 కోట్ల విలువ చేసే వివిధ ఆధునికీకరణ ప్రాజెక్టులకు సంబంధించిన కాంట్రాక్టులను పూర్తిగా పాలక బీజేపీ–శివసేన ఎమ్మెల్యేలకు ఇచ్చిందని విపక్ష నేతలకు ఒక్కటీ కూడ ఇవ్వలేదని సమాచార హక్కు చట్టం ఆధారంగా సేకరించిన సమాచారం ప్రాతిపదికన ఇటీవల ఒక ప్రముఖ దినపత్రికలో ఒక వార్త వెలువడింది. రాజకీయ ప్రయోజనాలకు ప్రజల సొమ్మును ఇలా నిస్సిగ్గుగా ఎంపిక చేసిన కొద్దిమందికే పంపిణీ చేస్తున్నప్పుడు అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని విశ్వసించడం ఎలా? రాజకీయవేత్తల ధనబలం ఇప్పటికే ఎన్నికలను కళంకితపరిచింది. అపారదర్శక ఎన్నికల బాండ్లు పాలక పార్టీలకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. మరి ఎన్నికలలో పోటీలు అసమ పోటీలుగా కాక మరెలా ఉంటాయి? ఎన్నికల కమిషనర్ల నియామకం కూడా సమస్యాత్మకంగా ఉన్నది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల సక్రమతపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పాలక పార్టీలు వాటిని తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నాయనే ఆరోపణలు రుజువు కానప్పటికీ ఎన్నికల నిష్పాక్షిక నిర్వహణ విశ్వసనీయంగా జరగాలంటే మరింత నిఘా, అవసరమైన చోట న్యాయవ్యవస్థ పర్యవేక్షణ అవసరం కూడా ఎంతైనా ఉన్నది. సరే, చండీగఢ్ మేయర్ ఎన్నికలో అక్రమంగా వ్యవహరించిన రిటర్నింగ్ అధికారిని శిక్షించి తీరాలని సుప్రీంకోర్టు కఠినంగా మాట్లాడిన నేపథ్యంలో ఒక చివరి ప్రశ్న: సదరు రిటర్నింగ్ ఆఫీసర్, అందునా పాలక పార్టీలో ఒక చిన్న పదవిలో ఉన్న ఆ వ్యక్తి తన సొంతంగా వ్యవహరించగలడని ఎవరైనా విశ్వసిస్తారా? అతడు తన సొంతంగా వ్యవహరించలేడన్నది స్పష్టం. అయినప్పుడు ఆ మేయర్ ఎన్నికలో చోటుచేసుకున్న అక్రమానికి ఎవరు నిజమైన జవాబుదారు?

> చండీగఢ్ మేయర్ ఎన్నిక భారత ప్రజాస్వామ్య దౌర్బల్యాలను బహిర్గతపరిచింది. ఎంతగా అంటే ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయక తప్పలేదు. సదరు రిటర్నింగ్ ఆఫీసర్, అందునా పాలక పార్టీలో ఒక చిన్న పదవిలో ఉన్న ఆ వ్యక్తి తన సొంతంగా వ్యవహరించగలడని ఎవరైనా విశ్వసిస్తారా? అతడు తన సొంతంగా వ్యవహరించలేడన్నది స్పష్టం. అయినప్పుడు ఆ మేయర్ ఎన్నికలో చోటుచేసుకున్న అక్రమానికి అసలు బాధ్యులు ఎవరు?

పాపాలు మీవి, కాంగ్రెస్‌పై విమర్శలా?

గోదావరి కృష్ణా నదులలో రెండు తెలుగు రాష్ట్రాల నీటి పంపకాలపై ఏర్పడ్డ జలవివాదాలు, ఒప్పందాల పైన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కువ కాలం నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు, కేటీఆర్ చేస్తున్న విమర్శలను గమనిస్తే 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అనే పక్కా హైదరాబాద్ సామెత గుర్తుకు వస్తుంది. వీరికి తోడు కేసీఆర్ కూడా కృష్ణా నది నీటి పంపకాలపై అదే స్థాయిలో మాట్లాడుతున్నారు. నల్గొండ కేంద్రంగా భారీ బహిరంగ సభ పెట్టి కృష్ణానది నీటి వివాదంపై జనాన్ని పెద్ద మొత్తంలో కూడగట్టి ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని, తద్వారా ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచాలని బీఆర్ఎస్ భావిస్తోంది. జల పంపిణీ వివాదంలో తమకు ఎలాంటి సంబంధం లేదని కేసీఆర్, హరీశ్‌రావు ఆశ్చర్యంగా, అమాయకంగా మాట్లాడుతున్నారు.

గతంలో కృష్ణ వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు ముందు 2015–16 సంవత్సరానికి రాష్ట్రాల పునర్విభజన చట్టంలోని నీటి కేటాయింపుల ఆధారంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు జూన్ 19, 2015 తేదీన అగ్రిమెంట్‌పై సంతకం చేశారు. జూన్ 18, 19 తేదీలలో జరిగిన సమావేశంలో ఈ నీటి కేటాయింపుల విషయంలో ఇరు రాష్ట్రాల వాదనల అయిన తర్వాత ఒక అవగాహనకు వచ్చిన అంశాలు ఆ డాక్యుమెంట్‌లోని 85, 86, 87 పేజీలలో స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ తిరిగి కృష్ణా జలాల కేటాయింపుల వివాదాన్ని తెర మీదికి తీసుకొచ్చి, గతంలో తాను అంగీకారం తెలిపిన విషయాన్ని వ్యతిరేకిస్తున్నట్టు బుకాయిస్తూ తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నది. ఆనాటి ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శులు తెలంగాణ నుంచి ఎస్.కె. జోషి, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎ.ఎస్. దాస్ సంతకాలు చేసిన డాక్యుమెంటు ఇప్పటికీ అందుబాటులో ఉన్నది. నీటిపారుదల శాఖ మంత్రుల ఆదేశం మేరకు రాష్ట్రాల కార్యనిర్వహణ ఉన్నత అధికారులు నాటి కృష్ణా నది, నాగార్జునసాగర్ తదితర ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటి నిలువల ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌కు 511టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీటి కేటాయింపుల పైన అంగీకరించి సంతకాలు చేసిన విషయాలను పక్కనపెట్టి ఇప్పుడు కయ్యాలు పెట్టుకోవడాన్ని చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉంది.

గత ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్లలో కృష్ణా నది ప్రాజెక్టుల నీటి కేటాయింపులలో కృష్ణా రివర్ బోర్డు ద్వారా అధికారికంగా ఒక్క చుక్క నీరు కూడా సాధించలేకపోయింది. సాధించకపోవడానికి కారణం ఎన్నడైనా కృష్ణా పరీవాహక దక్షిణ తెలంగాణ జిల్లాల ప్రజలకు వివరించి చెప్పారా? లేదు కదా. పైగా ఇప్పుడు కృష్ణా నది నీళ్లలో నిప్పు రాజేయాలని ప్రయత్నం చేయడం వృథా ప్రయాసగానే మిగులుతుంది. కృష్ణా నదీ జలాల కేటాయింపు ఇలా ఉంటే, గోదావరి నదీ జలాల విధానపరమైన నిర్ణయాల డాక్యుమెంట్ 2023–24 సంవత్సరానికి కేసీఆర్ ప్రభుత్వం డిమాండ్ మరొక రకంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం జలశక్తి మంత్రిత్వ శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ నెంబర్ ఎస్.ఓ.2842 & 2843 తేదీ: 15–7–2021 కృష్ణా గోదావరి నీటి నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ బోర్డుల ముందు గత తెలంగాణ ప్రభుత్వం కొన్ని ప్రతిపాదనలు చేసింది. అందులో భాగంగా నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణా నది జల బోర్డుకు కృష్ణ బేసిన్‌లో అప్పగించడానికి ప్రతిపాదించింది. గోదావరి నది బేసిన్‌లో పెద్దవాగు మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టును అప్పగించడానికి సూత్రప్రాయంగా అంగీకరించింది. అంతేగాక కృష్ణ గోదావరి నదీ జలాల నియంత్రణ బోర్డుల నిర్వహణ ఖర్చులకు తెలంగాణ ప్రభుత్వం మొత్తాలను చెల్లించడానికి అంగీకారం తెలిపింది.

అసలు కృష్ణ, గోదావరి జలాల నియంత్రణ బోర్డుల ముందు ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు సమర్పించిన డాక్యుమెంట్లు ఇలా ఉండగా ఇక తెలంగాణలో మొన్నటి వరకు అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ, దాని అధినాయకుడు, వారి కుటుంబ మంత్రులు కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై దాని నాయకులపై ఒంటి కాలిపై లేవడం ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగానే ఉన్నాయి. ప్రజలు మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేరు అనే విషయాన్ని గుర్తు పెట్టుకొని రాజకీయ నాయకులు మసులుకోవాలి. లేదంటే ఎవరి బొందను వాళ్ళు తవ్వుకున్నట్టే.

– జూకంటి జగన్నాథం

ఎంత తవ్వినా తరగని మత రాజకీయం!

బీజేపీ, ఆరఎసఎస్ సంస్థలు అయోధ్య రాముడి గుడితో రాజకీయాన్ని ముడిపెట్టి 33 సంవత్సరాల పాటు సమాజాన్ని మత కుల రాజకీయాలుగా విభజించి పాలించాయి. ఇప్పుడు కొత్తగా జ్ఞానవాపి మసీదుపై కన్నేశాయి. గతంలో ఉన్న ఆలయాన్ని ధ్వంసం చేసి ఆ శిథిలాలపైనే ఆ మసీదును నిర్మించారన్నది వాదన. అక్కడ దొరికిన 34 శాసనాలలో దేవనాగరి, గ్రంథ, తెలుగు, కన్నడ లిపులు ఉన్నాయని ఏఎస్ఐ నివేదిక నిర్ధారించినట్టుగా హిందూ కక్షిదారుల న్యాయవాది అంటున్నారు. దక్షిణ భారతదేశాన్ని మతం ఉచ్చులోకి లాగే వ్యూహ రచనలో భాగంగా ఆ గుడిలో దొరికిన ఒక శిలా శాసనంలో తెలుగువారికి సంబంధించిన రెండు పేర్లు ఉన్నాయని కూడా అంటున్నారు. రాముడు అయిపోగానే ఇంకో దేవుని పేరుతో రాజకీయం మొదలైంది. దేశవ్యాప్తంగా ఉన్న చారిత్రాత్మకమైన మసీదులపై, ఆ తర్వాత చర్చిలపై ఈ దాడి కొనసాగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కాలగర్భంలో కలిసిపోయిన నేలలో దొరికిన వాటిని బట్టి ఆ ప్రాంతం మాది అని వాదించడం హిందూ సంస్థలకు ఆనవాయితీగా మారింది. సింధు నాగరికత కాలంలో వచ్చిన విపత్కర పరిస్థితి కారణంగా ఆ ప్రాంతం కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని తవ్వితే దొరికే ఆధారాల ప్రకారం ఆ ప్రాంతం మనది కాదు, సింధు నాగరికత ప్రజలది కాబట్టి దాన్ని వారికే ఇవ్వాలి కదా! ఐదు వేల ఏళ్ళ క్రితం రాముడి ఆనవాళ్ళను కనుక్కొని గుడి కట్టినవారు ఇప్పుడు సింధు నాగరికత ప్రజల ఆనవాళ్ళను కనుక్కొని సింధు పరివాహక ప్రాంతం మొత్తం వారి వారసులదే కాబట్టి వారిని వెతికి ఈ ప్రాంత భూభాగాన్ని అప్పజెప్పాలి కదా! ఈ భూమిమీద ఎటు చూసినా ఎన్నో నాగరికతలు వెలిసి తుదకు నేలమట్టమయిన ప్రాంతాలే కనబడతాయి. ఇప్పుడు ఆ నాగరికత వారసులు ఎవరైనా ఉంటే ఈ భూభాగమంతా వారికే అప్పగించి ఈ భూమిపై ఉన్న ప్రజలు మరో గ్రహానికి వెళ్లాల్సిందే!

జ్ఞానవాపిలో ఒక శిలా శాసనంపై తెలుగు రాష్ట్రాలకు చెందినవారివి అంటూ ఏఎస్ఐ ప్రకటించిన పేర్లు: నారాయణ బట్లు, మల్లన్న బట్లు. ఇప్పుడు ఆ ప్రాంతంపై తెలుగు వారికి హక్కులు ఉన్నాయనుకోవాలా? ఆ తెలుగు ప్రాంతాన్ని ఆక్రమించిన వారు ఇప్పుడు ఎక్కడికి వెళ్లారు? ఆ ప్రాంతంపై తెలుగు రాష్ట్రాలు యుద్ధం చేయాలా, న్యాయ పోరాటం చేయాలా, మత పోరాటం చేయాలా? దక్షిణ భారతదేశం మత రాజకీయాలకు అనువైన ప్రాంతం కాదు కాబట్టి, ఇప్పుడు జ్ఞానవాపీలో దొరికిన తెలుగు పేర్ల ఆధారంగా ఇక్కడ మతాన్ని రెచ్చగొట్టి అధికారం పొందాలని బీజేపీ చేస్తున్న ఎత్తుగడే ఇదంతా. ఇలా పురావస్తు ఆధారాలను సేకరించి ఎవరి ప్రాంతాన్ని వారికి ఇవ్వాలనుకుంటే అంతకంటే ముందు అసలు ఈ ప్రాంత మూలవాసులు ఎవరో ముందు వారి డీఎనఏను వెతికే పని మొదలు పెట్టాలి. అప్పుడు ఉత్తర భారతదేశంలోని వారు నిజమైన భారతీయ ద్రవిడ మూలాలు ఉన్నవారేనా అన్న సందేహం మొదలవుతుంది. ఇప్పటికీ ఉత్తర భారతదేశంలో ఉన్నది ఆర్యులు అన్న ప్రచారం ఉంది. భారత పురావస్తు అధికారులు దేశవ్యాప్తంగా ఉన్నటువంటి హిందూ దేవాలయాలు, మసీదులు, చర్చిలు తవ్వితే బౌద్ధమత ఆధారాలు దొరకవచ్చు. లేదా అంతకంటే ముందు ఉన్న మతాల ఆధారాలు, ఆదిమ జాతులవారు ఏర్పరచుకున్న మత వ్యవహారాలకు సంబంధించిన ఆధారాలు దొరకవచ్చు.

ఇలా మత, కుల రాజకీయాలు చేసే నాయకులను వచ్చే పార్లమెంటు ఎన్నికలలో ఓడించాలి. వారిని దేవాలయాల్లో, మసీదులలో, చర్చిల్లో పూజారులుగా, పాస్టర్లుగా, మత బోధకులుగా పరిమితం చేయాలి. రాజ్యాంగబద్ధంగా పాలన చేయాల్సిన బాధ్యత నుంచి నేతలు తప్పుకుని ఇలా మతాల ఆధారంగా నడిస్తే దేశ ప్రజల బతుకులకు భరోసా దక్కేది ఎప్పుడు?

– మండ్ల రవి, ఉస్మానియా యూనివర్సిటీ

తెలంగాణ సినిమా పాలసీ... ఇంకెప్పుడు?

ఎన్నెన్నో త్యాగాలు పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం వట్టి రాజకీయ రంగానికే పరిమితం కాకుండా అన్ని రంగాలకు లబ్ధి చేకూర్చాలి కదా! గత ప్రభుత్వం సినిమా రంగాన్ని పూర్తిగా విస్మరించింది. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో 'తెలంగాణ సినిమా ప్రొటెక్షన్ ఫోరం' తరఫున మేము సమర్పించిన కొన్ని డిమాండ్లను పొందుపరిచినప్పటికీ, ఏ ఒక్క డిమాండ్‌నూ నెరవేర్చలేదు. ఉన్న ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ని ఎత్తివేయడానికి సిద్ధపడితే అప్పటి కమిషనర్ చంద్రవదన్ ఛాంబర్‌లోకి వెళ్లి నిరసనలు చేసి కాపాడుకోవాల్సి వచ్చింది. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కూడా పాత ఎంపానెల్‌మెంట్ మెంబర్లే కొనసాగుతుంటే, భూమిపుత్రులకు ఉపాధి అవకాశాలు దక్కాలనే ఉద్దేశంతో పోరాటం చేస్తే, ప్రభుత్వం కొత్త పానెల్ ఏర్పాటు చేసింది నియమ నిబంధనలను పాటించలేదు. ఎఫ్‌డిసి వేరుపడ్డా అక్కడా అవకతవకలే!



> తెలంగాణకు చెందిన కళాకారుల కోసం, సాంకేతిక నిపుణుల కోసం, తెలంగాణకు చెందిన నిర్మాతల కోసం ఈ ప్రత్యేక తెలంగాణ సినిమా పాలసీ అవసరం. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలను, జీవన విధానాలను, తెలంగాణ ప్రదేశాలను వెండితెరపై ఆవిష్కృతం చేయడానికి ఆ పాలసీ ఉండాలి.

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే తెలుగు సినిమా పరిశ్రమ స్థాపించబడి ఉన్నందున, ఈ ప్రత్యేక తెలంగాణ సినిమా పాలసీ ఎందుకు అన్న ప్రశ్న ఉత్పన్నం అవ్వచ్చు. అప్పట్లో మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు సినిమా పరిశ్రమ వచ్చే క్రమంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రాయితీలను, సబ్సిడీలను ప్రకటించింది. స్టూడియోలు కట్టుకోవడానికి భూములు కేటాయించింది. రుణాలు ఇచ్చి ప్రోత్సహించింది. అప్పుడు మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు తరలి వచ్చిన సినిమా శ్రేణులంతా ఎక్కువ శాతం ఆంధ్రకు చెందినవారే. కొంతమంది సినిమా ప్రముఖులు హైదరాబాద్‌లో స్థిరపడ్డ తర్వాత ప్రభుత్వం రాయితీలను, ప్రోత్సాహకాలను నిలిపివేసింది. కాలం గడిచిన తర్వాత క్రమేణా సినిమా పరిశ్రమలో గుత్తాధిపత్యం ఏర్పడింది. మూడంచెల వ్యవస్థ (ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్) లేకుండా పోయింది. మొత్తం కంట్రోల్ కొన్ని సంస్థల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇప్పుడు ఏ సినిమా తీసినా విడుదలకు వారిపైనే ఆధారపడవలసిన పరిస్థితి నెలకొన్నది. థియేటర్ యజమానులు కూడా ఈ ఒత్తిడిని తట్టుకోలేక వారికే లీజుకు ఇచ్చేయాల్సి వచ్చింది. ఇలాంటి పరిణామాలవల్ల లోబడ్జెట్ సినిమాల విడుదల కష్టతరం అయ్యింది. తెలంగాణ వేరుపడితేనన్నా ఈ పరిస్థితి మారుతుందేమో అనే నమ్మకంతో కొంతమందిమి ఉద్యమబాట పట్టి తెలంగాణ ఉద్యమ సినిమాలను నిర్మించాం. తెలంగాణ వేరుపడే సందర్భంలో అన్ని పార్టీల వారికి మా ప్రతిపాదనలు ఇచ్చాం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నేను నా బృందంతో కలిసి సమస్యలు వివరిస్తే మూడు నెలలు ఓపిక పట్టమన్నారు. అందరినీ పిలిచి మాట్లాడుతానన్నారు. పదేళ్లు గడిచినా ఆ పిలుపు రాలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారినందున మళ్లీ మాలో ఆశలు చిగురిస్తున్నవి. ఈ కొత్త ప్రభుత్వం అయినా ప్రత్యేక తెలంగాణ సినిమా పాలసీ తెస్తుందని, దాని రూపకల్పనకు మమ్మల్ని పిలుస్తుందని వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాం.

తెలంగాణకు చెందిన కళాకారుల కోసం, సాంకేతిక నిపుణుల కోసం, తెలంగాణకు చెందిన నిర్మాతల కోసం ఈ ప్రత్యేక తెలంగాణ సినిమా పాలసీ అవసరం. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలను, జీవన విధానాలను, తెలంగాణ ప్రదేశాలను వెండితెరపై ఆవిష్కృతం చేయడానికి అది అవసరం. కాబట్టి తెలంగాణకు చెందిన కళాకారులచే, సాంకేతిక నిపుణులచే, తెలంగాణకు చెందిన నిర్మాతలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను, తెలంగాణ చరిత్రను, తెలంగాణ సామాజిక జీవితాలను నేపథ్యంగా తీసుకొని, తెలంగాణ ప్రదేశాలలో చిత్రీకరించిన సినిమాలకు ప్రత్యేక రాయితీలు, టాక్స్ మినహాయింపు ఇచ్చి ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా 50శాతం వరకు రుణ సౌకర్యం కల్పించాలి. అలాంటి సినిమాలకు అవార్డులు ఇచ్చి ప్రోత్సహించాలి. ఆ సినిమాల ప్రదర్శనకు థియేటర్లలో ప్రత్యేక షోలు కేటాయించాలి. అప్పుడే ఈ సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ దక్కుతుంది. అప్పుడే తెలంగాణ సినిమా వెండితెరపై ఆవిష్కృతం అవుతుంది.


మొట్టమొదలు తెలంగాణలో ఒక సినిమా ఇన్‌స్టిట్యూట్ అవసరం. తద్వారా కళాకారులకు, సాంకేతిక నిపుణులకు మెరుగైన శిక్షణ దొరుకుతుంది. తెలంగాణ భూమి పుత్రులకు స్టూడియోలు కట్టుకోవడానికి, ప్రొడక్షన్ హౌస్‌లు స్థాపించడానికి, నిత్యవసర వసతి కోసం అప్పటిలాగే ఇప్పుడు భూమి కేటాయించాలి. అప్పుడే ఇప్పటికే నెలకొల్పబడి ఉన్న తెలుగు సినిమా పరిశ్రమకు దీటుగా ఒక ప్రత్యామ్నాయ, సమాంతర తెలంగాణ సినిమా పరిశ్రమ స్థాపించబడుతుంది. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను అర్థం చేసుకొని గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి భిన్నంగా వ్యవహరించాలని కోరుకుంటున్నాం.

▪ సయ్యద్ రఫీ

ప్రగతిశీల శక్తులు కాంగ్రెస్ ముందుంచాల్సిన షరతులు

అరవై రోజులు నిండని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒక అంచనాకు రావడం తొందరపాటు అవుతుందనుకున్నా, రెండు మూడు ఘటనలతో దాని విధానమేంటో అర్థమవుతున్నది. ఫార్మా సిటీ రద్దు అని మాటమార్చడం; వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో ప్రభుత్వ భూములలో పేదలు వేసుకున్న గుడిసెలను అర్ధరాత్రి పోలీసులు కూల్చడం; హైదరాబాద్‌లో 'రామ్ కే నామ్' డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకోవడం, నిర్వాహకులపై కేసులు పెట్టడం...

> కాంగ్రెస్ పార్టీ పరిమితులను గుర్తించకుండా దానిని ప్రజాస్వామిక శక్తి అని కీర్తించి ముందుకు వెళ్లితే, నిన్నటిదాక బీఆరఎస్‌తో పడిన ఇబ్బందులన్నీ పునరావృతం కాక తప్పదు. ఆ పని చేసిన పార్టీలు, సంస్థలు ప్రజల ముందు దోషులుగా నిలబడవలసి వస్తుంది. అసలు ఏ షరతులతో ప్రగతిశీల శక్తులు, వామపక్షాలు కాంగ్రెస్‌తో ఒప్పందానికి రావచ్చు?



ఇవన్నీ చూస్తే రేవంత్ అంటున్న ప్రజా పాలన కొత్త సీసాలో పాత సారాయి లాంటిదేనా అన్న అనుమానం కలుగుతున్నది. కొత్త ప్రభుత్వం ఇప్పటికీ అడుగులు తడబడుతోంది.

కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఫాసిస్టు పోకడలకు కొరతేమీ లేదు. అటూ మైనారిటీలను, ఇటు దళితులను అణచివేయడంలో ఈ పార్టీ పాత్రేమీ తక్కువ కాదు. హిందుత్వ పోకడలకు ఈ పార్టీ దూరంగా ఉండలేదు. కాకపోతే, ఆరెస్సెస్‌తో కాంగ్రెస్ సంబంధం పరోక్షంగా వుంటే బీజేపీది ప్రత్యక్ష సంబంధం. ఇతర ధోరణులకు, ప్రయోజనాలకు కాంగ్రెస్ కొద్దిగా చోటు కల్పిస్తుంటే బీజేపీ ఫాసిస్టు ధోరణులను నగ్నంగా ప్రదర్శిస్తున్నది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ తేడా పరిగణించదగినదే అయినప్పటికీ, అంత మాత్రం చేతనే కాంగ్రెస్ పార్టీని ప్రజాతంత్ర శక్తిగా గుర్తించలేం.

ప్రస్తుతం అసంఘటితంగా ఉన్నప్పటికీ, తెలంగాణలో విప్లవ ప్రగతిశీల శక్తుల బలం చాలా ఎక్కువ. ప్రస్తుతం బీఆర్ఎస్ మళ్లీ రాష్ట్రంలో కోలుకొనే పరిస్థితి కనపడటం లేదు. ప్రతిపక్ష స్థానంలోకి వచ్చేందుకు ఆరెస్సెస్ మార్గదర్శకత్వంలో బీజేపీ కసరత్తు చేస్తున్నప్పటికీ తెలంగాణ ప్రజల స్వభావం రీత్యా అంత సులువుగా మతతత్వ శక్తులకు స్థానం దక్కే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో, తెలంగాణలో ప్రగతిశీల, ప్రజాస్వామిక, లౌకిక శక్తులు ఏకమై ఐక్యతతో ఒక శక్తిగా ఎదిగేందుకు పరిస్థితి సానుకూలంగా ఉన్నది.

ఈ దిశగా వెళ్లటంలో దేశవ్యాప్త స్థాయిలో కాంగ్రెస్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం అవసరం కావచ్చు. కానీ, కాంగ్రెస్ పార్టీ పరిమితులను గుర్తించకుండా దానిని ప్రజాస్వామిక శక్తి అని కీర్తించి ముందుకు వెళ్లితే మాత్రం నిన్నటిదాక బీఆరఎస్‌తో పడిన ఇబ్బందులన్నీ పునరావృతం కాక తప్పదు. ఆ పని చేసిన పార్టీలు, సంస్థలు ప్రజల ముందు దోషులుగా నిలబడక తప్పదు. అసలు ఏ షరతులతో ప్రగతిశీల శక్తులు, వామపక్షాలు కాంగ్రెస్‌తో ఒప్పందానికి రావచ్చు?

మొట్టమొదటిది భూస్వామ్య శక్తులను కూలదోసే క్రమంలో ప్రజలు సాధించుకున్న అన్ని విజయాలకు గ్యారంటీ ఇవ్వాలి. అంటే భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకున్న భూములకు గ్యారంటీ యివ్వాలి. ధరణి పోర్టల్‌ను పైపైన విమర్శించినంత మాత్రాన సరిపోదు. దొరల చేతుల్లో పడావుగా పడివున్న భూములు ఇపుడు సస్యశ్యామలం అవుతుండటంతో ఈ సమస్య సుదీర్ఘకాలం కొనసాగగలదు. ఈ సందులో కార్పొరేటు సంస్థలు చొరబడి కారుచౌకగా ఈ భూములను హస్తగతం చేసుకోగలవు. తెలంగాణలో వనరుల దోపిడీని అరికట్టాలి. పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా కరువుల, వరదల నివారణకు గ్యారంటీ ఇవ్వాలి.

భూస్వామ్య శక్తులను కూలదోయడం వల్ల ఉత్పత్తి శక్తులు ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా పెరిగినాయి. కానీ, వనరులన్నీ కార్పొరేటు కబంధ హస్తాల్లో ఇరుక్కుపోయి ఉన్నందువల్ల ఇది తీవ్రమైన నిరుద్యోగానికి దారి తీసింది. దేశభక్తియుత, శాస్త్రీయమైన పారిశ్రామిక విధానాన్ని అనుసరించడం ద్వారా నిరుద్యోగాన్ని, నిత్య దారిద్ర్యాన్ని నివారించాలి. ఈ అంశాలను రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముందు పెట్టాలి.

ప్రజాపాలన, ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని కొత్త ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికీ అవి అమలు అవుతాయన్న గ్యారంటీ లేదు. వాటిని అమలు చేయించుకోవడం కోసం ప్రజలు అప్రమత్తంగా ఉండి నిరంతర పోరాటం జరపాలి. తెలంగాణలో రక్తపాతాన్ని నివారించడం కోసం మావోయిస్టు పార్టీతో మరోసారి చర్చలు జరపాలి. విప్లవ ప్రజా సంఘాలపై నిషేధం ఎత్తివేయాలి. కేసీఆర్ ప్రభుత్వం అక్రమంగా బనాయించిన ఊపా వంటి కేసులను ఎత్తివేయాలి. ఇవన్నీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లిఖిత పూర్వకంగానే ప్రకటించాలి. నూతన ప్రభుత్వం ముందు కనీస కార్యక్రమంగా ఉండాలి. ఈ షరతుల విషయంలో ఎటువంటి రహస్య ఒడంబడికలకు తావివ్వరాదు. స్పష్టమైన కార్యక్రమంతో ముందుకు వెళ్లాలి. అపుడే సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర ఫలితాలను భవిష్యత్తు తరాలు అనుభవించగలుగుతాయి. కేసీఆర్ చేతిలో మోసపోయినట్లుగా మరోసారి కాంగ్రెస్ చేతిలో మోసపోకుండా సమాయత్తం కావలసిన తరుణమిది.


వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



గురువారం ఉష్ణోగ్రత గరిష్టం 35.0 కనిష్టం 22.2

రాష్ట్రంలో మూడో వంతు జనాభా ఉండే ప్రాంతం.. ప్రభుత్వానికి అధిక ఆదాయం అందించే మహా నగరం.. అప్పుల ఊబిలో చిక్కుకుని విలవిలలాడుతున్నది. జీహెచ్‌ఎంసీ.. హెచ్‌ఎండీఏ.. వాటర్‌బోర్డు.. ఇలా అన్ని శాఖల్లోనూ అదే పరిస్థితి. దీంతో ఆదుకోవాలంటూ ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదనలు పంపాయి. కొత్త సర్కారుపై గంపెడాశలు పెట్టుకున్నాయి. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాల్లో మొదటిసారి బడ్జెట్ ప్రవేశపెడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహానగరంపై కరుణ చూపుతుందా? గ్రేటర్‌కు నిధులు కేటాయిస్తుందా..? అన్నది ఆసక్తికరంగా మారింది. పురపాలక శాఖ సీఎం వద్దే ఉండడంతో నిధుల కేటాయింపు ఉంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి)



నిధులు మహాప్రభో..

- ముఖ్యమంత్రిపైనే మహానగరం ఆశలు
- అప్పుల ఊబిలో సంస్థలు
- జీహెచ్‌ఎంసీకి ఇప్పటికే రూ.6 వేల కోట్లు..
- వేతనాలు, వాయిదాల చెల్లింపునకూ ఇబ్బందులు
- మహానగరాభి సంస్థదీ అదే తీరు
- కొత్త బస్సులకు బడ్జెట్ కేటాయింపులు తప్పనిసరి
- ఉచిత తాగునీటికీ తిప్పలు
- డబ్బులిస్తేనే సాఫీగా మెట్రోపరుగులు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన సంస్థలు

వాటర్‌బోర్డు ప్రతిపాదనలు రూ.4000 కోట్లు


మహానగరంతో పాటు ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని ప్రాంతాలకు తాగు నీరు సరఫరా చేసేందుకు, మురుగునీటి నిర్వహణ చేపట్టేందుకు 2024-25కు సుమారు రూ.4వేల కోట్ల నిధులు కావాలని వాటర్‌బోర్డు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. గోదావరి, కృష్ణా ఫేజ్‌ల కోసం చేసిన రుణాలు, వార్షిక వడ్డీల కోసం రూ.వెయ్యి కోట్లు, సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల కోసం రూ.1,500 కోట్లు, ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్ట్ కింద చేపడుతున్న పనులకు, ఉచిత తాగునీటి పథకానికి రూ. 500 కోట్లు కేటాయించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం కరుణిస్తేనే.. GHMC

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఏర్పాటు నాటికి మిగులు నిధులతో ఉన్న జీహెచ్‌ఎంసీ కాలగమనంలో దివాళా తీసింది. భారీ ప్రాజెక్టుల నిర్మాణం సంస్థ నెత్తిన పెట్టడం.. ఆర్టీసీకి నిధుల బదలాయింపు.. గ్రాంట్లుగా రావాల్సిన మొత్తమూ ఏళ్లుగా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడం ఇందుకు ప్రధాన కారణం. పట్టణ ప్రగతిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్ మినహా, జీహెచ్‌ఎంసీకి పైసా కూడా విడుదల చేయలేదు. ప్రభుత్వ భవనాల ఆస్తి పన్నూ.. రూ.వేల కోట్లు పెండింగ్‌లో ఉంది. నిధులు ఇవ్వకుండా.. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ), కాంప్రహెన్సీవ్ రోడ్ మెయింటెనెన్స్ (సీఆర్‌ఎంపీ), వ్యూహాత్మక నాలాల అభివృద్ధి (ఎస్ఎన్‌డీపీ) వంటి భారీ ప్రాజెక్టుల బాధ్యతలు జీహెచ్‌ఎంసీకి అప్పగించింది. కానీ నిధులు కేటాయించ లేదు. ఆదాయం లేకపోవడంతో ప్రాజెక్టులను పూర్తిచేయడం సంస్థకు గుదిబండగా మారింది.

రూ.1000 కోట్లు పెండింగ్

వివిధ పనులకు సంబంధించి జీహెచ్‌ఎంసీలో ఇప్పటికే రూ.1000 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 'నో పేమెంట్.. నో వర్క్' అంటూ పలుమార్లు కాంట్రాక్టర్లు సమ్మె నిర్వహించారు. వర్షాకాలానికి సంబంధించి ముందస్తు పనులు చేపట్టాల్సి ఉన్నా, కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు. వారికి డబ్బులు చెల్లించే పరిస్థితులు లేవు. ప్రభుత్వం కరుణించి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తేనే సమస్యలు తీరేది.



నెలకు రూ.105 కోట్లు!

- జీహెచ్‌ఎంసీ నెలనెలా కట్టాల్సిన వాయిదా మొత్తమిది!
- ప్రస్తుతం నెలకు రూ.68 కోట్ల వడ్డీ
- ఏప్రిల్ నుంచి అసలు, వడ్డీ కలిపి మరో రూ.37 కోట్లు అదనం
- ప్రాజెక్టుల కోసం రూ.6530 కోట్ల అప్పు
- లోటు బడ్జెట్‌లో సంస్థ

మార్చి వరకు రూ.591 కోట్లు కావాలని కోరిన జీహెచ్‌ఎంసీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ అప్పు రూ.6,530 కోట్లు.. ఇందులో ఇప్పటికే రూ.6,314 కోట్లు ఖర్చు చేశారు. మునిసిపల్ బాండ్లు, రూపీ టర్మ్ రూపంలో పలు దఫాలుగా తీసుకున్న మెజార్టీ రుణానికి ప్రస్తుతం వడ్డీ మాత్రమే చెల్లిస్తుండగా.. ఏప్రిల్ నుంచి అసలు, వడ్డీ కలిపి వాయిదాలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం సగటున నెలకు రూ.68 కోట్లు చెల్లిస్తుండగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి అది సుమారు రూ.105 కోట్లకు చేరనుంది. కాలగమనంలో ఈ మొత్తం మరింత అధికమవుతుందని ఆర్థిక విభాగం వర్గాలు చెబుతున్నాయి. వేతనాల చెల్లింపునకే ఇబ్బందులు పడుతున్న సంస్థ అదనపు భారాన్ని భరించే పరిస్థితి లేదు. దీంతో ఆదుకోవాలని సర్కారును కోరుతోంది. బుధవారం హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ ఈ విషయాన్ని అధికారులు నివేదించారు. ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చిలోగా కనీసం రూ.1,276 కోట్ల నిధులు అవసరమని, సంస్థ వనరుల ద్వారా కేవలం రూ.685 కోట్లు సమకూరే అవకాశముందని, మిగిలిన లోటును సర్కారు పూడ్చాలని కోరారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ వద్దే పురపాలక శాఖ ఉన్న నేపథ్యంలో ఆయనతో చర్చిస్తామని పొన్నం చెప్పారని ఓ అధికారి తెలిపారు. రూపీ టర్మ్‌లో మొదటి దఫాలో తీసుకున్న రూ.2,500 కోట్ల రుణానికి గత అక్టోబర్ నుంచి అసలు, వడ్డీ కలిపి వాయిదా చెల్లిస్తున్నారు. రానున్న ఆర్థిక

మిగతా 8వ పేజీలో..



కొత్తబస్సులు రోడ్డెక్కేనా?

రాష్ట్ర బడ్జెట్‌పై గ్రేటర్ ఆర్టీసీ గంపెడు ఆశలు పెట్టుకుంది. 'మహాలక్ష్మి' పథకం వల్ల సిటీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య రెట్టింపు స్థాయిలో పెరిగింది. గ్రేటర్‌లో 2,600 బస్సులు నడుపుతూ రోజుకు 22 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తే వారిలో 11-12 లక్షల మంది మహిళా ప్రయాణికులు ఉంటున్నారు. ప్రయాణికుల అవసరాలు తీర్చాలంటే మరో రెండు వేల కొత్త బస్సులు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. ఆర్టీసీకి ప్రత్యేకంగా బడ్జెట్‌లో రూ. 1500 కోట్లు కేటాయించాలనే డిమాండ్లు ఉన్నాయి. గత ప్రభుత్వం టీఎస్ ఆర్టీసీకి రూ. 1500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినా పాత అప్పుల చెల్లింపులకే సరిపోయేవి. గ్రేటర్‌లో ఆర్టీసీ సేవలు విస్తరించాలన్నా, ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలన్నా కొత్తగా 2 వేల ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాల్సి ఉంది. ఇందుకోసం బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆ సంస్థ కోరుతోంది.

భూమి ఉంది.. భవనం లేదు.. 6

'మన బడి' మారాలంటే.. 6

పర్యాటకాన్ని పట్టించుకోవాలి.. 6

'ఆరోగ్య'కర కేటాయింపులు కావాలి 6

హెచ్‌ఎండీఏ @ రూ.1,600 కోట్లు

రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1,600 కోట్ల వరకు నిధులు కేటాయించాలని హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) ప్రతిపాదనలు చేసినట్లు తెలిసింది. సంస్థ ఆధ్వర్యంలో భారీ ప్రాజెక్టులను చేపట్టాలని ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఆ దిశగా కేటాయింపులు ఉంటాయా.? లేదా.? వేచి చూడాల్సి ఉంది. పీపీపీ పద్ధతిలో మూసీనదిని అభివృద్ధి చేయాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అందుకనుగుణంగా బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. మూసీ వెంట వివిధ ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణం, ఇరువైపులా రోడ్ల అభివృద్ధి, ఆక్రమణలు తొలగించడం, మురుగు వ్యర్థాలు చేరకుండా ఎస్టీపీల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం 2024-25 బడ్జెట్‌లో సుమారు రూ.వెయ్యి కోట్ల వరకు నిధులు కేటాయించే అవకాశాలున్నాయి.

మెట్రో వాటా ఎంత?

రెండో దశ అంచనా వ్యయం రూ.17,500 కోట్లు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వారం రోజుల్లోనే రేవంత్‌రెడ్డి మెట్రో రెండో దశ విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన పనులను పక్కనపెట్టి కొత్త మార్గాలను పరిశీలించారు. ఇందులో భాగంగా మొదటి దశలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మిగిలిన 5.5 కిలోమీటర్లను పూర్తి చేయడంతోపాటు ఇదే మార్గం నుంచి ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్‌ను నిర్మించేలా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో వె ుంద టి



సమీక్ష అనంతరం మళ్లీ రెండువారాలకు వచ్చిన అధికారులు పలు మార్గాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించగా.. ఆయన వాటికి ఆమోదముద్ర వేశారు. ఇందులో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మిగిలిన 5.5 కిలోమీటర్లను పూర్తి చేయడంతోపాటు ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్డు వరకు 1.5 కిలోమీటర్లను కొత్తగా తీసుకొచ్చారు. అలాగే, నాగోల్ నుంచి వయా ఎల్‌బీనగర్, చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్డు, మైలార్‌దేవ్‌పల్లి, పీ7 రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు(29 కి.మీ), మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్, న్యూ హైకోర్టు వరకు(4 కి.మీ), రాయదుర్గం నుంచి బయోడైవర్సిటీ జంక్షన్, నానక్‌రామ్‌గూడ జంక్షన్, విప్రో జంక్షన్, అమెరికన్ కాన్సులేట్ (ఫైనాన్షియల్ డిస్ట్రిక్) వరకు 8 కి.మీ, మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్, పటాన్‌చెరు వరకు 14 కి.మీ, ఎల్‌బీనగర్ నుంచి వనస్థలిపురం, హయత్‌నగర్ వరకు(8 కి.మీ) ప్రతిపాదించారు. మొత్తం 7 కారిడార్లలో 70 కి.మీకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

మెట్రో రెండో దశ విస్తరణకు

మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి రూ.17,500 కోట్ల అంచనా వ్యయాన్ని

మిగతా 6వ పేజీలో..

నేడు ఐఐఎంఆర్ 66వ వ్యవస్థాపక దినోత్సవం 8

'చేతి'కి చిక్కిన మహేందర్‌రెడ్డి



- ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు భారీ షాక్
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మహేందర్‌రెడ్డి కుటుంబం

నగర ఓటర్లు 45.70 లక్షలు



- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 33 వేల మంది ఓటర్లు అధికం
- మలక్‌పేట, నాంపల్లిలో తగ్గిన ఓటర్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలో ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 45.36 లక్షల మంది ఓటర్లుండగా, ఇప్పుడా సంఖ్య 45.70 లక్షలకు చేరింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రత్యేక సమ్మరీ రివిజన్ నిర్వహించిన జీహెచ్‌ఎంసీ ఓటర్ల తుదిజాబితాను గురువారం విడుదల చేసింది. జనవరి 1, 2024 అర్హత తేదీతో ఓటరు నమోదుకు అధికారులు అవకాశం కల్పించారు. చిరునామా మార్పు, పేర్ల తొలగింపునకు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 33 వేలకుపైగా ఓటర్ల సంఖ్య పెరిగింది. మలక్‌పేట, నాంపల్లి నియోజకవర్గాల్లో తగ్గింది. గతంలో 3,17,866 మంది ఓటర్లు ఉండగా, ఇప్పుడా సంఖ్య 3,15,634కు, నాంపల్లిలో 3,32,764 నుంచి 3,22,967కు ఓటర్ల సంఖ్య తగ్గింది. ఇతర నియోజకవర్గాల్లో పెరుగుదల కనిపిస్తోంది. చాంద్రాయణగుట్టలో సుమారు 10 వేలు, బహదూర్‌పురా, సికింద్రాబాద్, ముషీరాబాద్‌లో 5 వేల వరకు, కార్వాన్, గోషామహల్‌లో నాలుగు వేల చొప్పున ఓటర్లు పెరిగారు. జాబితాలో పేరుందా..? లేదా..? అన్నది http://voters.eci.govwin, ceotelangana.nic.inలో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో చెక్ చేసుకోవాలని ఓటర్లకు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ సూచించారు.

ఓటరు నమోదుకు అవకాశం

జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా పేరు నమోదు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో షెడ్యూల్ విడుదలై, నామినేషన్ల దాఖలు చివరి తేదీకి పది రోజుల ముందు వరకు నమోదుకు అవకాశముంటుందని చెప్పారు.

నియోజకవర్గం	గత ఓటర్లు	ప్రస్తుత ఓటర్లు
ముషీరాబాద్	3,01,788	3,06,381
మలక్‌పేట	3,17,866	3,15,634
అంబర్‌పేట	2,77,103	2,78,675
ఖైరతాబాద్	2,96,014	2,96,383
జూబ్లీహిల్స్	3,85,265	3,87,206
సనత్‌నగర్	2,49,022	2,52,530
నాంపల్లి	3,32,764	3,22,967
కార్వాన్	3,59,431	3,63,017
గోషామహల్	2,70,623	2,74,668
చార్మినార్	2,26,117	2,28,498
చాంద్రాయణగుట్ట	3,37,815	3,47,614
యాకుత్‌పురా	3,53,128	3,55,979
బహదూర్‌పురా	3,16,666	3,21,244
సికింద్రాబాద్	2,62,517	2,67,282
కంటోన్మెంట్	2,50,733	2,52,060
మొత్తం	45,36,852	45,70,138

‘మన బడి’ మారాలంటే..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పాతకాలం నాటి సర్కార్ బడులను సరికొత్తగా తీర్చిదిద్ది వాటికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ జిల్లాలో ‘మన బస్తీ-మన బడి’ పనులను ప్రారంభించింది. ఈ మేరకు మొదటి విడత కింద 16 మండలాల పరిధిలో 278 స్కూళ్లను ఎంపిక చేశారు. ఇందులో స్లాబ్‌లు వేసి గోడలు నిర్మించని తరగతి గదులను పూర్తి చేయడం, కొత్త ఆడిటోరియంల నిర్మాణం, బెంచీల కొనుగోలు, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతు లాంటి పనులున్నాయి. ఆయా చోట్ల పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో రాకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. కొన్నిచోట్ల అధికారులు ప్రత్యేక చొరవచూపి పూర్తి చేయించారు. మొత్తం 278 స్కూళ్లలో ఇప్పటి వరకు 24 చోట్ల మాత్రమే పనులు పూర్తయ్యాయి. నిధుల కొరతతో ఆగిపోయిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుని పూర్తి చేస్తుందని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆశిస్తున్నారు.

భూమి ఉంది.. భవనం లేదు..

● **రాచకొండ కమిషనరేట్‌కు మోక్షం కలిగేనా?**

రాచకొండ కమిషనరేట్ కార్యాలయ భవనం నిర్మించేందుకు మేడిపల్లిలో 51 ఎకరాల స్థలాన్ని కేటాయించి ఏళ్లు గడుస్తున్నాయి. ఇప్పటి వరకు పునాదిరాయి మినహా, పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. ఈ బడ్జెట్‌లో అయినా భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించేనా అని పోలీస్ ఉన్నతాధికారులు చర్చించుకుంటున్నారు. హైదరాబాద్ కమిషనరేట్‌తో పాటు.. రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్‌ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొత్త పోలీస్‌స్టేషన్‌లు, డివిజన్‌లు, జోన్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కార్యాలయాలకు భవనాలు దొరకక పోలీసులు అద్దె భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారు.

‘ఆరోగ్య’కర కేటాయింపు కావాలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, పేట్లబురుజు, కోఠి మెటర్నిటీ ఆస్పత్రుల్లో పడకలు, వైద్యులు, ఇతర సిబ్బంది సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. ఉస్మానియా ట్విన్ టవర్ నిర్మాణం దశాబ్దకాలంగా అడుగు ముందుకు పడడం లేదు. చెస్ట్ ఆస్పత్రిలో మరో భవన నిర్మాణం, మానసిక చికిత్సాలయంలో అభివృద్ధి పనులకు నిధుల అవసరం ఉంది. నిధులు మంజూరు చేయడం లేదని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేశారు. కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయిస్తేనే ఈ సమస్యలకు మోక్షం కలుగుతుంది.

ఠాణా నిర్వహణ డబ్బులు వచ్చేనా..?

పోలీస్‌స్టేషన్‌ల నిర్వహణకు గత ప్రభుత్వం డబ్బులను నిలిపేసింది. నూతన ప్రభుత్వం నిధులు కేటాయించేనా అని ఎస్‌హెచ్‌వోలు ఎదురు చూస్తున్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నట్లు చూపిస్తున్నా.. విడుదల చేయకపోవడంతో సీసీటీవీ నిర్వహణ చాలా ప్రాంతాల్లో లోపభూయిష్టంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి బెటర్ పోలీసింగ్‌కు దోహదపడాలని పోలీస్ ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

మెట్రో వాటా ఎంత..?

(5వ పేజీ తరువాయి)

రూపొందించారు. మూడు నెలల్లో డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్టు(డీపీఆర్) పూర్తిచేసి ఇవ్వాలని హైదరాబాద్ మెట్రో అధికారులను ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. పనులను ప్రభుత్వమే చేపట్టేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో బడ్జెట్‌లో మొదటి విడతగా ఎన్ని కేటాయింపులు చేస్తారనేది ఆసక్తిగా మారింది. టెండర్ల దశ ముగిసి పిల్లర్ల నిర్మాణం ప్రారంభించాలంటే కనీసం రూ.4,500 కోట్లు అవసరముంటాయని అధికారులు చెబుతున్నారు. అయితే, అంచనాకు తగినట్లుగా 25 శాతం నిధులు కేటాయిస్తే పనులు మొదలు పెట్టవచ్చని పేర్కొంటున్నారు. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న ఎంజీబీఎస్-ఫలక్‌నుమా(5.5) కిలోమీటర్లకు రూ.2వేల కోట్లు ఇస్తే ఏడాదిలోపు పూర్తిచేసే అవకాశముందని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, పాతబస్తీ పనులకు 2022లో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.500 కోట్లు, 2023లో రూ.వెయ్యి కోట్లు కేటాయించినా రూపాయి కూడా విడుదల చేయకపోవడం గమనార్హం.

పర్యాటకాన్ని పట్టించుకోవాలి..

నగరం పర్యాటకానికి కేరాఫ్ అడ్రస్ లాంటిది. ఇక్కడి నిజాం రాజుల కట్టడాలు, చారిత్రక నిర్మాణాలు, పార్కులు సందర్శకులను కట్టిపడేస్తుంటాయి. తెలంగాణ పర్యాటకానికి కేంద్ర బిందువైన హైదరాబాద్‌లోని టూరిజం డెవలప్‌మెంట్‌ను పట్టించుకునే వారే కరువయ్యారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రదేశాలు, హోటళ్లను అభివృద్ధి చేసేందుకు కాస్త ఆసక్తి చూపించినప్పటికీ, నగర టూరిజాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. దీంతో నగరానికి వస్తున్న పర్యాటకులకు కనీస సదుపాయాలు కరువవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవికాలంలో తాగు నీరు, కూర్చునేందుకు బెంచీలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కాగా, రూ.200 టికెట్‌తో బిర్లామందిర్, లుంబినీపార్కు, ఎన్టీఆర్ గార్డెన్, జూపార్కు, గోల్కొండ, చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్ వద్దకు తీసుకెళ్లి వచ్చే హాప్ ఆన్-హాప్ ఆఫ్ బస్సులు కూడా అందుబాటులో లేకపోవడంతో నిరుత్సాహానికి లోనవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో సిటీ టూరిజాన్ని పట్టించుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఫోర్జరీ పత్రాలతో రిజిస్ట్రేషన్‌కు యత్నం

● ఎన్ఆర్ఐకి.. బుద్వేల్‌లో 400 గజాల స్థలం ● కాజేసేందుకు పథకం ● ఇద్దరి అరెస్ట్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ పత్రాలతో ఎన్ఆర్‌కి చెందిన 400 గజాల స్థలాన్ని తమ పేర రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి యత్నించిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసిన రాజేంద్రనగర్ పోలీసులు, గురువారం వారిని రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... అమెరికాలో నివాసం ఉంటోన్న చెరుకూరి శ్రీనివాస్‌రావు(ఎన్ఆర్ఐ)కు, బుద్వేల్ గ్రామం సర్వేనెంబర్ 88లో 400 గజాల (ప్లాట్‌నెంబర్ 211) స్థలం ఉంది. ఆ స్థలాన్ని కాజేసేందుకు సైదాబాద్ కుర్మగూడ ప్రాంతానికి చెందిన ముద్రకోళ్ల సుదర్శన్(64), గౌలిపుర హనుమాన్‌నగర్ ఫేస్-3 ప్రాంతానికి చెందిన కోయల్‌కర్ చంద్రశేఖర్(48) మరో నలుగురు వ్యక్తులు పథకం వేశారు. అందులో భాగంగా చెరుకూరి శ్రీనివాస్‌రావు పేరుతో నకిలీ ఆధార్ కార్డు, పాన్‌కార్డు సృష్టించి రాజేంద్రనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సంబంధిత డాక్యుమెంట్లు అందజేశారు. ఆ డాక్యుమెంట్లు సక్రమంగా లేకపోవడంతో అనుమానం వచ్చిన రిజిస్ట్రార్.. రిజిస్ట్రేషన్ నిలిపివేశారు. అమెరికాలో ఉంటున్న శ్రీనివాస్‌రావుకు బంధువుల ద్వారా విషయం తెలియగా, ఆయన రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం సుదర్శన్, చంద్రశేఖర్‌లను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న నలుగురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.



ఆర్టీసీ డ్రైవర్లనుద్దేశించి ప్రసంగిస్తున్న అధికారులు

ఘనంగా జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను గురువారం ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయానికి చెందిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు అమరేందర్, సోలోమన్‌రాజ్, అంబిక పాల్గొని డ్రైవర్లకు పలు సలహా సూచనలు ఇచ్చారు. ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో డ్రైవర్లకు వివరించారు. డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకిర్ హుసేన్, అసిస్టెంట్ మేనేజర్ రాజయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ దయాకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా సయ్యద్ అజ్మతుల్లా హుసేని నియామకం పట్ల ఎంపీజే హర్షం

పురానీహవేలీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అన్యాక్రాంతం అవుతున్న వక్ఫ్ భూములను పరిరక్షించాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ అజీజ్ కోరారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులైన సయ్యద్ అజ్మతుల్లా హుసేనికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. వక్ఫ్‌భూములు కబ్జాలకు గురికాకుండా చూడడంతోపాటు ఇప్పటికే అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలని అబ్దుల్ అజీజ్ సూచించారు. వక్ఫ్‌బోర్డుకు నూతన చైర్మన్ నియామకాన్ని ప్రక్షాళనకు, మార్పునకు సంకేతంగా భావిస్తున్నామన్నారు.

కాంగ్రెస్ పార్టీ హామీలు నెరవేర్చాలి : హమేద్



పహాడిషరీఫ్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షరీఫుద్దీన్ హమేద్ అన్నారు. వేసవికాలం ప్రారంభం కాలేదు అప్పుడే కరెంటు కోతలు ప్రారంభం అయ్యాయన్నారు. తప్పుడు వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేయాలని చూస్తే తగిన గుణపాఠం చెప్తామన్నారు. ప్రజాపాలన అభయస్తం దరఖాస్తుల పేరుతో కాలయాపన చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఎంపీ ఎలక్షన్ల వరకు ఇదే తతంగం నడిపిస్తారన్నారు. రైతు రుణమాఫీ సంగతి అసలే మర్చిపోయిందు అన్నారు.

గృహ జ్యోతి లబ్ధిదారులు మీటర్ రీడర్లకు వివరాలు అందజేయాలి



సత్యనారాయణ

మదీన, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి పథకంలో 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకానికి దరఖాస్తు చేసుకున్న వినియోగదారుల నుంచి డేటా సేకరణ ప్రక్రియ ప్రారంభించామని విద్యుత్ విభాగం పహాడిషరీఫ్ సెక్షన్ ఏఈ ఎల్‌వీ సత్యనారాయణ తెలిపారు. ఈనెల విద్యుత్ మీటర్ రీడింగ్‌కు మీ ఇం టి వద్దకు వచ్చే మీటర్ రీడర్లకు లబ్ధిదారులు తమ ఆహార భద్రత కార్డు నంబర్, ఆధార్ కార్డు నంబర్లతోపాటు ప్రజాపాలనలో దరఖాస్తు చేసిన ఫారం నంబర్‌ను అందజేయాలన్నారు. మీటర్ రీడింగ్ ప్రక్రియ ఈనెల 15 వరకు కొనసాగుతుందన్నారు. మీటర్ రీడింగ్ సిబ్బంది మీ ఇంటికి వచ్చినప్పుడు అందుబాటులో ఉండి అవసరమైన వివరాలను అందించాలన్నారు. గృహ జ్యోతి పథకం కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోనివారు కూడా డేటా నమోదు చేయించుకోవచ్చన్నారు. మీటర్ రీడింగ్ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు అందుబాటులో లేకపోతే వార్డు కార్యాలయం, లేదా బిల్లులు చెల్లించే ప్రదేశానికి వెళ్లి నమోదు చేయించుకోవచ్చన్నారు. కిరాయిదారులకు కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు.

అందుబాటులో ఓటరు జాబితాలు



పోలింగ్ బూత్‌లో ఓటర్లకు అందుబాటులో ఉంచిన ఓటరు జాబితా

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్‌లోని 284 పోలింగ్ బూత్‌లలో ఓటరు జాబితాలు అందుబాటులో ఉంచారు. ఓటర్లు తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో.. లేదో చూసుకోవడానికి వీలుగా ఈ సౌకర్యాన్ని కల్పించనట్లు రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ తెలిపారు. ఓటరు జాబితాలో పేరు లేకున్నా, తప్పుగా పేరు ప్రింట్ అయినా, ఒకే పేరు రెండు సార్లు ఉన్నా తమకు సమాచారం అందించాలన్నారు. తాము నివాసం ఉంటున్న ప్రాంతంలోని పోలింగ్ స్టేషన్‌లో కాకుండ ఇతర ప్రాంతాలలో గల పోలింగ్ స్టేషన్‌లో తమ పేరు వద్ద మార్పించుకోవచ్చన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : అత్తాపూర్ డివిజన్ నందిముస్లయిగూడ సమీపంలోని మారుతీనగర్‌లో రూ.13.7లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం స్థానిక కార్పొరేటర్ మొంద్ర సంగీత గౌరీశంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి పనులు మంజూరు చేయించినా, కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో రాకపోవడం వల్ల పనులు ఆలస్యంగా ప్రారంభిస్తున్నారన్నారు. బస్తీలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించడానికి తన శక్తి వంచన లేకుండ కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, నాయకులు రాజు పహిల్వాన్, బీట్యాకరి సిద్దేశ్వర్, వెంకట్ రెడ్డి, విజయ్, స్వా. గణేశ్, వెంకటేశ్, వాసుదేవరెడ్డి, జితేందర్‌సింగ్ పాల్గొన్నారు.

చట్టాలు, పోలీస్ విధులపై అవగాహన



మైలార్‌దేవుపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట విద్యార్థులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మధుబన్ కాలనీలోని శ్రీ గాయత్రీ ఈ టెక్నో స్కూల్ విద్యార్థులు గురువారం మైలార్‌దేవుపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. వారికి ఇన్‌స్పెక్టర్ పి.మధు, ఏఎస్ఐ హసీనాలు పోలీస్ స్టేషన్ వివరాలు, పోలీసు అధికారుల పని విషయం గురించి తెలియజేశారు. లా అండ్ ఆర్డర్ అంటే ఏమిటని, షీ టీమ్‌లు ఎలా పనిచేస్తాయని వివరించారు. పాఠశాల కు చెందిన ఉపాధ్యాయులు వింధ్య, సంజయ్‌లు విద్యార్థుల వెంట ఉండి పోలీసు స్టేషన్‌లో చేపట్టే కార్యక్రమాలను తెలుసుకునేలా చేశారు.

సాంస్కృతిక సౌజన్యమూర్తి రమణాచారి..

రవీంద్రభారతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అధికారిగా, కళాపోషకులుగా ప్రజల హృదయాల్లో నిలిచిన రమణాచారి జీవితం ముందు తరాలకు ఆదర్శం అని వక్తలు అభివర్ణించారు. కళలు, కళాకారులను ప్రోత్సహిస్తున్న సాంస్కృతిక సౌజన్యమూర్తి అని కొనియాడారు. గురువారం రవీంద్రభారతిలో సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువకళావాహిని, సత్యకళాభారతి సంస్థ, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బ్రాహ్మణ పరిషత్ మాజీ చైర్మన్ డా.కేవీ.రమణాచారి 72వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సారిపల్లి కొండలరావు, సత్యనారాయణ తదితరులు హాజరై రమణాచారి దంపతులను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు జిల్లాల నుంచి విచ్చేసిన వందలాది మంది కళాకారులు పాల్గొని రమణాచారిను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సభకు ముందు జానపద కళాకారులచే ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. అనంతరం చైతన్య కళాభారతి వారిచే స్వప్నం రాల్చిన అమృతం నాటికను ప్రదర్శించారు.



రమణాచారి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

పుట్టినరోజు శుభాకాంక్షలు

రమణాచారి పుట్టినరోజు సందర్భంగా గురువారం ఉదయం నుంచి ఆయన ఇంటివద్ద కళాకారులు, కళాసంస్థల ప్రతినిధులు చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు. కిన్నెర సంస్థ కార్యదర్శి రఘురాం, ప్రముఖ పద్యనాటక కళాకారులు గుమ్మడి గోపాలకృష్ణ, సతీష్, నర్తకుడు అంజుబాబు, బడేసాబ్, శ్రీనివాస్‌గౌడ్, వడ్డేపల్లి కృష్ణ, దైవజ్ఞశర్మ, సత్యనారాయణలతో పాటు వందలాది మంది కళాకారులు రమణాచారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మేనేజ్‌లో వంద శాతం ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన యువ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)లో పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) పూర్తి చేసిన 27వ బ్యాచ్‌కు చెందిన 65మంది యువ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలను కల్పించింది. వారిని మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అభినందించారు.

స్వల్ప తగాదాలో అన్నను హత్య చేసిన తమ్ముడు



హత్యకు గురైన సయ్యద్ అబ్దుల్ రహ్మాన్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల మధ్య జరిగిన స్వల్ప తగాద ఓ వ్యక్తి హత్యకు దారి తీసింది. వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి ముస్లింలకు పవిత్రమైన షబ్బే మేరాజ్ ఉండగా ఆ సమయంలో శాలిబండకు చెందిన సయ్యద్ అబ్దుల్ రహ్మాన్(36) మద్యం సేవించి వీధుల్లో తిరుగుతున్నాడు. అతడిని గమనించిన అతని పెద్ద తమ్ముడు సయ్యద్ ఉమర్ శాస్త్రీపురం కాలనీలో ఉండే చిన్న తమ్ముడు సయ్యద్ ఇస్మాయిల్‌కు ఫోన్ చేసి అన్న తాగి రోడ్ల వెంట తిరుగుతున్నాడు. తీసుకువెళ్లి వాళ్లింటి దగ్గర వదిలిపెట్టమని చెప్పాడు. దీంతో సయ్యద్ ఇస్మాయిల్ మతిస్థిమితం సరిగ్గా ఉండని అన్న రహ్మాన్ వద్దకు వెళ్లి ఇంటికి వెళదాం పదా అనగా అతను వాళ్లింటికి వెళ్లడానికి నిరాకరించాడు. ఇంట్లో ఎవరు లేరని, అందరు ప్రార్థనలకు వెళ్లారని, ఇంటి యజమాని గొడవపడుతున్నాడని చెప్పడంతో అన్నను శాస్త్రీపురం కాలనీలో ఉండే తమ ఇంటికి తీసుకువచ్చాడు. శాస్త్రీపురం వచ్చినప్పటి నుంచి రహ్మాన్ తమ్ముడుతో గొడవ పడుతూ ఉన్నాడు. తమ్ముణ్ని కొట్టడంతో సయ్యద్ ఇస్మాయిల్(22) ఇంట్లో ఉన్న కత్తి తీసుకు వచ్చి అన్నను మెడ కోసి హత్య చేశాడు. అనంతరం మైలార్‌దేవుపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. ఇన్‌స్పెక్టర్ పి.మధు పర్యవేక్షణలో ఎస్ఐ రజాక్ హత్య జరిగిన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు సానెం శ్రీనివాస్‌గౌడ్. - రాజేంద్రనగర్, ఆంధ్రజ్యోతి



తెలంగాణ పోరాట యోధురాలు పాతబస్తీకి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు సుమతి గురువారం టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసి తెలంగాణ పోరాటంలో పాల్గొన్న వివరాలను, పత్రికల క్లిప్పింగులను అందజేశారు. - చార్మినార్ ఆంధ్రజ్యోతి

యువతి అదృశ్యం



పహాడిషరీఫ్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయిన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రకుంట న్యూ మొహమ్మద్‌నగర్‌కు చెందిన షేక్ దావుద్ కూతురు సమీరా(22) బుధవారం తెల్లవారుజామున ఐదు గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం చుట్టు పక్కల బస్తీలో బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె తండ్రి బాలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎండు గంజాయి స్వాధీనం



గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గంధ్ర దేవేందర్‌రావు పర్యవేక్షణలో బుధవారం సాతంరాయి ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎండు గంజాయిని ద్విచక్రవాహనంలో తరలిస్తున్న వ్యక్తి పట్టుబడ్డాడు. అతడిని విచారించగా పేరు రాజుసింగ్ అని, బీహార్‌కు చెందిన వాడని ప్రస్తుతం కాటేదాన్ పయనీర్ కాన్సెప్ట్ స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్నాడని కనుగొన్నారు. అతను నడిపిస్తున్న టీఎస్07-6458 ద్విచక్ర వాహనంలో 440 గ్రాముల ఎండు గంజాయిని 56 ప్యాకెట్లుగా చేసుకుని తీసుకువస్తుండగా పట్టుకున్నారు. అతన్ని విచారించగా బీహార్ నివాసులు, ప్రస్తుతం దానమ్మ జోపిడీ ప్రాంతంలో ఉంటున్న శివ శంకర్ సాహ, వికాస్ కుమార్‌లు కూడా ఎండు గంజాయిని విక్రయిస్తున్నట్లు కనుగొన్నారు. వారిద్దరిని అరెస్ట్ చేయగా వారి వద్ద 940 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. వీరు బీహార్ నుంచి కిలో గంజాయిని రూ.10వేలకు తీసుకువచ్చి దాన్ని ఇక్కడ రూ. 18 వేలకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి 1380 గ్రాముల ఎండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు వికసిత భారత్ కార్యక్రమం

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గౌలిపురా డివిజన్ పరిధిలో శుక్రవారం వికసిత్ భారత్ కార్యక్రమం ఉంటుందని మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. గౌలిపురా మిత్రక్లబ్‌లో ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు, పటేల్‌నగర్ ప్లేగ్రౌండ్‌లో మధ్యాహ్నం 1-30 నుంచి 4-30గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంబురంగా జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు

- తొలి రోజు పోటీలకు 2 వేల మంది హాజరు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రెండు దశాబ్దాల తర్వాత హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు గచ్చిబౌలి స్టేడియంలో సంబురంగా ఆరంభమయ్యాయి. గురువారం ఈ పోటీలను మాజీ మంత్రి మల్లారెడ్డి, జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ప్రారంభించారు. తొలి రోజు పోటీల్లో 20 రాష్ట్రాల నుంచి రెండు వేల మందికి పైగా వెటరన్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ వెటరన్ అథ్లెట్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తానూ స్పోర్ట్స్ ట్రాక్ సూట్‌లో ఇక్కడికి వచ్చానని చెప్పారు. మాస్టర్ అథ్లెట్లను యువత ప్రేరణగా తీసుకుంటే దేశం ఫిట్ ఇండియాగా తయారవుతుందన్నారు.



పోటీల ప్రారంభోత్సవంలో మల్లారెడ్డి

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ప్రభుకుమార్, కోశాధికారి డి.లక్ష్మి, సహాయ కార్యదర్శి లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

కుక్క అడ్డురావడంతో బైకు నుంచి కిందపడి యువకుడి మృతి



సాయికుమార్ మృతదేహం

మదీన, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి కింద పడిపోయిన ఓ యువకుడు తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన హుసేనిఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్ఐ ప్రియాంక తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడకు చెందిన సాయికుమార్(33) సోమాజిగూడలోని కొటక్ మహేంద్ర బ్యాంక్‌లో పనిచేస్తుంటాడు. రోజుమాదిరిగానే తన బైక్‌పై ఆఫీస్‌కు వెళ్తుండగా ఖిల్వత్ సమీపంలోని ముర్గీ చౌక్ వద్ద కుక్క అడ్డం వచ్చింది. సడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలయ్యాయి. సమాచారమందుకున్న హుసేనిఆలం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలపాలైన సాయికుమార్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసును ఎస్ఐ ప్రియాంక దర్యాప్తు చేస్తున్నారు.

కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలి

- బాధితుడు కోరళ్ల కృష్ణారెడ్డి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాలకు పాల్పడుతూ దాడులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరళ్ల కృష్ణారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కబ్జాను అడ్డుకున్నందుకు తనపై హత్యాయత్నం చేశారని, తప్పించుకోవడంతో గాయాలతో బయటపడ్డానని తెలిపారు. ఇందులో ఖమ్మం జిల్లాకు చెందిన బిలీఫ్ ఆస్పత్రి ఎండీ రమాజ్యోతి పాత్ర ఉందని ఆరోపించారు. భూకబ్జాదారుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పహాడిషరీఫ్ పీఎస్ పరిధిలోని బాసగూడ తండా వద్ద తనకు ఎకరం 21 గుంటల భూమి ఉందని, కొంత భూమిని రమాజ్యోతి బంధువు కబ్జా చేయడానికి ప్రయత్నించాడని, తాను అడ్డుకోవడంతో మారణాయుధాలతో దాడి చేయించారన్నారు. పహాడిషరీఫ్ ఎస్ఐ కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని, దీని వెనుక మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాత్ర ఉందని ఆరోపించారు. మహేశ్వరం మండలం, కొంగరకుర్దు గ్రామ రెవెన్యూ పరిధిలో 8 ఎకరాల 24 గుంటల భూమిని జెల్లల లక్ష్మయ్య తనకు విక్రయించాడని, ఇదే భూమిని మరొకరికి డబుల్ రిజిస్ట్రేషన్ చేశాడని, ఇదేమిటని ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అనుచరుల పాత్ర ఉందన్నారు. 285 సర్వే నెంబర్‌లోని 3 ఎకరాల భూమిని కూడా రవీందర్‌రెడ్డి తనకు విక్రయించారని, ఈ భూమిని ఆక్రమించడానికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అండదండలతో కొంతమంది భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కబ్జాపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. కబ్జాదారులకు అండగా నిలుస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు కోరళ్ల కృష్ణారెడ్డి

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈనెల 10వ తేదీ నుంచి రెండ్రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర చెస్ చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కె.ఎస్ ప్రసాద్ తెలిపారు. ఎల్బీ స్టేడియంలోని యోగా హాల్‌లో ఈ పోటీలు జరగనున్నాయని, ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇది ఓపెన్ టోర్నమెంట్, తెలంగాణకు చెందిన వారు పాల్గొనవచ్చునని, టాప్‌లో నిలిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు.

మహిళ అదృశ్యం

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కుమారుడు కొట్టడంతో తల్లి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కిషన్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. చాపలబాయికి చెందిన వేణుగోపాల్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. నైట్ డ్యూటీకి వెళ్లి రాగా తన భార్య లలిత కనపడలేదు. కుమారుడిని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. పక్కింటి వారిని విచారించగా లలితను రాత్రి మీ కొడుకు కొట్టాడని అందువలన ఇంటి నుంచి వెళ్లి పోయి ఉంటుందని తెలిపారు. దీంతో పలుచోట్ల వెతికినా లలిత ఆచూకి లభించకపోవడంతో మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో భర్త వేణుగోపాల్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

15 నుంచి శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై జాతీయ సదస్సు

పంజాగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ, జాతీయ తేనెటీగ బోర్డు, జాతీయ తేనెటీగల పెంపకం సంస్థల సహకారంతో యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్(నిమ్స్ మే)లో శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై ఈనెల 15, 16వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిమ్స్‌మే ఫ్యాకల్టీ సభ్యులు వీబీ.రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్ శర్మ, డాక్టర్ శిరీష్ కులకర్ణిలు సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. నిమ్స్ మే డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరిస్వరూప, మానేజ్ డీజీ డాక్టర్ పి.చంద్రశేఖర్, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ అదనపు కమిషనర్ నవీన్ కుమార్ పాటిల్, శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్‌చాన్సులర్ డాక్టర్ బి.నీరజా ప్రభాకర్, ఎఫ్‌సీఆర్‌ఐడీస్ ప్రియాంకావర్గీస్, తదితరులు పాల్గొంటారన్నారు. ప్రవేశం ఉచితం అని, వివరాలకు, పేర్లు నమోదు చేసుకోవడానికి 040-23633228 నంబర్‌కు ఫోన్‌లో సంప్రదించాలని వారు సూచించారు.



శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై జాతీయ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిమ్స్ మే ఫ్యాకల్టీ సభ్యులు

యువకుడిపై దాడి.. దారిదోపిడీ

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): షాపు ముగించుకుని ఇంటికి వెళుతున్న యువకుడిని ఆపి దారి దోపిడీకి పాల్పడ్డ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగడ్డ శివాజీనగర్‌కు చెందిన రాథోడ్ సురేష్ ఎర్రగడ్డలో ఛాట్‌బండి నిర్వహిస్తుంటాడు. బుధవారం అర్ధరాత్రి షాప్‌ను మూసేసి ద్విచక్రవాహనంపై సోదరుడి ఇంటికి వెళ్తున్నాడు. ఆలీనగర్‌లోకి రాగానే 30-35 ఏళ్ల వయసున్న అగంతకుడు వచ్చి సురేష్ ద్విచక్రవాహనాన్ని ఆపాడు. అనంతరం డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడిచేశాడు. సురేష్ వద్ద ఉన్న రూ.1600 తీసుకుని పారిపోయాడు. బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఖైరతాబాద్ మారుతీనగర్‌లో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన కామాకుల అశోక్ (33), సౌజన్య దంపతులు రెండు సంవత్సరాల క్రితం ఖైరతాబాద్ మారుతీనగర్‌కు వలస వచ్చారు. అశోక్ పంజాగుట్టలోని సుబేధ ఆస్పత్రిలో వార్డుబాయ్‌గా పని చేస్తుండగా సౌజన్య హౌజ్‌కీపింగ్ పనిచేస్తోంది. మందు తాగే అలవాటు ఉన్న అశోక్ తరచూ భార్యతో గొడవకు దిగేవాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు తన ఇంటి సమీపంలో ఉండే బావకు ఫోన్ చేసి తన చేతికి గాయమైందని, ఆస్పత్రి దగ్గర ఉన్నానని చెప్పగా ఆయన బండిపైన అశోక్‌ను ఇంటి వద్ద దిగబెట్టాడు. అప్పటికే పూటుగా మద్యం తాగిన అశోక్ గదిలోపలికి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. భార్య మధ్యాహ్నం వచ్చి చూడగా తలుపు ఎంతకూ తీయలేదు. అనుమానంతో కిటికీ నుంచి చూడగా అశోక్ ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకొని కనిపించాడు. పొరుగువారి సహకారంతో కిందకు దించగా అప్పటికే అతడు చనిపోయాడు. మద్యం మత్తులోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

బోయినపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఓ ఆలయ సమావేశంలో జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయినపల్లి హస్మత్‌పేట్ అంజయ్యనగర్ ప్రాంతానికి చెందిన మంద మధుకర్(30)కు మంగళవారం స్థానికంగా ఉన్న శ్రీహనుమాన్ దేవాలయంలో సమావేశముందని కమిటి సభ్యులు చెప్పారు.

దీంతో మధుకర్ స్థానికంగా నివసించే అతని స్నేహితుడు బ్యాగరి నర్సింహా(33)ను తీసుకుని దేవాలయానికి వెళ్లాడు. సమావేశం జరుగుతుండగా స్థానికంగా నివసించే వైద్యుడు మర్రి బాలరాజు(55) కులాలను ప్రస్తావిస్తూ మీకు ఇక్కడ ఏమి పని అంటూ మధుకర్, నర్సింహాలను దూర్భాషలాడాడు. అప్పటికి మధుకర్, బాలరాజును దూర్భాషలాడోద్దని వారించిన అతను వినిపించుకోకుండా కోపోద్రిక్తుడై ఓ ఇటుకరాయిను మధుకర్‌పైకి విసరబోగా అది మల్లికార్జున్ అనే వ్యక్తి తలకు తగిలి గాయాలయ్యాయి. మధుకర్ ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తను తీసుకువస్తే సహించం..!

● ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటుపై ఆందోళన


మెదక్ హైదరాబాద్ పై రోడ్డుపై బైఠాయించిన నాలుగు గ్రామాల ప్రజలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు ఆదిలోనే అవాంతరాలు ఏర్పడుతున్నాయి. మహానగరం నుంచి చెత్తను తీసుకురానిచ్చేది లేదంటూ స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డు వద్దకు వెళ్లేందుకు నిర్మిస్తోన్న రోడ్డు పనులను గురువారం అడ్డుకున్నారు. అనంతరం హైదరాబాద్- మెదక్ జాతీయ రహదారిపై ప్యారానగర్, నల్లవల్లి, కొత్తపల్లి, మంబాపూర్ గ్రామస్థులు బైఠాయించి ధర్నా చేశారు. ఇన్ని రోజులు ఆరోగ్యంగా బ్రతికామని డంపింగ్ యార్డు ఏర్పాటుతో అనారోగ్య ప్రమాదం తోపాటు వ్యవసాయంపైనా ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చని అటవీ ప్రాంతం పక్కన చెత్త నిల్వతో దుర్గంధం వ్యాపిస్తుందని, పరిసరాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మహానగరం చెత్త ఇక్కడకు తరలిస్తే ప్రాణాలు పణంగా పెట్టయినా అడ్డుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్, ఫారెస్టు అధికారులు స్థానికుల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. దాదాపు అరగంట సేపు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి అధికారుల తీరుకు వ్యతిరేక నినాదాలు చేశారు. కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గ్రామస్తుల ఆందోళనకు ఎంపీపీ సద్ది ప్రవీణ భాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎండి హుస్సేన్, ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ దోమడుగు శంకర్ మద్దతు పలికారు. ధర్నా విషయం తెలుసుకున్న తహసీల్దార్ గంగా భవాని, జిన్నారం సీఐ సుధీర్ కుమార్, గుమ్మడిదల ఎస్ఐ లక్ష్మారెడ్డిలు ఆందోళన చేస్తున్న గ్రామస్థులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఉన్నతాధికారులతో సూచన మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఈవీఎంల మొదటి విడత తనిఖీని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ గురువారం పరిశీలించారు. -హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

బీఆర్ఎస్‌కు 'బాబా' గుడ్‌బై

● కాంగ్రెస్‌లోకి ఫసియుద్దీన్


దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఫసియుద్దీన్

బోరబండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. నగర గులాబీ పార్టీలో సుదీర్ఘకాలంగా క్రియా శీల కార్యకర్తగా, నేతగా కొనసాగుతున్న మాజీ డిప్యూటీ మేయర్, ప్రస్తుత బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీలో చేరారు. కాగా, బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, మీడియా స్పోక్స్ పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పార్టీ అధినేత కేసీఆర్‌కు పంపించిన లేఖలో వెల్లడించారు. 2022లో విద్యార్థి దశలో ఉన్న సమయంలో తెలంగాణ ఏర్పాటు అంశం తెరమీదకు వచ్చినప్పుడు ఆకర్షితుడైన ఫసియుద్దీన్ అందులో చేరారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్‌గా కూడా పదవీ బాధ్యతలు చేపట్టారు. 22 ఏళ్లగా పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నప్పటికీ.. అగ్రనాయకులు తనను పట్టించుకోవడం లేదని ఆవేదనకు గురవుతున్న బాబా ఫసియుద్దీన్ గురువారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు.


స్వర్ణోత్సవాల్లో భాగంగా యువకుల రిహార్సల్స్

11 నుంచి రామకృష్ణ మఠం స్వర్ణోత్సవాలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామకృష్ణ మఠం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మూడు రోజుల పాటు స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నామని మఠం అధ్యక్షుడు బోధమయానంద తెలిపారు. బేలూరు మఠానికి అనుబంధంగా 1973లో ఇందిరాపార్క్ సమీపంలో రామకృష్ణ మఠం ఏర్పాటు చేశారని, 2023 డిసెంబర్ నాటికి 50 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ సందర్భంగా ఈనెల 11 నుంచి 13 వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, చండీ హోమం, భజనలు, సంగీత విభావరి, బహిరంగ సభలు నిర్వహిస్తున్నామని, భక్తులు, విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొనాలని స్వామి బోధమయానంద పిలుపునిచ్చారు.

పుట్టుకతో వచ్చే వినికిడి లోపానికి చెక్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో వచ్చే లోతైన వినికిడి లోపంతో బాధపడుతున్న చిన్నారులకు కాక్లియార్ ఇంప్లాంట్ ద్వారా చెక్ పెట్టి, అన్ని మాటలు, శబ్దాలు వినే విధంగా వారి జీవితాన్ని తీర్చిదిద్దవచ్చునని మెడికవర్ ఆస్పత్రి ఓటోలారింగాలజీ విభాగం వైద్యురాలు డాక్టర్ సంపూర్ణ ఘోష్ తెలిపారు. వినికిడి లోపంతో బాధపడే పది మంది పిల్లలకు కాక్లియార్ ఇంప్లాంట్‌లను విజయవంతంగా నిర్వహించినట్లు వివరించారు. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాధితుల అవసరాన్ని గుర్తించి, ఆర్థిక ఇబ్బందులతో సంబంధం లేకుండా శస్త్రచికిత్సలను అందించడానికి ఆస్పత్రి ముందుకు వచ్చిందన్నారు. కాక్లియార్ ఇంప్లాంట్ వినలేని వ్యక్తికి వినికిడిని అందిస్తుందన్నారు.

జాతి హక్కుల సాధనకు విద్యార్థులు


సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జాతి హక్కుల సాధనలో విద్యార్థులు పోరాడాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మాదిగ విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనలో విద్యార్థుల పాత్ర మరువలేనిదని, విద్యార్థి యువకుల పోరాటం వల్ల వర్గీకరణ లక్ష్య సాధనకు చేరువవుతుందన్నారు. గౌరవ సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిలకమర్రి గణేష్, కొల్లూరి వెంకటేష్, చందు, తిరుమలేష్, శ్రీకాంత్, జిల్లా వెంకట్, సురేష్, రమేష్, ప్రవీణ్, శ్యామ్‌రావు, రఘు తదితరులు పాల్గొన్నారు.

మింగేస్తున్నారు..


సగం చెరువు స్థలాన్ని మట్టితో నింపిన దృశ్యం

● మామిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్‌ను మట్టితో పూడ్చివేశారు
● మూడు లారీల సీజ్
● పరిశ్రమ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ మండలం గగన్‌పహడ్‌లోని మామిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఓ పరిశ్రమ నిర్వాహకుడు రాత్రివేళ మట్టితో పూడ్చేస్తున్నాడు. ఇప్పటికే ఎఫ్‌టీఎల్ సగభాగం పూర్తిగా మట్టితో కప్పేశాడు. స్థానికుల ఫిర్యాదుతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు లారీలను సీజ్ చేసి పరిశ్రమ నిర్వాహకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాజేంద్రనగర్ మండలం గగన్‌పహడ్‌లో 16 ఎకరాలలో మామిడికుంట చెరువు విస్తరించి ఉంది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్‌కు ఆనుకుని ఓ పరిశ్రమ ఉంది. అయితే, గతంలో చెరువు కట్టను మెల్లమెల్లగా తొలగించిన ఆ పరిశ్రమ నిర్వాహకులు.. వారి మనుషులతో గత కొద్దిరోజులుగా రాత్రివేళల్లో మూడు భారీ లారీలతో మొరం మట్టిని తెచ్చి ఎఫ్‌టీఎల్‌ను పూడ్చివేస్తున్నారు. ఇది గమనించిన స్థానికులు గురువారం రాజేంద్రనగర్ మండల రెవెన్యూ అధికారులకు, నీటి పారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో మల్లయ్య, తహసీల్దార్ వేణుగోపాల్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినయలత, జూనియర్ అసిస్టెంట్ పృథ్వీ, కావలికారులు జంగయ్య, యాదగిరిలతో మామిడికుంటను సందర్శించారు. చెరువులో మట్టిపోస్తున్న మూడు లారీలను సీజ్ చేసి శంషాబాద్ ఆర్‌జీఐ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చెరువు స్థలంలో మట్టి పోస్తున్న పరిశ్రమ నిర్వాహకులు నరేందర్ గోయల్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు రెవెన్యూ అధికారులతో పాటు ఇరిగేషన్ అధికారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.


పరిశ్రమ యజమాని నరేందర్ గోయల్‌తో మాట్లాడుతున్న ఆర్ఐ వినయలత, అధికారులు

నరేందర్ గోయల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

● కాంగ్రెస్ నాయకులు

మామిడికుంట సర్వే నెంబర్ 247లో 19.15 గుంటలలో చెరువు విస్తరించి ఉంటుందని, అందులో నరేందర్ గోయల్ మట్టిపోసి నింపుతున్నాడని, అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మైలార్‌దేవుపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ధనుంజయ్, నాయకులు శీలం తిరుపతిరెడ్డి, వి.శ్రీశైలం, లక్ష్మణ్, శివ, శ్రీనివాస్, తదితరులు డిమాండ్ చేశారు. ఇదే విషయంపై రాజేంద్రనగర్ తహసీల్దార్ వేణుగోపాల్, శంషాబాద్ ఆర్‌జీఐ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు చేశాం

చెరువు స్థలంలో మట్టిపోస్తున్న మూడు లారీలను సీజ్ చేశాం. వాటిని శంషాబాద్ ఆర్‌జీఐ పోలీస్ స్టేషన్‌కు తరలించాం. మట్టి పోయడానికి కారకులైన నరేందర్ గోయల్ పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇరిగేషన్ శాఖ ఏఈ విశ్వం ద్వారా కూడా పోలీసులకు ఫిర్యాదు ఇప్పించాం. - తహసీల్దార్ వేణుగోపాల్

'చేతి'కి చిక్కిన మహేందర్‌రెడ్డి

● ఉమ్మడి రంగారెడ్డిలో బీఆర్ఎస్‌కు భారీ షాక్
● చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సునీతారెడ్డి!


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితోపాటు ఆయన భార్య వికారాబాద్ జడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డి గురువారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో మంచిపట్టున్న మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరడం బీఆర్ఎస్‌కు పెద్ద దెబ్బేనని చెప్పాలి. వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు బీఆర్ఎస్ తాండూరు టిక్కెట్ నిరాకరించడంతో ఆయన కాంగ్రెస్ వైపు చూశారు. పలు దఫాలు ఆయన పార్టీ ముఖ్యనేతలతో చర్చలు కూడా జరిపారు. అయితే ఇది గమనించిన బీఆర్ఎస్ నాయకత్వం ఎన్నికలకు ముందు ఆయనకు మంత్రి పదవి ఇచ్చి బుజ్జగించింది. దీంతో ఆయన పార్టీ మారే యోచన విరమించుకున్నారు. మహేందర్‌రెడ్డిని ఎలాగైనా కాంగ్రెస్‌కు రప్పించాలని రేవంత్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. ఎన్నికల తేదీకి వారం రోజుల ముందుకూడా ఆయనకు భారీ ఆఫర్ ఇచ్చారు. కానీ, అప్పటి పరిస్థితుల్లో ఆయన బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని నిర్ణయించారు. ఎన్నికల తర్వాత కూడా కాంగ్రెస్ నేతలు పలుమార్లు జరిపిన చర్చలు సఫలం కావడంతో చివరకు మహేందర్‌రెడ్డి ఆయన భార్య సునీతారెడ్డి కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించారు. ఇదిలా ఉంటే మహేందర్‌రెడ్డి కుటుంబం చేరిక వెనుక బలమైన కారణమే ఉంది. మహేందర్‌రెడ్డి భార్య వికారాబాద్ జడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డికి చేవెళ్ల పార్లమెంట్ సీటు ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ మేరకు వారి కుటుంబానికి స్పష్టమైన హామీ కూడా లభించడంతో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్, బీజేపీల నుంచి బలమైన అభ్యర్థులు బరిలోకి దిగుతుండడంతో అధికార కాంగ్రెస్ కూడా ఆర్థిక, అంగబలం ఉన్న వారిని పోటీలో దింపేయత్నం చేస్తోంది. మహేందర్‌రెడ్డి కుటుంబంతో పాటు ఆయన అనుచరులు ఈనెల 11వ తేదీలోగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు.

మల్కాజిగిరిపై తర్జనభర్జనలు

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి కూడా కాంగ్రెస్‌లో పోటీ ఉన్నప్పటికీ ఆర్థికంగా బలంగా ఉన్న వారి కోసం కాంగ్రెస్ ఎదురుచూస్తున్నట్లు తెలిసింది. మల్కాజిగిరి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన మైనంపల్లి హన్మంతరావు కూడా పోటీకి సై అంటున్నట్లు సమాచారం. అలాగే సీనియర్ నేత కుసుమకుమార్‌తోపాటు హరివర్ధన్‌రెడ్డి తదితరులు ఆసక్తిగా ఉన్నారు. ప్రధానంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పేరు కూడా కొద్ది రోజులుగా వినిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇప్పటి వరకు ఎవరికీ హామీ ఇవ్వలేదు.

ఎమ్మెల్యేలపై గురి!

పార్లమెంట్ ఎన్నికలకు ముందు వలసలకు గేట్లు తెరవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యంగా నగర శివార్లలోని ఎమ్మెల్యేలను పూర్తిగా తమవైపు తిప్పుకునేందుకు ఇప్పటికే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఇటీవల రాజేంద్రనగర్ ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. ఇక మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి త్వరలో తాను కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తానని, కీసర ఆలయానికి రావాలని ఆహ్వానిస్తానని చెప్పారు. తాజాగా మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు సీఎంను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. నగర శివార్లలోని మరికొందరు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈనెల 11వ తేదీలోగా బీఆర్ఎస్‌లో భారీ కుదుపులు ఉంటాయనే ప్రచారం సాగుతోంది.

జాతీయ స్థాయిలో కాజీపేట, గుత్తి డీజిల్ లోకో షెడ్‌లకు గుర్తింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలోని రెండు డీజిల్ లోకో షెడ్‌లు అత్యుత్తమ పనితీరుతో జాతీయస్థాయిలో రైల్వేల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలకు ఎంపికయ్యాయి. కాజీపేట డీజిల్ లోకో షెడ్ ఎలక్ట్రిక్ లోకోల నిర్వహణ పరంగా మొదటి స్థానంలో నిలువగా, గుత్తి డీజిల్ లోకోషెడ్ ఎలక్ట్రిక్ లోకోల నిర్వహణ పరంగా 2వ స్థానంలో నిలిచినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ రెండు డీజిల్ లోకో షెడ్‌లలో ఎలక్ట్రిక్ లోకోల నిర్వహణలో ఉత్తమ పనితీరుకుగాను జాతీయ స్థాయి గుర్తింపుతో నగదు బహుమతుల కోసం ఎంపికైనట్లు అధికారులు పేర్కొన్నారు. కాజీపేట, గుత్తి డీజిల్ లోకోషెడ్స్ అధికారులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు.

సమ్మెకు ఆరు ఆర్టీసీ కార్మిక సంఘాల మద్దతు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు ఆర్టీసీలోని ఆరు కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటీయూసీ), స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ), స్టాఫ్ అండ్ యూనియన్(ఐఎన్‌టీయూసీ), బహుజన వర్కర్స్ యూనియన్ (బీడబ్ల్యూయూ), బహుజన కార్మిక యూనియన్(బీకెయూ), కార్మిక పరిషత్ (టీఎన్‌టీయూసీ)ల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బస్‌భవన్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ మాట్లాడారు.

12నుంచి అంతర్జాతీయ స్థాయి ఆర్ట్‌ఫెస్ట్

● స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో మార్చి7 వరకు చిత్రప్రదర్శన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చిత్రకళా ఉత్సవాలకు నగరం వేదిక కానుంది. ముంబైకి చెందిన ఇండియన్ ఫైన్ ఆర్ట్ ఈనెల 12 నుంచి 17వరకు మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ వేదికగా ఆర్ట్‌ఫెస్ట్-2024ను నిర్వహిస్తున్నారు. అందులో చిత్రకళలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అంజలీ ఏలా మీనన్, శోభాబ్రూట, ప్రభాకర్ కొల్టె, పళనీఅప్పన్, వి. రమేష్, వినోద్ శర్మ తదితర 13మంది ప్రముఖ చిత్రకారులు పాల్గొననున్నారని ఆర్ట్ ఫెస్ట్ నిర్వాహకులు లక్ష్మణ్ ఏలే తెలిపారు. ప్రముఖుల చిత్రలేఖనాన్ని ప్రత్యక్షంగా చూడటంతోపాటు ఆర్ట్‌కు సంబంధించిన వివిధ అంశాలపై వారితో నేరుగా సంభాషించే అవకాశాన్ని ఔత్సాహికులకు ఆర్ట్ ఫెస్ట్ కల్పిస్తున్నదని వివరించారు. సుమారు200మంది చిత్రకారుల సృజన నుంచి జాలువారిన చిత్రరాజాలను ఈ నెల17 నుంచి మార్చి7 వరకు స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఆర్ట్ క్యాంప్‌తో పాటు ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు ప్రవేశం ఉచితం.

రెండు క్లినిక్‌లపై దాడులు

అక్రమ మందుల నిల్వల స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా క్లినిక్‌లను ఏర్పాటు చేసి, విచక్షణారహితంగా మందులను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న రెండు క్లినిక్‌లపై ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు దాడులు చేశారు. ఈ సందర్భంగా విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. ఐడీఏ జీడిమెట్లలోని సుభాష్‌నగర్‌లో అనుమతి లేకుండా మౌర్య క్లినిక్‌ను ఏర్పాటు చేసి, అక్రమంగా మందులు నిల్వ ఉంచినట్లు ఔషధ నియంత్రణ సంస్థ అధికారులకు సమాచారం అందింది. దీంతో దాడి చేసి యాంటిబయోటిక్, యాంటి ఫంగల్ డ్రగ్స్, యాంటి అల్సర్ డ్రగ్, యాంటి డయాబెటిక్, అనాల్జెసిక్స్ తదితర రూ.40వేల విలువైన ముందులను స్వాధీనం చేసుకున్నట్లు ఔషధ నియంత్రణ సంస్థ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో డిప్యూటీ డైరెక్టర్ విజయ్ గోపాల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సరిత, తిరుపతి పాల్గొన్నారు.

మరో చోట..

వట్టేపల్లి ఫాతిమానగర్‌లో ఓ క్లినిక్‌పై అధికారులు దాడులు చేసి పదిహేను రకాల మందులను స్వాధీనం చేసకున్నారు. ఆదిల్ మహ్మద్ అనే వ్యక్తి ఎలాంటి వైద్య అర్హతలు లేకపోయినప్పటికీ గ్రామీణ వైద్య సేవలు అందిస్తూ అక్రమంగా మందులను నిల్వ ఉంచాడు. దీంతో దాడులు చేసి మందులను స్వాధీనం చేసుకున్నారని కమలాసన్‌రెడ్డి తెలిపారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులను నిల్వ ఉంచితే అయిదేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ డైరెక్టర్ రాజామౌళి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మి, సంతోష్, వివేకనందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో డేటా మిస్సింగ్

● గత రిజిస్ట్రార్ హయాంలో జరిగిన నియామకాలపై సర్కారు ఆరా..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విశ్వవిద్యాలయం జేఎన్‌టీయూలో డేటా మిస్సింగ్ వ్యవహారం కలకలం రేపుతోంది. ఉద్యోగులకు సంబంధించిన దరఖాస్తులు, అర్హతల ధ్రువపత్రాలు కనిపించకుండా పోయాయనే వదంతులు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రిటైర్డు ఆచార్యుల, అధికారుల నియామకాలు, ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకుండా వర్సిటీ యాజమాన్యం చేపట్టిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆయా ఆరోపణలపై వివరణ కోరుతూ సమగ్రమైన డేటా పంపాలని జేఎన్‌టీయూ యాజమాన్యానికి విద్యాశాఖ ముఖ్య అధికారి లేఖరాసినట్లు సమాచారం. దీంతో మాజీ రిజిస్ట్రార్ హయాంలో సరైన ప్రొసీజర్స్ పాటించకుండా నియమాకాలు జరిగినందున, ప్రస్తుతం కీలకస్థానాల్లో ఉన్న వర్సిటీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కొందరు వ్యక్తులకు దరఖాస్తుగానీ, విద్యార్హతల పత్రాలుగానీ లేకుండానే ఉద్యోగమిచ్చారని, కేవలం హాజరు పట్టీలోని వివరాలతో వారికి నెలనెలా వేతనం కూడా మంజూరు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావును వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా తన దృష్టికి రాలేదని తెలిపారు.

నెలకు రూ. 105 కోట్లు!

(5వ పేజీ తరువాయి)

సంవత్సరంలో ఇతర రుణాలకూ అసలు చెల్లింపు మొదలుకానుంది. రూపీ టర్మ్ లోన్‌కు సంబంధించి మూడు నెలలకో వాయిదా చెల్లించాల్సి ఉంటుంది.

ఏటా రూ.4 వేలకుపైగా ఖర్చు

ఎస్ఆర్‌డీపీ, కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్ (సీఆర్ఎంపీ), ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టుల కోసం రూ.6,390 కోట్లు, జేఎన్ఎన్‌యూఆర్ఎం అసంపూర్తి పనుల కోసం హడ్కో నుంచి రూ.140 కోట్లతో కలిపి మొత్తం రూ.6,530 కోట్లు జీహెచ్ఎంసీ అప్పు తీసుకుంది. ఇందులో రూ.6,314 కోట్ల రుణం వినియోగించుకున్నారు. మారటోరియం పీరియడ్ నేపథ్యంలో ఇన్నాళ్లు అప్పులకు వడ్డీ మాత్రమే చెల్లించారు. ఏప్రిల్ నుంచి అసలు కూడా చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే ప్రతి నెలా వేతనాలు, పెన్షన్ల కోసం నెలకు రూ.130 కోట్లు, చెత్త తరలింపు, నిర్వహణకు సంబంధించి టిప్పింగ్ ఫీ కింద సుమారు రూ.40 కోట్లు, వీధి దీపాల విద్యుత్ బిల్లులకు రూ.7 కోట్లు, రోడ్ల నిర్మాణం, నిర్వహణ, ఇతరత్రా పనులకు మరో రూ.100 కోట్లు ఖర్చవుతోంది. ఈ నేపథ్యంలో రుణాల వడ్డీతో కలిపి నెలకు దాదాపు రూ.350 కోట్లు అవసరం. సంస్థ ఆదాయం ఏడాదికి రూ.2,800-3,000 కోట్లు కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.400-500 కోట్ల గ్రాంట్లు వస్తున్నాయి. ఈ లెక్కన సంస్థ రమారమిగా ఏటా రూ.800-1200 కోట్ల లోటు బడ్జెట్‌లో ఉంటుందని ఓ అధికారి చెప్పారు. దీనిని అధిగమించేందుకు ఆదాయ వనరులు మెరుగుపర్చుకోవాలని భావిస్తున్నారు.

అప్పులు, చెల్లింపు వివరాలు (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	రుణం	చెల్లిస్తోన్న మొత్తం (2023-24)	చెల్లించాల్సింది 2024-25లో
జేఎన్ఎన్‌యుఆర్ఎం	140	18.21	16.71
ఎస్ఆర్‌డీపీ (బాండ్స్)	495	95.55	95.55
ఎస్ఆర్‌డీపీ (రూపీటర్మ్-1)	2,500	276.24	428.75
ఎస్ఆర్‌డీపీ (టర్మ్-2)	1,460	213.61	335.59
ఎస్ఆర్‌డీపీ (టర్మ్-3)	680	99.35	155.30
ఎస్ఆర్‌డీపీ (టర్మ్-4)	505	54.61	89.02
ఎస్ఆర్‌డీపీ (టర్మ్-5)	750	66.43	132.66
మొత్తం	6.530	824.09	1253.67

మార్చి వరకు ఆదాయం, వ్యయం(అంచనా)..

ఆదాయం ఆదాయ వనరు	రూ.కోట్లలో	కేటగిరి	ఖర్చు రూ.కోట్లలో
ఆస్తిపన్ను	300	వేతనాలు, పెన్షన్లు	240
భవన నిర్మాణ		రుణాలకు	180
అనుమతులు	150	వర్క్ బిల్స్	252
ఇతరత్రా	30	సమగ్ర వ్యర్థాల నిర్వహణ	142
15 ఫైనాన్స్		వీధి దీపాలు, వాటర్‌బోర్డు	170
కమిషన్ గ్రాంట్	205	రెండు పడకల ఇళ్ల వద్ద విద్యుత్	92
మొత్తం	685	భూసేకరణ	200
		మొత్తం	1276

లోటు- రూ.591 కోట్లు (నోట్- భూసేకరణ కోసం రూ.200 కోట్లు విడుదల చేస్తు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది)

నేడు ఐఐఎంఆర్ 66వ వ్యవస్థాపక దినోత్సవం

● హాజరుకానున్న గవర్నర్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈనెల 9న జరుపుకోనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి తెలిపారు. 1958లో ప్రాజెక్టు ఆఫ్ ఇంటెన్సివ్ రీసెర్చ్ ఆన్ కాటన్, ఆయిల్‌సీడ్స్ అండ్ మిల్లెట్స్(పీర్కమ్)గా ప్రారంభమైన ఈ సంస్థ, 1966లో రీజినల్ సెంటర్ ఆఫ్ ద ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌గా, 1970లో ఆల్ ఇండియా కో ఆర్డినేటెడ్ సోర్గం ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుగా, 1987లో నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ సోర్గమ్‌గా మార్పు చెందిందన్నారు. 2015లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) గా పేరు మార్చుకుని దేశంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత పై విస్తృతంగా తన సేవలను అందిస్తున్నది. జీ 20 దేశాల ప్రతినిధులు కూడా ఐఐఎంఆర్ సంస్థకు వచ్చి ఇక్కడ చిరుధాన్యాలపై జరుగుతున్న పరిశోధనలు, ఆహార పదార్థాలపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు.

బాల్కసుమన్‌పై కఠినచర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌పై డీజీపీ కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల ఫోరం అధ్యక్షుడు కె.బాలక్రిష్ణ డిమాండ్ చేశారు. బాల్కసుమన్ తన స్వప్రయోజనాలకు మినహా, దళితులకు సామాజిక న్యాయం జరిగేందుకు ఏనాడు నోరు విప్పలేదని పేర్కొన్నారు.

నేటినుంచి మేడారానికి ఆర్టీసీ బస్సులు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మేడారం మహాజాతరను పురస్కరించుకుని ఈనెల 9నుంచి రోజూ మూడు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు రంగారెడ్డి రీజినల్ మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ మూడు సూపర్ లగ్జరీ బస్సులు ఎంజీబీఎస్ నుంచి ఉదయం 6గంటలకు, 6.30 గంటలకు, జేబీఎస్ నుంచి ఉదయం 7గంటలకు బయల్దేరుతాయని ఆయన వివరించారు. ఉప్పల్, హన్మకొండ, వరంగల్ మీదుగా మేడారం చేరుకుంటాయని, తిరిగి మేడారం నుంచి మధ్యాహ్నం 2గంటలకు, 2.30 గంటలకు, 3 గంటలకు బయల్దేరుతాయని ఆర్ఎం తెలిపారు. పెద్దలకు రూ.750లు, పిల్లలకు రూ.450లు చార్జీలని, ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

రేపు డిఫెన్స్ పెన్షనర్స్ జనరల్ బాడీ సమావేశం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ అకౌంట్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఈనెల 10న వార్షిక జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రెసిడెంట్ వీఎస్ఎల్ నరసింహం, జనరల్ సెక్రటరీ పి.శ్రీనివాస్ తెలిపారు. ఎంసీఈఎంఈ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీడీఏ డిఫెన్స్ అకౌంట్స్ కంట్రోలర్ శ్రీనివాస్ రాజ్ బేతం ఐడీఎస్ హాజరై సందేహాలను నివృత్తి చేస్తారని తెలిపారు

సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బంజారా, లంబాడీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఈనెల 15వ తేదీని సెలవు దినంగా ప్రకటించాలని నంగారా భేరి- లంబాడి హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. 12న సాయంత్రం 6గంటలలోపు జీవో విడుదల చేయాలని, లేనిపక్షంలో 13న అసెంబ్లీని ముట్టడి, 14న సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ఎదుట భోగ్ బండారం కార్యక్రమాన్ని చేపడుతామని సమితి నాయకులు హెచ్చరించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి జాతీయ అధ్యక్షుడు పి.శ్రీనివాస్ చౌహన్, రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ గణేష్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బంజారా, తదితరులు మాట్లాడారు. మార్చి 1 వరకు రాష్ట్ర వ్యాప్తంగా లంబాడీ తండాలలో సేవాలాల్ జయంతిని, భోగ్ బండారం నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం సమితి జాతీయ,రాష్ట్ర కమిటీలను ప్రకటించారు.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

● 14 మందికి రిమాండ్

మదీన, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై బహదూర్‌పురా పోలీసులు దాడిచేసి నిర్వాహకునితోపాటు 14మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం బహదూర్‌పురా చౌరస్తాలోని ఫిజా హోటల్ పైఅంతస్తులో హుక్కా కేంద్రం నిర్వహిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. బుధవారం రాత్రి బహదూర్‌పురా పోలీసులు ఆ సెంటర్‌పై దాడి చేసి నిర్వాహకుడు సొహైల్ హుసేన్‌తోపాటు హుక్కా పీల్చుతున్న 13మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 21 హుక్కా సామగ్రి, ఒక కిలో హుక్కా ఫ్లేవర్, 16 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 14మందిపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

స్వానుభవం

మన జీవితంలోని ప్రతి సంఘటనా ఈశ్వర ప్రేరణతోనే జరుగుతుంది. నా జీవితంలో కూడా 'ఇది దైవ ప్రమేయం, దైవ సంకల్పం' అని నేను భావించే సంఘటనలు ఎన్నో మలుపులకు దోహదం చేశాయి. అలాగే భగవదనుగ్రహం, భగవంతుని కృప లభించిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. అయితే అలాంటి అనుభవాలన్నిటినీ బహిర్గతం చేయకూడదన్నది శాస్త్ర నిర్దేశం. దాన్ని గౌరవించాలి. చెప్పదగినవి మాత్రమే చెప్పవచ్చు. ఒకసారి రైలు ప్రయాణం చేస్తున్నాను. ఆ రైలు ప్రమాదానికి గురయింది. తక్షణమే, అప్రయత్నంగా మృత్యుంజయ స్వామి శ్లోకం ఒకటి మనసులో మెదిలింది. ఆ శ్లోకాన్ని ధ్యానం చేస్తూ కూర్చున్నాను. అప్పుడు ఎలాంటి హానీ కలుగకుండా బయటపడగలిగాను. నేను మాత్రమే కాదు... రైలులో ఉన్న అందరూ క్షేమంగా ఉన్నారు. అలాగే భగవత్ స్వరూపులైన మహాత్ముల దర్శనం, వారి ద్వారా లభించిన ఆధ్యాత్మిక అనుభవాలు, క్షేత్రయాత్రలు చేస్తున్నప్పుడు... ఆ క్షేత్రాల్లోని దేవతా శక్తి అనుభవంలోకి రావడం, అమ్మవారి ధ్యాన సాధన చేస్తున్నప్పుడు ఆ తల్లి అనుగ్రహాన్ని స్పష్టంగా అనుభవించడం... ఇలాంటి ఉదంతాలు కూడా అనేకం. ఆధ్యాత్మికంగా నా స్వానుభవాల్లో ప్రధానమైనది నేను ప్రవచనకారుణ్ణి కావడమే. నా ఉపాధి కోసం నేను



సామవేదం షణ్ముఖశర్మ

అధ్యయనం, అనుష్ఠానంతోనే...
దివ్యానుభవం సాధ్యం

పాత్రికేయ వృత్తిని ఎంచుకున్నాను. సాహిత్యం మీద ఆసక్తి ఉండడంతో... సృజనాత్మకంగా కొన్ని గీతాలను రాశాను. 'నేనూ రాయగలను' అనే నమ్మకం ఏర్పడింది. నా రచనలు లలిత గీతాలుగా 'ఆకాశవాణి'లో ప్రసారం అయ్యాయి. అప్పుడు సినిమాల్లో పాటలు రాయాలనే కోరిక కలిగింది. సినిమా రంగంలో అడుగుపెట్టాను. గేయ రచయితగా గుర్తింపు పొందాను. కాబట్టి వృత్తిగా నేను సాహిత్యాన్నే ఎంచుకున్నాను. కానీ నా అంతర్గత ప్రవృత్తిలో ఆధ్యాత్మిక లక్షణాలు, ఆధ్యాత్మిక భావాలు చిన్న వయసునుంచే ఉన్నాయి. ఆధునిక సాహిత్యం చదువుకున్నా, ప్రాచీన సాహిత్యాన్ని కూడా బాగా అధ్యయనం చేశాను. వాటిలోని కవితా రీతులు, సాహిత్య భావాలతో పాటు ధార్మికత, ఆధ్యాత్మికత నన్ను అమితంగా ప్రభావితం చేశాయి. మన పూర్వ ఋషులు అందించిన ప్రాచీన సంస్కృత గ్రంథాలు, తెలుగులోని సంప్రదాయ సాహిత్యం... ఇవన్నీ నన్ను ప్రభావితం చేశాయి. వృత్తిపరంగా ఏది చేస్తున్నా నా అలవాట్లు, దైనందిన చర్య... ఇవన్నీ ఆధ్యాత్మిక అభ్యాసంతోనే ఉండేవి. అయితే ఆ ఆధ్యాత్మిక భావజాలమే నా సంపూర్ణ జీవితం అవుతుందని నేను అప్పట్లో ఊహించలేదు. సాహితీపరమైన ఏదో ఒక వృత్తి చేసుకుంటూ... ఆధ్యాత్మిక సంస్కారాన్ని వ్యక్తిగతంగా మాత్రమే ఉంచుకోవాలని అనుకున్నాను. కానీ ఆ భగవంతుడి సంకల్పం వేరేలా ఉంది. నేను ఆధ్యాత్మికమైన విషయాలు మాట్లాడుతున్నప్పుడు అందరూ విని ఆనందించేవారు. మరికొన్ని విషయాలను చెప్పాలని కోరేవారు. ఆ తరువాత ప్రవచనాలు ఒక మాధ్యమంగా ప్రాచుర్యం పొందడంతో... ఆధ్యాత్మిక ప్రవచనకర్తగా కొత్త దారిలో అడుగు పెట్టాను. అదే విధంగా మన సనాతన ధర్మంపై సమాజానికి మరింత అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో రాసిన రచనలు కూడా ప్రజలపై ప్రభావం చూపించాయి. దీనితో ప్రవచనం, రచన అనే రెండూ ఆధ్యాత్మికతతోనే ముడివేసుకుపోయాయి. ఒకసారి కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్రస్వామిని దర్శించుకున్నాను. అప్పుడు ఆయన మౌన దీక్షలో ఉన్నారు. కానీ ఆయన సమక్షంలో మాటల్లో చెప్పలేని స్పందన కలిగింది. మహాస్వామి శిష్యులైన మహాదేవానందనాథులు నాకు గురువుగా లభించారు. ఆయన నాకు మంత్రోపదేశం చేశారు. ఆ తరువాత నా ఆధ్యాత్మిక అనుష్ఠానం ఇంకా విస్తారంగా పెరిగింది. ఒక్క విషయం కచ్చితంగా చెప్పవచ్చు. అనుష్ఠానం ఉన్నవారికి అనుభవం ఉంటుంది. అనుష్ఠానం లేకుండా, కేవలం కబుర్లతో కాలక్షేపం చేస్తూ 'నాకు అనుభవాలు లేవు' అనడం అసంబద్ధం. 'అనుష్ఠానం' అంటే గురువులు ఇచ్చిన మంత్రాలను సాధన చేయడం. 'అధ్యయనం' అంటే ఆర్ష గ్రంథాలను పఠించి, వాటి సారాంశాన్ని, వాటిలోని మర్మాలను అవగాహన చేసుకోవడం. అనుష్ఠానం, అధ్యయనం... ఈ రెండూ చేస్తూ ఉంటే... మన జీవితాల్లో తప్పకుండా దివ్యానుభూతులు ఉంటాయి. దైవసంకల్పం, దైవప్రమేయం తప్ప మరొకటి లేదని తెలుస్తుంది. 'దైవాధీనం జగత్ సర్వం' అనే సత్యం అనుభవంలోకి వస్తుంది.

> సనాతన ధర్మంలో ఆధ్యాత్మికత వివిధ మార్గాలతో ఉంటుంది. ఒక మార్గాన్ని అనుసరించేవారు ఇతర మార్గాలను తక్కువ చేయడం ఎప్పుడూ మంచిది కాదు

భక్తి వ్యక్తిగతమే... కానీ సామాజికం కూడా

మనిషి అంటే శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, ప్రాణం... ఇవి మాత్రమే అనుకుంటే అది భౌతికత. వీటన్నిటికీ చైతన్యాన్ని ఇస్తూ... వీటన్నిటికీ అతీతమైనది ఒకటుంది. దాన్ని 'ఆత్మ' అంటారు. దాని అస్తిత్వాన్ని అంగీకరించడాన్నే 'ఆధ్యాత్మికత' అంటారు. ఆత్మను ఆవిష్కరించుకోవడానికి... అంటే ఆత్మతాలూకు స్వరూపాన్ని తెలుసుకోవడానికి, ఆ అనుభూతిని పొందడానికి చేసే సాధన... ఆధ్యాత్మిక సాధన అవుతుంది. ఇది మూడు రూపాల్లో ఉంటుంది. మొదటిది ధర్మం, రెండోది భక్తి, మూడోది జ్ఞానం. ఈ మూడు విడివిడిగా కాదు... కలిసే ఉండాలి. వ్యక్తి ఆచరణ ధర్మబద్ధమై ఉండాలి. మనస్సు ఆత్మస్వరూపుడైన ఈశ్వరుడిపై ఉండాలి. అది భక్తి అవుతుంది. ఆ స్వరూపాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకొని, అది తనలో ఉన్న 'నేను' అనే తత్త్వానికి వేరు కాదు అని తెలుసుకోవడమే జ్ఞానం. ధర్మం, భక్తి, జ్ఞానం... ఈ మూడిటి కలయికతో కూడినదే ఆధ్యాత్మిక సాధన. దాన్నే 'ఆధ్యాత్మికత' అంటారు. భక్తి వ్యక్తిగతమైనదే... అందులో సందేహం లేదు. భక్తుని అంతరంగం పరమాత్మతో లేదా భగవంతుడితో అనుబంధం ఏర్పరచుకుంటుంది కనుక... భక్తి, ముక్తి అనేవి ఆ వ్యక్తికీ, ఆ పరమాత్మకు మాత్రమే సంబంధించిన అంశాలు. కానీ భక్తులవల్ల, వారి జీవన విధానం వల్ల సమాజం ప్రభావితం అవుతుంది. కాబట్టి అది కొంత మేరకు సామాజిక అంశం కూడా. వ్యక్తులు కలిస్తేనే సమాజం అవుతుంది. కాబట్టి భక్తిని వ్యక్తిగతతత్త్వంగా కలిగినవారందరూ కలిస్తే సమాజం అవుతుంది. అందుకే 'భక్త సమాజం' అని అంటూ ఉంటాం. అలాంటి సమాజం మనం నివసిస్తున్న దేశ కాలాల మీద ప్రభావం చూపిస్తుంది. అందువల్ల భక్తి వ్యక్తిగతమైనప్పటికీ దానికి సామాజికమైన స్వరూపం కూడా ఉంటుంది.

మార్గాలు, రూపాలు... అన్నీ ఒక్కటే

ఎప్పుడైనా సమాజంలో భౌతికం, ఆధ్యాత్మికం... ఈ రెండిటి గురించీ ఆలోచించేవారు ఉంటారు. కానీ ప్రస్తుతం గ్లోబలైజేషన్ పెరగడం, అనేక రకాల సమాచార సాధనాలు అందుబాటులోకి రావడం, అవి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా లభ్యమవడంతో చాలామందిలో ఆధ్యాత్మికమైన ప్రవృత్తి ఏర్పడుతోంది. ఎక్కువమందిలో ఆధ్యాత్మిక చింతన పెరుగుతోంది. 'కనబడుతున్న ఈ భౌతికమైన జీవితానికి అతీతంగా ఒక పారమార్థికమైన జీవితం ఉంది' అనే ఒక భావన ఏర్పడుతోంది. దానికి అనుగుణంగా పెద్దల రచనలు, మహానుభావుల వ్యక్తిత్వాలు స్ఫూర్తినిస్తున్నాయి. ఉదాహరణకు రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రమణమహర్షి, చంద్రశేఖరేంద్ర సరస్వతి... ఇలాంటి మహాత్ముల చరిత్రలు, వారు చెప్పిన ఉపదేశాలు ఇప్పుడు ఎక్కువ లభ్యమవడంతో... ప్రజల్లో మంచి మార్పులు వస్తున్నాయి. అయితే గుర్తుంచుకోవాల్సిన మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే... సనాతన ధర్మంలో ఆధ్యాత్మికత అనేది ఆ వ్యక్తి తాలూకు సంస్కారాన్ని అనుసరించి వివిధ మార్గాలతో ఉంటుంది. ఒక మార్గాన్ని అనుసరించేవారు ఇతర మార్గాలను తక్కువ చేయడం లేదా "ఆ మార్గం వల్ల లాభం లేదు, నా మార్గమే గొప్పది" అనడం అనే ధోరణి ఎప్పుడూ మంచిది కాదు. ఉదాహరణకు, భక్తిమార్గంలో ఉన్నాం అనుకొనేవారు జ్ఞానాన్ని తృణీకరించడం, జ్ఞానమార్గంలో ఉన్నామనుకొనేవారు భక్తిని తృణీకరించడం, "మేం భక్తిలో, జ్ఞానంలో ఉన్నాం కాబట్టి మాకు ధర్మంతో పని లేదు" అనుకోవడం... ధర్మమే ప్రధానం కానీ ఇవన్నీ కావనడం... ఇలాంటి వాదోపవాదాల వల్ల ఆ మార్గాలన్నిటికీ ఉన్న పరస్పర అనుబంధం తెలియకుండా పోతోంది. పరమాత్మను విష్ణువుగా ఆరాధిస్తే వైష్ణవం, శివుడిగా ఆరాధిస్తే శైవం, శక్తిగా ఆరాధిస్తే శాక్తేయం, గణపతిగా ఆరాధిస్తే గాణపత్యం... ఆరాధించేది ఏ రూపమైనా పరమాత్మ ఒక్కరేననే సమైక్యభావనను విడిచిపెట్టి... దేవుణ్ణి కేవలం తమకు నచ్చిన దేవతా రూపంగా మాత్రమే చూస్తూ, మిగిలిన రూపాలను, మార్గాలను తక్కువగా చూడడం అనే వైఖరి మంచిది కాదు. ఒక సమగ్రమైన ఏకత్వాన్ని తెలుసుకోగలిగే, సమన్వయ ధోరణితో కూడిన ఆధ్యాత్మికతను సనాతన ధర్మం అందించింది. భిన్నమైన ఆరాధనా మార్గాలు అనుసరించినా అవన్నీ చేరేది భగవంతుడి దగ్గరకే. ఏ రూపాన్ని ఆరాధించినా అవన్నీ ఆ పరమాత్మ స్వరూపాలే. ఈ భావనను సమాజంలో విస్తరింపజేయాల్సిన అవసరం ఉంది.


(సామవేదం షణ్ముఖశర్మ సుప్రసిద్ధ ప్రవచనకర్త, సాహితీవేత్త, ఆధ్యాత్మిక గ్రంథ రచయిత)

సంభాషణ: **కృష్ణశర్మ**

వ్యాసపీఠం

13 చక్రాల ఆధ్యాత్మిక ప్రయాణం


ఆరోగ్యంగా.. ఆనందంగా.. ప్రశాంతంగా ఉండటం చాలా మంది జీవితలక్ష్యం. చాలా సందర్భాలలో ఈ మూడు సాధించటానికి శారీరకంగాను.. మానసికంగాను ఆరోగ్యంగా.. ఆనందంగా ఉంటే చాలనుకుంటారు. కానీ ఆధ్యాత్మికతంగా పురోగతి సాధిస్తే తప్ప జీవితలక్ష్యం సాధ్యం కాదంటారు హార్ట్‌ఫుల్‌నెస్ ఆర్గనైజేషన్ (రామచంద్రమిషన్) అధినేత దాజీ. ఈ పురోగతిలో ధ్యానంతో పాటుగా..మన శరీరంలోని నిక్షిప్తమై ఉన్న చక్రాల ఉద్దీపన కూడా చాలా కీలకమైనదంటారాయన. సాధారణంగా భారతీయ సంప్రదాయ యోగ పద్ధతుల ప్రకారం మన శరీరంలో ఏడు చక్రాలు ఉంటాయి. ఒకో చక్రానికి ఒకో విశిష్టత ఉంది. వీటి ఉద్దీపనే ఒక వ్యక్తి జీవిత లక్ష్యం కావాలి. కానీ దాజీ సిద్ధాంతం ప్రకారం మనకు 13 చక్రాలుంటాయి. ఇవే మన జీవనాన్ని నిర్దేశిస్తాయి. మన జీవిత గమనంలో ఈ చక్రాలకు ఉన్న ప్రాముఖ్యతను వివరిస్తూ దాజీ రాసిన గ్రంథమే- "స్పిరిట్యువల్ అనాటమీ". దీనిలో చక్రాల ప్రాముఖ్యతతో పాటుగా.. వాటిలోని శక్తి ప్రసారం కాకుండా అడ్డుకొనే అంశాలేమిటి? వాటిని ఎలా శుద్ధి చేయాలి? ధ్యానం వల్ల మనం ఎలా ప్రగతిని సాధిస్తాం? మొదలైన ప్రశ్నలన్నింటికీ ఈ గ్రంథంలో సమాధానాలు లభిస్తాయి. "2016లో న్యూజెర్సీలో మెడిటేషన్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్న సమయంలో ఈ పుస్తకం రాయాలనే ప్రేరణ కలిగింది. ఒక సాయంత్రం హఠాత్తుగా నాకు స్పిరిట్యువల్ అనాటమీకి సంబంధించిన కొన్ని అంశాలు గోచరించాయి. ఆ రోజు రాత్రే నాకు గోచరించిన అంశాలతో మొదటి చాప్టర్ రాశాను. ఆ తర్వాత కొన్ని రోజుల్లో పుస్తకం అవుట్‌లైన్ పూర్తిచేశాను. ఆ తర్వాత ఆరేళ్ల ఈ అంశాలకు సంబంధించిన అనేక వ్యాసాలు రాశాను. ప్రపంచవ్యాప్తంగా ప్రయోగాత్మక వర్క్‌షాప్‌లను నిర్వహించాను. నా అనుభవాలన్నింటినీ క్రోడీకరించి ఈ పుస్తకాన్ని రాశాను" అంటారు దాజీ. ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణిస్తున్నవారందరూ తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకమిది.



స్పిరిట్యువల్ అనాటమీ
రచయిత : దాజీ (కమలేష్ జి. పాటిల్)
ప్రచురణ: హార్పర్ కాలిన్స్ **ధర**: రూ. 499
అమేజాన్ మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో లభిస్తుంది

దైవమార్గం

ఆర్తులకు ఆశాకిరణం



దేవ పుత్రుడైన ఏసు క్రీస్తుకు మానవుడిగా జన్మనిచ్చే కార్యానికి... ఆ దేవుడే ప్రత్యేకంగా ఎంపిక చేసిన స్త్రీమూర్తి మరియ మాత. ఒకప్పుడు ఫ్రాన్స్ దేశంలోని లూర్దు నగరానికి సమీపంలో ఉన్న పచ్చిక మైదానంలో గొర్రెలను మేపుకొంటున్న బెర్నదెత్తు అనే అమ్మాయికి ఆమె దర్శనమిచ్చింది. ఆనాటి నుంచి 'లూర్దు మాత'గా ఆమె ప్రఖ్యాతి చెందింది. ఆ పేరుతో సైతం మరియ మాత ఆరాధనలను ప్రపంచవ్యాప్తంగా అందుకుంటోంది. విజయవాడ సమీపంలోని గుణదల కొండ మీద గుహలో ప్రతిష్ఠితమైన లూర్దు (మేరీ) మాత దక్షిణ భారతదేశంలో... తమిళనాడులోని వేలాంగణి తరువాత... రెండవ అతి పెద్ద మేరీ మాత క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఈ చర్చి కిందటి ఏడాదే వందేళ్ళు పూర్తి చేసుకుంది. ప్రతి సంవత్సరం ఇక్కడ నిర్వహించే ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల్లోని కథోలిక పీఠాలకు చెందిన బిషప్‌లతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది తరలివస్తారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి తొమ్మిది నుంచి మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు వైభవోపేతంగా సాగుతాయి. మరియ మాతను ప్రధానంగా ఆరాధించేది కథోలికులే అయినప్పటికీ... కథోలికేతర క్రైస్తవులు, క్రైస్తవేతరులు కూడా పెద్ద సంఖ్యలో గుణదల మాతను దర్శించుకుంటారు. మాతృత్వానికి చిహ్నమైన ఆమెకు "మా కోసం ఆ ప్రభువును, ఆ దైవ కుమారుణ్ణి వేడుకోవమ్మా" అంటూ తమ కష్టాలను విన్నవించుకుంటారు. గుణదల మాతకు మొక్కుకుంటే అనుకున్నవి నెరవేరుతాయనీ, వ్యాధుల నుంచి స్వస్థత లభిస్తుందని, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయనీ భక్తులు నమ్ముతారు. ఆమెను మానవాళికి ఆశాకిరణంగా, నిర్మల, నిష్కళంక మాతగా, మోక్షానికి దారి చూపే తల్లిగా, ఆరోగ్యప్రదాయినిగా, దిశానిర్దేశం చేసే 'మేరిస్టెల్లా' (సముద్రపు నక్షత్రం)గా పరిగణిస్తారు.

● డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు
9866755024

అల్లాహ్ చూపిన బాట

సందేశం

"మానవులు తమ సంపాదనను మూడు భాగాలుగా చేసి, ఒక భాగాన్ని దానం చెయ్యాలి. మరో భాగంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవాలి. మూడో భాగాన్ని భవిష్యత్ అవసరాల కోసం వినియోగించాలి. ఆ విధంగా చేసినవారి అవసరాలను ఆ అల్లాహ్ తీరుస్తాడు. అల్లాహ్ చూపిన బాటలో నడిచిన వారికి ఎల్లప్పుడూ ఆయన కృప లభిస్తుంది" అని పేర్కొంటూ అంతిమ దైవప్రవక్త మహమ్మద్ చెప్పిన కథ ఇది:

ఒక వ్యక్తి మైదానంలో నడుస్తున్నాడు. "ఆ విశ్వాసి తోట కోసం వర్షాన్ని కురిపించు" అని మేఘాలను ఎవరో ఆజ్ఞాపించడం అతను విన్నాడు. అంతలోనే దట్టమైన నల్లని మేఘాల నుంచి ఒక మబ్బు తునక వేరు పడింది. ఒక నల్లరాతి నేల మీద వర్షాన్ని కురిపించింది. ఆ నీరు చిన్న కాలువలు కట్టింది. చివరికి అవన్నీ ఒక పెద్ద కాలువగా మారాయి. అది ప్రవాహంగా ముందుకు సాగుతోంది. ఇది చూసి ఆశ్చర్యపోయిన ఆ వ్యక్తి ఆ ప్రవాహం వెంట నడవసాగాడు. కొంత దూరం వెళ్ళాక... ఆ ప్రవాహం ఒక తోటలోకి మళ్ళింది. అక్కడ ఒక రైతు తన తోటకు నీరు పెడుతూ కనిపించాడు.



ఇది చూసిన ఆ వ్యక్తి "ఓ అల్లాహ్ దాసుడా! నీ పేరేమిటి?" అని అడిగాడు. అంతకుముందు మేఘాలకు అదృశ్యవాణి చెప్పిన విశ్వాసి పేరే ఆ రైతు కూడా చెప్పాడు.

అప్పుడు ఆ వ్యక్తి "నేను మైదానంలో నడుస్తూ ఉండగా... "ఫలానా విశ్వాసి తోట కోసం వర్షం కురిపించు" అని మేఘాలను ఎవరో ఆజ్ఞాపించినట్టు వినిపించింది. అది నీ పేరే. దాన్ని 'అల్లాహ్‌వాణి'గా నేను భావిస్తున్నాను. ప్రత్యేకంగా నీ తోటలోనే వర్షం కురిపించాలని అల్లాహ్ ఆదేశించడానికి అర్హత కలిగిన పని నువ్వేం చేస్తున్నావు?" అని రైతును ప్రశ్నించాడు.

"నేను నా తోటలో పండే మొత్తం పంటలో మూడోవంతు దానం చేస్తాను. మరో మూడోవంతు నా కుటుంబం ఆహారానికి సరిపోతుంది. మిగిలిన దాన్ని తరువాత వేయబోయే పంటకోసం ఉపయోగిస్తాను" అని ఆ రైతు చెప్పాడు.

"అల్లాహ్ చూపిన మార్గాన్ని భక్తి విశ్వాసాలతో అనుసరిస్తే... మనకు అవసరమైనదాన్ని ఊహించని మార్గాల్లో కచ్చితంగా ఆయన ప్రసాదిస్తాడు" ఈ కథ ద్వారా దైవప్రవక్త బోధించారు.

● మహమ్మద్ వహీదుద్దీన్

సహజయోగ

మనలో మహాసరస్వతి స్థిరపడాలంటే...


మాఘ మాసం అయిదో రోజు వసంత పంచమి. ఆ రోజున కళలకు, విజ్ఞాన శాస్త్రానికి, సంగీతానికి, జ్ఞానానికి దేవత అయిన సరస్వతిని ఆరాధిస్తాం. ఆమె వాక్కు, బుద్ధి, వివేకం, విద్యలకు అధిదేవత. వసంత పంచమి శీతాకాలానికి ముగింపును, వసంత ఋతువు ఆగమనాన్ని సూచిస్తుంది. ఋగ్వేదంలో, 'దేవీ భాగవతం'లో, 'బ్రహ్మవైవర్త పురాణం'లో, పద్మపురాణంలో సరస్వతీ దేవి గురించి వివిధ గాథలు ఉన్నాయి. ఆమెను ఆద్యంతరహిత శక్తి స్వరూపిణిగా వివిధ శాస్త్రాలు స్తుతించాయి. సృష్టి కార్యాన్ని నిర్వహించడానికి బ్రహ్మకు శక్తిని ప్రసాదించడానికి సరస్వతిని శ్రీమాతాదేవి ప్రసాదించిందని 'దేవీభాగవతం' చెబుతోంది. హంసవాహినిగా, వీణాపాణిగా, మాలాపుస్తకధారిణిగా సరస్వతిని ఎక్కువగా చిత్రీకరించడం కనిపిస్తుంది.



14న వసంత పంచమి

సరస్వతీ వర్ణనల్లో తెల్లని వస్తువులకు ప్రాధాన్యం. ఆమె ధరించే వీణ పేరు కచ్ఛపి. పరాశక్తి ధరించిన తొలి అయిదు రూపాల్లో సరస్వతి ఒకటి. సరస్వతీదేవి ప్రత్యేకతను సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలా దేవి పలు సందర్భాల్లో ఈ విధంగా వివరించారు:

మహాసరస్వతీ శక్తి మన సూక్ష్మ శరీరంలోని కుడిపార్శ్వంవైపు పని చేస్తుంది. స్వాధిష్ఠాన చక్రంలో కొలువై ఉన్న సరస్వతీ శక్తి తన గమనంలో... ఆ చక్రంలోని ఎడమ భాగాన్ని కుండలినీ జాగృతి ద్వారా ప్రకాశింపజేసినప్పుడు... మనలో కళాత్మక ప్రతిభలన్నీ అభివృద్ధి చెందుతాయి. కానీ స్వాధిష్ఠాన చక్రంలో రెండవ భాగాన్ని మనం చదవడం, రాయడం లాంటి వాటికి మాత్రమే ఉపయోగిస్తున్నాం. అంతకన్నా ఉన్నత స్థాయికి ఎదగడం మీద మన చిత్తాన్ని సారించడం లేదు. దీనివల్ల స్వాధిష్ఠాన చక్రంలో అసమతుల్యత ఏర్పడుతుంది. సరస్వతీ కృపవల్ల కళాకారులు సాహిత్యం, కళలు, సంగీత సాధన విషయంలో నిష్ణాతులైనా లక్ష్మీతత్త్వం వారికి అంతగా సహకరించకపోవడం మనం చూస్తూనే ఉంటాం. అది సహకరించాలంటే మనలోని సరస్వతీతత్త్వం... మహాసరస్వతీతత్త్వ స్థాయికి చేరాలి. అందుకోసం ఆజ్ఞాచక్రాన్ని అధిగమించే స్థాయికి ఆధ్యాత్మికంగా చేరుకోవాలి. అదే మహాలక్ష్మి, మహాసరస్వతి శక్తులు కలిసే స్థానం. కళాసామర్థ్యానికి తగిన విధంగా ధనార్జన చేయలేకపోతున్నామనుకొనేవారికి... ఆజ్ఞాచక్రాన్ని దాటితేనే ఆ సమస్య పరిష్కారానికి దారి దొరుకుతుంది. ఎప్పుడయితే మహాసరస్వతీతత్త్వం మనలో అభివృద్ధి చెందడం మొదలవుతుందో... వాస్తవాన్ని గ్రహించగలుగుతాం. అవగాహనలో మార్పు వస్తుంది 'మనమందరం ఒక్కటే, విశ్వంలో మనం అంతర్భాగం' అనే సత్యం స్థిరపడుతుంది. సరస్వతీతత్త్వం ఒక బీజం లాంటిదైతే... మహాసరస్వతీతత్త్వం ఒక వృక్షం లాంటిది. మీలో నిక్షిప్తమైన సరస్వతీ శక్తిని మహాసరస్వతీ శక్తిగా మార్చుకోకపోతే... మీ సుషుమ్నా మార్గంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ శక్తితో ఐక్యం కాలేరు. శ్రీమహాలక్ష్మీ శక్తి అనుగ్రహం ద్వారా మాత్రమే మీరు ఆత్మసాక్షాత్కారం పొందగలరు. మన ఎడమ పార్శ్వంలోని ఇడానాడిలో ఉన్న మహా కాళీ తత్త్వం వల్ల ఏదైనా పనిని తలపెట్టి, దాన్ని నెరవేర్చుకోవాలనే కోరికను కలిగి ఉంటారు. అయితే దాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చేది మాత్రం శ్రీమహాసరస్వతీ శక్తే. మనలోని సరస్వతీ శక్తిని జాగృతం చేసుకొని, మహాసరస్వతీ శక్తిని స్థిరపరుచుకోవడం అనేది.. కుండలినీ శక్తి ఉత్థానం ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందడం ద్వారా, నిత్య సహజ యోగ ధ్యానం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది.



డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

సంకీర్తనా పథంలో దాసశ్రేష్ఠుడు

"గురువుకు గులాము కానంతవరకు దొరకదన్నా ముక్తి" అని తన కృతిలో శ్రీపురందరదాసు చెబుతారు. గురువుకు గులాము అయితేనే హరికి దాసులవుతారనేది శాస్త్రాల సారం. అందుకే పురందరదాసు తన సర్వస్వం త్యజించి... గురువైన శ్రీవ్యాసరాయలును ఆశ్రయించారు. పురందరదాసు నారద ముని అంశతో జన్మించినవాడు. పరమలోభి అయిన వజ్రాల వ్యాపారి శ్రీనివాసనాయకుడు దాసవరేణ్యుడిగా మారిన కథ ఆసక్తికరమైనది.

పురంధరదాసు అసలు పేరు శ్రీనివాస నాయకుడు. ఒక రోజు శ్రీనివాస నాయకుడు తన చేతిలోని బంగారు ముక్కెరను తీక్షణంగా పరిశీలిస్తున్నాడు. ఆ ముక్కెరను, దాన్ని తన చేతిలో పెట్టి... డబ్బు అడుగుతున్న ముసలి బ్రాహ్మణుణ్ణీ, అతని పక్కన ఉన్న బాలుణ్ణీ మార్చి మార్చి చూస్తున్నాడు. 'ఆరు నెలల క్రితం తన కొడుకు ఉపనయనం కోసం ఈ బ్రాహ్మణుడు ధన సహాయం కావాలని వచ్చాడు. ఎన్నిసార్లు తిప్పి పంపినా, తిట్టి పంపినా విసుగు లేకుండా... పగలూ, మధ్యాహ్నం తేడా లేకుండా నాకు జిడ్డులా తగులుకున్నాడు. 'పోనీలే' అని అప్పటికి ఒక నాణేన్ని ఇస్తే... దాన్ని తీసుకొని తన స్థాయికి తగినట్టు కార్యక్రమాన్ని చేసుకోకుండా... 'అది చిలుము పట్టిన నాణెం' అంటూ తిరస్కరించాడు. ఇప్పుడేమో ఇంత విలువైన ముక్కెరను కుదువ పెట్టి డబ్బు అడుగుతున్నాడు. ఈ అమూల్యమైన ముక్కెర ముమ్మూర్తులా నా భార్య సరస్వతీబాయికి ఆమె పుట్టింటివారు పెట్టిన ముక్కెరలానే ఉంది. దీని సంగతేమిటో చూడాల్సిందే' అనుకున్నాడు. ఆ ముక్కెరను పెట్టెలో పెట్టి, తాళం వేశాడు. తాళాన్ని పదిసార్లు లాగి చూశాడు. తన ఎదుట కదలకుండా నిలబడిన బ్రాహ్మణుణ్ణీ, బాలుణ్ణీ చూసి 'పది నిమిషాల్లో వస్తాను. కూర్చొని ఉండండి' అని చెప్పి ఇంటికి బయలుదేరాడు. జగన్నాటక సూత్రధారి అయిన శ్రీహరి ఎవరినైనా తనవారుగా చేసుకోవాలని ఆయన అనుకుంటే... మొదట వారికి వైరాగ్యాన్ని ప్రసాదిస్తాడు. బాలుని రూపంలో చతుర్ముఖ బ్రహ్మ వెంటరాగా... ముసలి బ్రాహ్మణుడి రూపంలో శ్రీనివాసనాయకుడి దగ్గరకు వచ్చాడు. అతణ్ణి అనుగ్రహించి, సన్మార్గంలోకి పంపడానికి శ్రీహరి సాగిస్తున్న లీల ఇది. శ్రీనివాస నాయకుడి దగ్గరకు రావడానికి ముందు... సరస్వతీ బాయి దగ్గరకు వెళ్ళి.. ఆమె భర్త చూపిన లోభత్వాన్ని వివరించి, తన కుమారుడి ఉపనయనానికి సాయం యాచించాడు. పుట్టింటివారు ఇచ్చిన ముక్కెరను దానం చేసే స్వాతంత్ర్యం ఆమెకు ఉందని గుర్తు చేశాడు. ఆమె నుంచి స్వీకరించిన ముక్కెరనే... ఆమె భర్తకు ఇచ్చి, డబ్బు అడిగాడు.



విశేషం

నేడు శ్రీ పురంధరదాసు ఆరాధన

శ్రీనివాసనాయకుడు ఇంట్లో ప్రవేశించగానే భార్యను చూశాడు. ఆమె ముక్కుకు రోజూ ఉండే ముక్కెర లేదు. ఆ ముక్కెర తనకు తక్షణమే కావాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయనీ హెచ్చరించాడు. ఏం చేయాలో అర్థంకాని సరస్వతీబాయి విషం తాగి ప్రాణాలు తీసుకోవాలనుకుంది. విషపు పాత్రతో తులసి చెట్టు దగ్గరకు వెళ్ళి, చివరిసారిగా గోపాల కృష్ణుణ్ణి ప్రార్థన చేస్తూ ఉండగా... ఆ పాత్రలో చటుక్కున ఏదో పడింది. అదేమిటని పరిశీలిస్తే... ఆమె ముక్కెర. భగవంతుడి దయాగుణానికి మనసులోనే అనంత ప్రణామాలను అర్పిస్తూ... ఆ ముక్కెరను భర్తకు ఇచ్చింది. అది చూసిన శ్రీనివాసనాయకుడి తల తిరిగిపోయింది. ఆ ముక్కెరతో తన దుకాణానికి వెళ్ళాడు. అక్కడ బ్రాహ్మణుడు, అతని కుమారుడు లేరు. ఖజానా పెట్టె తాళం తెరిచి చూస్తే... అందులో తను ఉంచిన ముక్కెర లేదు. ఆ మాయ అతనికి అంతు పట్టలేదు. ఇంటికి వెళ్ళి, భార్యను అడిగి... జరిగినది తెలుసుకున్నాక... అతనికి సంభ్రమాశ్చర్యాలు, సిగ్గు, బాధ, పశ్చాత్తాపం కలిగాయి. జ్ఞానోదయమయింది. వైరాగ్యం పొందాడు. నవకోటి నారాయణుడిగా పేరు పొందిన అతను ఆ క్షణమే సమస్త సంపదలను వదిలి, కట్టుబట్టలతో భార్యాబిడ్డలతో ముందుకు నడిచాడు. 80 ఏళ్ళ వయసు వరకూ సంచారం చేస్తూ... 4 లక్షల 75 వేల సంకీర్తనలను భగవదర్పితం చేశాడు. సంపదపట్ల ఎంతో లోభిత్వాన్ని చూపించిన ఆయన అందుకు విరుద్ధంగా... జ్ఞానాన్ని ప్రజలకు పంచడంలో అత్యంత దాతృత్వాన్ని ప్రదర్శించాడు.

అద్భుతమైన సంగీతం, సరళమైన సాహిత్యం, ఆధ్యాత్మిక జ్ఞానం... ఈ మూడిటి త్రివేణీ సంగమమే ఆయన రచనలు. ఉపనిషత్ సారాన్ని సులువైన మాటల్లో అందించాడు. అందుకే ఆయన కృతులు 'పురంధరోపనిషత్తులు' అనిపించుకున్నాయి. ఆయన కీర్తనలలో వైవిధ్యం ఊహాతీతం. మానవ జన్మ విశిష్టత తెలుసుకోవాలనీ, పరమత సహనం కలిగి ఉండాలనీ, శైవ, వైష్ణవ వైషమ్యాలు తగవనీ ప్రబోధించాడు. లౌకిక సంపద కన్నా భక్తి, జ్ఞానాలు అనే సంపద అత్యంత విలువైనదని లోకానికి తెలియజేసిన ఆదర్శ మూర్తి పురంధరదాసు. పుష్య అమావాస్య (నేడు) శ్రీ పురందరదాసుల పుణ్యతిథి. 'ఈశ బేకు ఇద్దు జయిసబేకు' అని తన కీర్తనలో ఆయన బోధించినట్టు ఉన్నతమైన నైతిక విలువలతో లౌకిక గమ్యాలను కూడా చేరుకొంటూనే సుందరమైన సమాజాన్ని నిర్మిద్దాం.

● మాధ్వ ప్రచార పరిషత్
9440258841

ట్రూ లవర్ ఈ వాలెంటైన్ విన్నర్



మణికందన్, శ్రీ గౌరి ప్రియ, కన్న రవి ప్రధాన తారాగణంగా రూపొందిన తమిళ చిత్రం 'ట్రూ లవర్'. ఈ ప్రేమకథా చిత్రానికి ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించారు. దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 10న 'ట్రూ లవర్' విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ 'తమిళ ప్రీమియర్స్ చూసిన వాళ్లు ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా రాలేదని చెబుతున్నారు. తెలుగువాళ్లకూ ఈ సినిమా బాగా నచ్చుతుంది. పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్నాం. మణికందన్, గౌరీప్రియ నటన ఆకట్టుకుంటుంది. ఈ సినిమా ఈ వాలెంటైన్ డే విన్నర్ అవుతుంది. 'బేబీ' హిందీ రీమేక్‌లో నేను నటించడం లేదు' అని తెలిపారు. మారుతి మాట్లాడుతూ 'ట్రూ లవర్' కథను దర్శకుడు సహజంగా తెరకెక్కించాడు. దర్శకుడి ప్రతిభ అబ్బురపరుస్తుంది. ప్రేమికులే కాదు కుటుంబం అంతా కలసి చూసే సినిమా ఇది' అన్నారు. మణికందన్ మాట్లాడుతూ 'పక్కా స్ర్కీన్‌ప్లేతో తీసిన సినిమా ఇది. ఇక్కడి ప్రేక్షకులు నన్ను తెలుగు నటుడిగానే చూస్తున్నారు. మారుతి, ఎస్‌కేఎన్ రిలీజ్ చేయడం వల్ల ఈ సినిమా స్థాయి పెరిగింది' అని చెప్పారు. శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ 'ఈ చిత్రం తమిళ ప్రీమియర్స్‌కు ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన వస్తోంది. తెలుగులో సూపర్ హిట్ అవుతుందని నమ్ముతున్నాం' అన్నారు.

'ఈగల్' చిత్రంలో మునుపెన్నడూ చూడని రవితేజను ప్రేక్షకులు చూడబోతున్నారు. ఈ చిత్రం కాన్సెప్ట్‌లోనే విధ్వంసం ఉంది. కంటెంట్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది' అని దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని చెప్పారు. రవితేజ కథానాయకుడిగా ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఈగల్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. కావ్య థాపర్, అనుపమా పరమేశ్వరన్ కథానాయికలు. 'ఈగల్' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను కార్తీక్ మీడియాతో పంచుకున్నారు.

రాంబో, టెర్మినేటర్ తరహాలో...

కార్తీక్ ఘట్టమనేని



● 'ఈగల్'లో కథానాయకుడు సాధారణ పత్తి రైతులా కనిపిస్తాడు. కానీ ఓ అంతర్జాతీయ సమస్యపైన అతను పోరాటం చేస్తుంటాడు. 'రాంబో', టెర్మినేటర్' లాంటి సినిమాలను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేశారు. మనం కూడా అలాంటి ఒక సినిమా తీయాలనే ప్రయత్నంలోంచే 'ఈగల్' పుట్టింది. ఇదొక అద్భుతమైన యాక్షన్, డ్రామా ఎంటర్టైనర్. ప్రేక్షకులను అలరిస్తుంది. పూర్తి స్థాయి యాక్షన్ చిత్రం చేయాలనేది దర్శకుడిగా నా కల. అది 'ఈగల్'తో నెరవేరింది.

● పక్షుల్లో గద్దకు చాలా సునిశితమైన దృష్టి ఉంటుంది. సుదూరాన ఉన్న లక్ష్యాన్ని సైతం చూసి వేటాడుతుంది. ఈ సినిమాలో కథానాయకుడికి కూడా భవిష్యత్తులో జరగబోయే పరిణామాలను అంచనా వేయగల నైపుణ్యం ఉంటుంది. అందుకే 'ఈగల్' టైటిల్ పెట్టాం. హిందీలో 'సహదేవ్ వర్మ' టైటిల్‌తో విడుదల చేస్తున్నాం.

● 'ధమాకా' సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసే సమయంలో రవితేజకు కథ చెప్పాను. 'మంచి ఎంటర్టైనర్ అవుతుంది చేద్దాం' అని వెన్నుతట్టారు. ఈ సినిమా అంతటా ఆయన పాత్ర ఒకేలా ఉంటుంది. ఆయన ఎనర్జీ లెవల్స్ వేరే లెవల్లో ఉంటాయి. ఆయన నుంచి నేర్చుకోవాల్సింది క్రమశిక్షణ. ఆహారపు అలవాట్లు, నిద్రవేళలు కచ్చితంగా పాటిస్తారు.

● ఈగల్ సౌండ్ డిజైన్‌కే ఆరునెలలు పట్టింది. యూరప్‌లో రియల్ గన్స్‌తో షూట్ చేసి ఆ సౌండ్‌ని రికార్డ్ చేశాం. అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సహకారం మరువలేనిది. ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు కావలసిన వనరులు సమకూర్చేవారు.

● ఈ చిత్రంలో నవదీప్ నటన ఆశ్చర్యపరుస్తుంది. అనుపమా పరమేశ్వరన్ కథను ముందుకు నడిపించే పాత్రను పోషించారు. త్వరలో తేజ సజ్జతో ఓ చిత్రం చేస్తున్నాను.



కలయిక కుదిరిందా?



'విక్రమ్' చిత్రంతో కమల్‌హాసన్‌ను సక్సెస్ ట్రాక్ ఎక్కించారు దర్శకుడు లోకేశ్ కనగరాజ్. ఇప్పుడు కమల్‌హాసన్ కూతురు శ్రుతిహాసన్‌తో ఆయన ఓ చిత్రం చేయబోతున్నారనే వార్త కోలీవుడ్‌లో వినిపిస్తోంది. వీరిద్దరు కలసి దిగిన ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవడం ఈ చర్చకు మరింత ఊపునిచ్చింది. వీరిద్దరి కాంబోలో లేడీ ఓరియంటెడ్ చిత్రం తెరకెక్కుతోందని అంటున్నారు. అయితే శ్రుతీ, లోకేశ్ తో కమల్‌హాసన్ ఓ మ్యూజిక్ ఆల్బమ్ తెరకెక్కిస్తున్నారనే వార్త సైతం వినిపిస్తోంది. అధికారిక ప్రకటన వస్తే తప్ప దీనిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

నవ్వించే గూఢచారి

హాస్య నటుడు వెన్నెల కిశోర్ హీరోగా నటించిన 'చారి 111' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో ఆదితి సోని నిర్మించిన సినిమా ఇది. సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్‌గా నటించారు. కన్‌ఫ్యూజ్ అయ్యే గూఢచారిగా వెన్నెల కిశోర్ కనిపిస్తారని దర్శకనిర్మాతలు చెప్పారు. 'ఇదొక స్పై యాక్షన్ కామెడీ సినిమా. సిల్లీ మిస్టేక్స్ చేసే గూఢచారి ఒక పెద్ద కేసుని ఎలా పరిష్కరించాడన్న అంశంతో చిత్రాన్ని రూపొందించాం. వెన్నెల కిశోర్, సంయుక్త గూఢచారి పాత్రలు పోషించారు. వాళ్ల బాస్‌గా మురళీశర్మ కీలక పాత్ర చేశారు.' అని దర్శకుడు చెప్పారు. గూఢచారి చిత్రాల్లో 'చారి 111' కొత్తగా ఉంటుందని నిర్మాత తెలిపారు. త్వరలో పాటలు, ట్రైలర్‌ను విడుదల చేస్తామని చెప్పారు.



యువతకు నచ్చే సోలో బాయ్



బిగ్‌బాస్ ఫేమ్ గౌతమ్ కృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రానికి 'సోలో బాయ్' టైటిల్ ఖరారైంది. పీ నవీన్ కుమార్ దర్శకత్వంలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మించారు. బుధవారం చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. నిర్మాత మాట్లాడుతూ 'మా నిర్మాణంలో వచ్చిన 'బట్టల రామస్వామి బయోపిక్' ప్రేక్షకులను అలరించింది. 'సోలో బాయ్' చిత్రం ప్రేక్షకుల హృదయాలను స్పృశిస్తుంది' అన్నారు. గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ "ఆకాశవీధిలో" చిత్రంతో నటుడిగా గుర్తింపు వచ్చింది. ఈ సినిమాతో ప్రేక్షకులకు మరింత చేరువవుతాననే నమ్మకం ఉంది' అన్నారు. యువతకు, కుటుంబ ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుందని దర్శకుడు తెలిపారు.

మత్స్యకారుల కథతో 'సముద్రుడు'



రమాకాంత్, అవంతికి, భానుశ్రీ హీరోహీరోయిన్లుగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సముద్రుడు'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో బదావత్ కిషన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం టీజర్‌ను తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'మత్స్యకారుల జీవితాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన సినిమా ఇది. కేటీఆర్‌గారు మా చిత్రం టీజర్‌ను ఆవిష్కరించి, ఓ సామాజిక అంశాన్ని కమర్షియల్ హంగులతో సినిమాగా తీయడం అభినందనీయం అన్నారు. మే 3న మా సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. హీరో రమాకాంత్ మాట్లాడుతూ 'అన్ని కమర్షియల్ అంశాలతో సినిమా రూపుదిద్దుకుంది. అందరూ చూసి అభినందిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు. సుమన్, శ్రవణ్, రామరాజు, రాజ్ ప్రేమి, సమ్మెట గాంధీ, ప్రభావతి, జబర్దస్త్ శేషు, చిత్రం శ్రీను తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, ఎడిటింగ్: నందమూరి హరి.




అమెరికాలో డాక్టర్‌గా సెటిల్ అయిన హరనాథ్ పొలిచర్ల సినిమా మీద మమకారంతో ఇండియా వచ్చి చిత్రాలు తీస్తుంటారు. స్వీయ దర్శకత్వంలో ఆయన నిర్మించిన తాజా చిత్రం 'డ్రిల్' ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినిమా టీజర్‌ను విడుదల చేశారు. సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై హరనాథ్ మరెన్నో సినిమాలు తీయాలనీ, 'డ్రిల్' చిత్రం విజయవంతం కావాలనీ కోరారు.

డాక్టర్ హరనాథ్ మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. ఆ కారణంగానే ఇప్పటివరకూ ఎనిమిది సినిమాలు తీశా. అమెరికాలో డాక్టర్ వృత్తిలో ఎంత బిజీగా ఉన్నా ఎప్పటికప్పుడు సినిమా అప్డేట్స్ తెలుసుకుంటుంటాను. లవ్

లవ్ జిహాద్ డ్రిల్

జిహాద్ మీద తెలుగులో ఇంతవరకూ ఒక్క సినిమా కూడా రాలేదు. అందుకే ఆ కాన్సెప్ట్‌తో స్ర్కిప్ట్ రెడీ చేసుకుని ఇండియాకు వచ్చి సినిమా తీశా. ఇంతవరకూ నేను చేసిన సినిమాలకు ఇది భిన్నంగా ఉంటుంది' అన్నారు. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో భవ్య, సిషిగంధ, తనికెళ్ల భరణి, జెమినీ సురేశ్, కోటేశ్వరరావు, సత్తన్న, విశ్వ , జబర్దస్త్ ఫణి తదితరులు నటించారు.

2024-25లో 7% వృద్ధి



ద్రవ్యోల్బణం అంచనా 4.5 శాతం

కీలక రెపో రేటు యథాతథం

- ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ
- ఏప్రిల్ 3-5 తేదీల్లో తదుపరి సమీక్ష

ముంబై: వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో జీడీపీ వృద్ధి రేటు 7 శాతంగా నమోదు కావచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంచనా వేసింది. గత అంచనా 6.6 శాతంతో పోలిస్తే అధికమిది. అయితే, ఈ ఆర్థిక సంవత్సరానికి (2023-24) జాతీయ గణాంకాల కార్యాలయం అంచనా వేసిన 7.3 శాతం వృద్ధి రేటు కంటే తక్కువే. కుటుంబాల వినియోగంతో పాటు ప్రైవేట్ రంగ పెట్టుబడులు పుంజుకోవడం, వ్యాపార సెంటిమెంట్, బ్యాంకులు, కార్పొరేట్ కంపెనీల బ్యాలెన్స్ షీట్లు మెరుగవడం ఇంకా మౌలిక పెట్టుబడులపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టిసారించడం వంటి అంశాలు వచ్చే ఏడాది వృద్ధి జోరు కొనసాగింపునకు దోహదపడనున్నాయని ఆర్‌బీఐ పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో వృద్ధి రేటు 7.2 శాతంగా నమోదైంది. రబీ సాగు పెరగడం, తయారీ రంగ లాభదాయకతలో స్థిరత్వం, చురుకుగా సాగుతున్న సేవా రంగం వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమివ్వనున్నాయని ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్‌బీఐ ప్రస్తావించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం సగటు 5.4 శాతానికి పరిమితం కానుందన్న ఆర్‌బీఐ.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 4.5 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసింది. భారీ, పునరావృత ఆహార ధరల షాక్‌లు ద్రవ్యోల్బణ నియంత్రణకు అవాంతరంగా మారుతున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు.

భౌగోళిక రాజకీయ పరిణామాలు, సరఫరా వ్యవస్థపై వాటి పరిణామాలు, అంతర్జాతీయ ఆర్థిక సేవల మార్కెట్లు, కమోడిటీ ధరల్లో ఒడుదొడుకులకు ద్రవ్యోల్బణాన్ని అంచనాల కంటే పెంచే ప్రమాదం ఉందని సమీక్ష నివేదికలో గవర్నర్ పేర్కొన్నారు. రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి (+/-2 శాతం) కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి లక్ష్యాన్ని నిర్దేశించింది. గత ఏడాది డిసెంబరులో ద్రవ్యోల్బణం 5.69 శాతంగా నమోదైంది.

త్రైమాసికాల వారీగా వృద్ధి, ద్రవ్యోల్బణ అంచనాలు (%)

త్రైమాసికం	వృద్ధి	ద్రవ్యోల్బణం
క్యూ1 (ఏప్రిల్-జూన్)	7.2	5.0
క్యూ2 (జూలై-సెప్టెంబరు)	6.8	4.0
క్యూ3 (అక్టోబరు-డిసెంబరు)	7.0	4.6
క్యూ4 (జనవరి-మార్చి)	6.9	4.7

రిటైల్, ఎంఎస్ఎంఈ రుణగ్రహీతలకు కేఎఫ్ఎస్ ఇవ్వాలి..

రుణాల మంజూరులో పారదర్శకతను పెంచేందుకు ఆర్‌బీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అందరు రుణదాతలు రిటైల్, ఎంఎస్ఎంఈ రుణగ్రహీతలకు వడ్డీ రేటు సహా రుణ ఒప్పంద నిబంధనలకు సంబంధించిన కీ ఫ్యాక్ట్ స్టేట్‌మెంట్ (కేఎఫ్ఎస్)ను అందించాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ప్రస్తుతం వాణిజ్య బ్యాంకులిచ్చే వ్యక్తిగత రుణాలతోపాటు ఆర్‌బీఐ నియంత్రిత డిజిటల్ లెండింగ్ కంపెనీలు, సూక్ష్మ రుణ సంస్థల రుణాలకు కేఎఫ్ఎస్ తప్పనిసరి.

త్వరలో ఈ-రూపీ ఆఫ్‌లైన్ లావాదేవీలు

డిజిటల్ రూపాయి లేదా సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) వినియోగదారులు త్వరలో ఇంటర్నెట్ సౌకర్యం లేని లేదా పరిమిత కనెక్టివిటీ ప్రాంతాల్లో ఆఫ్‌లైన్‌లోనూ లావాదేవీలు నెరిపే వెసులుబాటు కల్పించనున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ దాస్ తెలిపారు. ఆర్‌బీఐ రిటైల్ సీబీడీసీని 2022 డిసెంబరులో పైలట్ పద్ధతిన ప్రవేశపెట్టింది. 2023 డిసెంబరు నాటికి డిజిటల్ రూపాయి ద్వారా రోజుకు 10 లక్షల లావాదేవీల లక్ష్యాన్ని చేరుకుంది.

ఆరోసారీ వడ్డీ రేట్లు మారలేదు..

ఆర్‌బీఐ వరుసగా ఆరోసారీ కీలక వడ్డీ (రెపో) రేట్లను యథాతథంగా కొనసాగించింది. అంతర్జాతీయ అనిశ్చితులతో పాటు ద్రవ్యోల్బణాన్ని మరింత తగ్గించాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో బ్యాంకింగ్ నియంత్రణ మండలి ఈ నిర్ణయం తీసుకుంది. వడ్డీ రేట్లపై సర్దుబాటు వైఖరిని క్రమంగా ఉపసంహరించుకోవాలన్న గత నిర్ణయాన్ని కూడా యథావిధిగా కొనసాగిస్తున్నట్లు తెలిపింది. 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి మధ్య కాలంలో ఆర్‌బీఐ రెపో రేటును వరుసగా ఆరు విడతల్లో 2.5 శాతం పెంచింది. దాంతో రెపో 6.5 శాతానికి చేరుకుంది. గతంలో రెపో పెంపు ప్రభావం మార్కెట్‌కు ఇంకా పూర్తిగా బదిలీ కాలేదని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు. ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో భాగంగా శక్తికాంత దాస్ అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల పాటు (ఈ నెల 6-8 తేదీల్లో) సమావేశమైంది. ప్రస్తుత దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాల నేపథ్యంలో రెపో రేటును యథాతథంగా కొనసాగించాలని ఐదుగురు సభ్యులు ఓటేశారు. తదుపరి సమీక్షను ఏప్రిల్ 3-5 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపింది.

నిరంతర నిబంధనల ఉల్లంఘన కారణంగానే పేటీఎంపై చర్యలు

నియంత్రణ నియమావళిని నిరంతరం ఉల్లంఘించిన కారణంగానే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్)పై కఠిన చర్యలు చేపట్టడం జరిగిందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. నిబంధనలకు అనుగుణంగా దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు ఈ ఫిన్‌టెక్ కంపెనీకి తగినంత సమయం ఇవ్వటంతో పాటు ఇందుకు సంబంధించి సంస్థతో జరిపిన దీర్ఘకాలిక ద్వైపాక్షిక చర్చలు ఆశించిన ఫలితాలివ్వకపోవడం వల్లే ఆంక్షలు విధించాల్సి వచ్చిందని శక్తికాంత దాస్ తెలిపారు. అయితే, పేటీఎంకు వ్యవస్థాగతమైన ముప్పేమీ లేదని పరపతి సమీక్ష నిర్ణయాల ప్రకటన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పేర్కొన్నారు. ఆర్‌బీఐ చర్యలు వ్యవస్థ స్థిరత్వానికి భంగం కలగకుండా చూడటంతోపాటు కస్టమర్ల ప్రయోజనాలను రక్షించేందుకేనని దాస్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. పీపీబీఎల్‌పై ఆంక్షలపై పేటీఎం యాప్‌పై ప్రభావం ఉండదని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ జే స్వామినాథన్ స్పష్టం చేశారు. బ్యాంకులు తమ విధానాలకు అనుగుణంగా అవసరమైన జాగ్రత్తలు పాటిస్తూ పేటీఎం వాలెట్‌తో భాగస్వామ్యం కావచ్చన్నారు. కాగా, పీపీబీఎల్ ఉదంతంపై ప్రజల్లో చాలా సందేహాలు, ఆందోళనలు ఉన్నాయని.. వాటిపై స్పష్టతనిచ్చేందుకు వచ్చేవారంలో సమగ్ర ఎఫ్ఏక్యూ (ఫ్రీక్వెంట్లీ ఆస్క్‌డ్ క్వశ్చన్స్) విడుదల చేయనున్నట్లు దాస్ తెలిపారు.

ఎల్ఐసీ లాభం రూ.9,444 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి గాను రూ.9,444 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలం (రూ.6,344 కోట్లు)తో పోలిస్తే ఇది 49 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ స్థూల ఆదాయం రూ.1,96,891 కోట్ల నుంచి రూ.2,12,447 కోట్లకు, నికర ప్రీమియం ఆదాయం రూ.1,11,788 కోట్ల నుంచి రూ.1,17,017 కోట్లకు చేరాయి.

అపోలో లాభంలో 60% వృద్ధి

హైదరాబాద్: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి అపోలో హాస్పిటల్స్ రూ.4,850.60 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.245 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 13.8 శాతం, నికర లాభం 60 శాతం పెరిగాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.6 చొప్పున తాత్కాలిక డివిడెండ్ చెల్లించాలని అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. రూ.5 ముఖ విలువ ఉన్న షేరుపై ఇది 120 శాతానికి సమానం.

39% పెరిగిన ఎన్‌సీసీ లాభం

హైదరాబాద్: ఎన్‌సీసీ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ టర్నోవర్ అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 39 శాతం పెరిగి రూ.4,773.19 కోట్లకు చేరింది. ఇదే సమయంలో నికర లాభం రూ.149.88 కోట్ల నుంచి రూ.212.82 కోట్లకు పెరిగింది. డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ కొత్తగా రూ.796 కోట్ల విలువైన ఆర్డర్లు సంపాదించింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,240 ▲	58,010 ▲	76,100 ▲
ముంబై	62,612 ▼	57,353 ▼	69,950 ▲



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ		
హైదరాబాద్	545	
9వ తేదీ		
చిత్తూరు	583	
గోదావరి	546	
విజయవాడ	546	
విశాఖపట్నం	555	
వరంగల్	547	
డజను గుడ్లు రూ.72		



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117
వరంగల్	117
కరీంనగర్	117
మహబూబ్‌నగర్	117
కర్నూలు	117
విశాఖపట్నం	117
గోదావరి	122
విజయవాడ	122
గుంటూరు	124
ఒంగోలు	124
చిత్తూరు	130

భారత్‌లోనూ 'కోడ్ విత్‌ఔట్ బారియర్స్'

- 75,000 మంది మహిళా డెవలపర్లకు శిక్షణ
- మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల

బెంగళూరు: సాఫ్ట్‌వేర్ దిగ్గజం 'మైక్రోసాఫ్ట్' కంపెనీ తన 'కోడ్ విత్‌ఔట్ బారియర్స్' కార్యక్రమాన్ని భారత్‌కు విస్తరిస్తోంది. ఈ నెలలోనే భారత్‌లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని కంపెనీ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటించారు. మైక్రోసాఫ్ట్ 'ఏఐ టూర్' సందర్భంగా ఆయన ఈ విషయం వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా కంపెనీ ఈ సంవత్సరం దేశంలో 75,000 మంది మహిళా సాఫ్ట్‌వేర్ డెవలపర్లకు వేగంగా అభివృద్ధి చెందుతున్న క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ టెక్నాలజీల వంటి సాంకేతిక అంశాల్లో శిక్షణ ఇవ్వనుంది. సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల అభివృద్ధిలో స్త్రీ-పురుషుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు 2021లో మైక్రోసాఫ్ట్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని తొమ్మిది దేశాల్లో మైక్రోసాఫ్ట్ ఈ కార్యక్రమం అమలు చేస్తోంది. ఈ నెలాఖరులోగా భారత్‌లోనూ ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

ఐఈడబ్ల్యూ-2024లో 'మేఘా' రిగ్గులు

గోవాలో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్ (ఐఈడబ్ల్యూ)-2024 సదస్సులో హైదరాబాద్ కేంద్రంగా పని చేసే మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) తన అత్యాధునిక డ్రిల్లింగ్ రిగ్‌ను ప్రదర్శించింది. కంపెనీ అనుబంధ డ్రిల్‌మెక్ ఎస్.పీ.ఏ అనే కంపెనీ సాంకేతిక సహకారంతో 'హెచ్ హెచ్ 150' అనే ఈ ఆటోమేటెడ్ హైడ్రాలిక్ వర్క్‌ఓవర్ రిగ్‌ను తయారు చేసింది. ఈ రిగ్‌కు అవసరమైన విడి భాగాల్లో 55 శాతానికి పైగా ఉత్పత్తులను ఎంఈఐఎల్ స్థానిక కంపెనీల నుంచి సేకరించింది.

స్పెక్ట్రమ్ కనీస ధర రూ.96,317 కోట్లు

న్యూఢిల్లీ: మొబైల్ టెలికాం సేవలకు అవసరమైన 8 స్పెక్ట్రమ్ బ్యాండ్ల కనీస ధరను ప్రభుత్వం రూ.96,317 కోట్లుగా ఖరారు చేసింది. దివాలా ప్రక్రియలో ఉన్న కంపెనీలకు చెందిన 800, 900, 1800, 2100, 2300, 2500, 3300 మెగాహెట్జ్, 26 గిగా హెట్జ్ బ్యాండ్ల స్పెక్ట్రమ్‌ను ప్రభుత్వం త్వరలో వేలం వేయనుంది.

వడ్డీ రేట్ల అనిశ్చితిపై ఆగ్రహ జ్వాలలు

ఒక శాతం నష్టపోయిన మార్కెట్

ముంబై: ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపుపై నెలకొన్న అనిశ్చితి ఇన్వెస్టర్లను ఆగ్రహానికి గురి చేసింది. వడ్డీ రేట్లలో యథాతథ స్థితి కొనసాగింపు పట్ల తీవ్ర అసంతృప్తి చెందిన ఇన్వెస్టర్లు వడ్డీ రేట్ల ప్రభావం అధికంగా ఉండే ఆర్థిక సర్వీసులు, బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, కమోడిటీ షేర్లలో అమ్మకాలకు తెగబడ్డారు. దీంతో ఈక్విటీ మార్కెట్ గురువారం ఒక శాతం మేరకు నష్టపోయింది. సెన్సెక్స్ 723.57 పాయింట్ల నష్టంతో 71428.43 వద్ద ముగియగా నిఫ్టీ 212.55 పాయింట్ల నష్టంతో 21717.95 వద్ద క్లోజైంది. ఒక దశలో సెన్సెక్స్ 921.38 పాయింట్లు నష్టపోయి 71230.62 పాయింట్ల ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని తాకింది.

పేటీఎం షేర్లు ఢమాల్: పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్ షేరు రెండు రోజుల ర్యాలీ అనంతరం మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. గురువారం ఈ షేరు బీఎస్ఈలో 9.99 శాతం దిగజారి దిగువ సర్క్యూట్ రూ.447.10 స్థాయిని తాకింది. ఎన్ఎస్ఈలో కూడా అదే స్థాయిలో దిగజారి రూ.446.65కు పడిపోయింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ రూ.3153.18 కోట్లు నష్టపోయి రూ.28,934.44 కోట్ల స్థాయికి దిగజారింది.

ఐదో విలువైన కంపెనీగా ఎల్ఐసీ

ఎల్ఐసీ షేర్లు గురువారం ఒక్కరోజే 6 శాతం పెరగడంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.6,99,702.87 కోట్లకు పెరిగింది. స్టాక్ మార్కెట్‌లో ఐదో అత్యంత విలువైన కంపెనీగా నమోదయింది. బీఎస్ఈలో ఈ షేరు ఒక దశలో రికార్డు స్థాయిలో 9.51 శాతం పెరిగి రూ.1,144.45 స్థాయిని తాకినా చివరికి 5.86 శాతం లాభంతో రూ.1,106.25 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 6.46 శాతం లాభపడి రూ.1,112 వద్ద ముగిసింది. ఒక్క రోజులోనే కంపెనీ మార్కెట్ విలువ రూ.38,740.62 కోట్ల మేరకు పెరిగింది. ప్రస్తుతం స్టాక్‌మార్కెట్లో అత్యంత విలువైన కంపెనీగా రిలయన్స్ (రూ.19,64,044.94 కోట్లు) అగ్రస్థానంలో ఉండగా టీసీఎస్ (రూ.15,13,218.99 కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.10,66,150.51 కోట్లు), ఇన్ఫోసిస్ (రూ.7,02,754.66 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

స్పోర్ట్స్

డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో స్వీడన్‌తో భారత్ పోరు

న్యూఢిల్లీ: గతవారం పాకిస్థాన్‌తో పోరులో గెలుపొంది డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో చోటు ఖరారు చేసుకున్న భారత టెన్నిస్ జట్టుకు విదేశీ గడ్డపై తదుపరి ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. వరల్డ్ గ్రూప్-1లో భాగంగా భారత్ ఈ సెప్టెంబరులో స్వీడన్ జట్టుతో తలపడనుంది. ఇటీవల క్వాలిఫయర్స్ తొలిరౌండ్లో బ్రెజిల్ చేతిలో స్వీడన్ ఓడిపోయింది. అయితే, ఇప్పటిదాకా స్వీడన్‌తో భారత్ ఐదుసార్లు పోటీపడ్డా ఒక్కసారి కూడా నెగ్గలేకపోయింది. మరి.. ఈసారైనా మనోళ్లకు విజయం దక్కుతుందో లేదో చూడాలి.



ఈఫిల్ టవర్ ఐరన్‌తో ఒలింపిక్ పతకాలు

పారిస్: మరో ఐదు నెలల్లో పారిస్‌లో ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్ ఆరంభం కానున్నాయి. 17 రోజుల పాటు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో విజేతలుగా నిలిచే అథ్లెట్లకు 5,084 పతకాలను అందించనున్నారు. అయితే వందేళ్ల తర్వాత తాము ఆతిథ్యం ఇవ్వబోతున్న ఈ గేమ్స్‌ను చిరస్మరణీయం చేసుకోవాలనే ఆలోచనలో నిర్వాహకులున్నారు. దీంట్లో భాగంగా ఒలింపిక్స్, పారాలింపిక్స్‌లో పోటీపడే విజేతలకు ప్రదానం చేసే స్వర్ణ, రజత, కాంస్య పతకాలను గురువారం విడుదల చేశారు. ఒలింపిక్స్ చరిత్రలోనే అత్యంత ప్రత్యేకంగా, చరిత్రాత్మకంగా, మరచిపోలేని విధంగా ఉండేలా ఈ పతకాలను రూపొందించారు. ఫ్రాన్స్ దేశ చరిత్రాత్మక కట్టడమైన ఈఫిల్ టవర్ నుంచి తీసిన ఇనుమును ఈ పతకాల తయారీలో వాడడం విశేషం. ప్రతి పతకానికి షడ్భుజాకారంలో 18 గ్రాముల ఇనుమును అద్దారు. దీనిపైనే పారిస్ 2024 ఒలింపిక్స్ లోగోను కూడా ఉంచారు. ప్రముఖ ఫ్రెంచ్ జ్యూవెలరీ హౌజ్ చౌమెట్ ఈ పతకాలను తయారు చేసింది. 'ఒలింపిక్స్, పారాలింపిక్స్ విజేతలకు ఈఫిల్ టవర్ ముక్కను అందించాలనుకుంటున్నాం. ఈ పతకాలు మా దేశ గౌరవానికి ప్రాతినిధ్యం వహించేలా ఉంటాయి' అని పారిస్ ఒలింపిక్స్ నిర్వాహక కమిటీ చీఫ్ టోనీ ఎస్టాంగ్యూట్ తెలిపారు.



ఐస్ ప్యాలెస్ 'వాల్ ఆఫ్ ఫేమ్'పై చోప్రా

ఒలింపిక్ చాంపియన్‌కు అరుదైన గౌరవం

లౌజానే (స్విట్జర్లాండ్): ఒలింపిక్ చాంపియన్, జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. స్విట్జర్లాండ్‌లోని ప్రముఖ ఐస్ ప్యాలెస్ యుంగ్‌ఫ్రావ్ 'వాల్ ఆఫ్ ఫేమ్'లో నీరజ్ చిత్రానికి చోటు లభించింది. ప్యాలెస్ గోడపై నీరజ్ పేరిట ఏర్పాటు చేసిన స్మారక ఫలకాన్ని అతడు ఆవిష్కరించాడు. ఈ సందర్భంగా అక్కడ ఉంచేందుకు తన జావెలిన్‌ను బహుమానంగా ఇచ్చాడు. అనంతరం జావెలిన్ త్రో విన్యాసాలతో సందర్శకులకు కనువిందు చేశాడు. టాప్ ఆఫ్ యూరప్‌గా పిలిచే ఈ ప్యాలెస్ ప్రముఖ పర్యాటక ప్రాంతం. ఇక్కడి గోడలపై స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్, గోల్ఫర్ రోరీ మిక్‌ఇల్రాయ్ స్మారకాలు కూడా ఉన్నాయి. స్విస్ పర్యాటకానికి చోప్రా ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.

బుమ్రాను ఏం చేద్దాం?



మూడో టెస్టుకు విశ్రాంతిపై మల్లగుల్లాలు

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ తొలి టెస్టు ఓడినా.. రెండో టెస్టులో అద్భుత పోరాటం కనబర్చింది. పేసర్ బుమ్రా తన పదునైన బౌలింగ్‌తో పర్యాటక జట్టును హడలగొట్టడంతోనే విజయం దక్కింది. ప్రస్తుతం సిరీస్‌లో 1-1తో నిలిచిన భారత్ పోటీని రసవత్తరంగా మార్చింది. అయితే మిగిలిన మూడు టెస్టుల కోసం జట్టును ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే జడేజా గాయంతో, కోహ్లీ వ్యక్తిగత కారణాలతో సిరీస్ ఆడేది సందేహంగా మారింది. ఈనేపథ్యంలో పేసర్ బుమ్రాకు టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు తగిన విశ్రాంతి కల్పిస్తే బావుంటుందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇప్పటిదాకా జరిగిన రెండు టెస్టుల్లో అతడు 57.5 ఓవర్లు వేసి 15 వికెట్లు తీయడం విశేషం. జట్టు కీలక బౌలర్ కావడంతో అతడిపై అధికంగా పనిఒత్తిడి పడకూడదనే భావనలో సెలెక్టర్లున్నారు. ఈ సిరీస్ తర్వాత ఐపీఎల్, అనంతరం టీ20 వరల్డ్‌కప్ వరుసగా ఉంటాయి. అంతేకాకుండా గాయాలతోనే దాదాపు 2022-23 ఏడాదంతా ఆటను మిస్ అయ్యాడు. అందుకే ముందుజాగ్రత్తగా రాజ్‌కోట్‌లో జరిగే మూడో టెస్టు నుంచి తప్పిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలో సెలెక్టర్లు ఉన్నారు. కానీ భారత స్పిన్నర్లను ఇంగ్లండ్ బ్యాటర్లు సులువుగా ఆడేస్తున్న వేళ.. అటు బుమ్రా కూడా జట్టులో లేకపోతే ఎలా? అనే సందేహం కూడా వ్యక్తమవుతోంది. అదీగాకుండా తను జట్టు వైస్‌కెప్టెన్. అనుభవజ్ఞుడు విరాట్ అందుబాటులో లేకపోవడంతో కెప్టెన్ రోహిత్‌కు బుమ్రా అండ అవసరం. ఏదిఏమైనా రాజ్‌కోట్‌లో ఆడాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకునేందుకు బోర్డు పెద్దలు బుమ్రాకే పూర్తి అధికారం ఇచ్చినట్టు సమాచారం.

ప్రొ లీగ్ నుంచి వరుణ్ అవుట్



న్యూఢిల్లీ: అత్యాచార కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత హాకీ ఆటగాడు వరుణ్ కుమార్ అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రొ లీగ్ టోర్నీ నుంచి గురువారం వైదొలిగాడు. ఈ టోర్నీ శనివారం భువనేశ్వర్‌లో మొదలవనుంది. ఇందుకోసం అతడు జట్టుతో కలిసి భువనేశ్వర్‌లోనే ఉన్నాడు. వివాహం చేసుకుంటానని నమ్మించి మైనర్‌గా ఉన్నప్పుడే తనపై వరుణ్ అత్యాచారం చేశాడని ఓ మహిళ గత సోమవారం బెంగళూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పోలీసులు పోక్సో చట్టం కింద వరుణ్‌పై కేసు నమోదు చేశారు. కాగా..హాకీ ఇండియా వర్గాల కథనం ప్రకారం..వరుణ్‌పై ఫిర్యాదు చేసిన మహిళ బెంగళూరులోని సాయ్ సెంటర్‌లో వాలీబాల్ ప్లేయరట. అక్కడే వరుణ్ కు పరిచయమైన ఆ మహిళ ప్రస్తుతం ఎయిర్ హోస్టెస్‌గా పని చేస్తోందని సమాచారం.

ఇషాన్‌కు కష్టమేనా?



బరోడా: కొంతకాలంగా క్రికెట్‌కు దూరమైన వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ తిరిగి ప్రాక్టీస్ ఆరంభించాడు. నవంబరులో ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ తర్వాత అతడు అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. మానసిక అలసట కారణంగా విశ్రాంతి తీసుకున్నాడు. జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న అతను బరోడాలోని రిలయన్స్ స్టేడియంలో తీవ్రంగా సాధన చేస్తున్నాడు. టీమిండియాలోకి రావాలంటే ఇషాన్ దేశవాళీల్లో ఆడాలని కోచ్ ద్రవిడ్ ఇదివరకే స్పష్టం చేశాడు. దీంతో శుక్రవారం నుంచి హరియాణాతో జరిగే రంజీ మ్యాచ్‌కు ఇషాన్ జార్ఖండ్ జట్టు తరఫున ఆడాలి. అయినా అతను రంజీకి దూరంగా ఉండడం గమనార్హం. దీంతో ఇప్పట్లో ఇషాన్ టీవీండియాలో కనిపించడం కష్టమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

- హైదరాబాద్‌లో 'వీడీ' వాలీబాల్ ఫైనల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వాలీబాల్ లీగ్‌లోని హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు ఆధ్వర్యంలో విజయ్ దేవరకొండ (వీడీ) వాలీబాల్ టోర్నీ లీగ్ దశను తెలుగు రాష్ట్రాల్లో విజయవంతంగా నిర్వహించామని ఆ టీమ్ సహ యజమాని, సినీ హీరో విజయ్ దేవరకొండ వెల్లడించాడు. తెలంగాణ, ఏపీలోని 16 నగరాల్లో లీగ్ మ్యాచ్‌లు నిర్వహించామన్న విజయ్.. ఈనెల 10, 11న హైదరాబాద్‌లో సెమీస్, ఫైనల్ జరుగుతాయన్నాడు.

సెమీస్‌లో నిఖత్



సోఫియా (బల్గేరియా): డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ వరుసగా మూడోసారి స్ట్రాంజా బాక్సింగ్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్లో ప్రవేశించింది. గురువారం జరిగిన 50 కిలోల క్వార్టర్స్ బౌట్‌లో నిఖత్ 5-0తో లఖదిరి వాసిల్లా (ఫ్రాన్స్)ను చిత్తు చేసింది. వాసిల్లా ఐరోపా చాంపియన్, పారిస్ ఒలింపిక్స్‌లో తలపడే బాక్సర్ కావడంతో పోరు హోరాహోరీగా సాగుతుందని అంతా భావించారు. అయితే, నిఖత్ పంచ్ పవర్ ముందు వాసిల్లా పూర్తిగా తేలిపోయింది. శనివారం జరిగే సెమీస్ పోరులో స్థానిక బాక్సర్ చుకనోవాతో నిఖత్ తలపడనుంది. ఇక, 66 కిలోల విభాగంలో అరుంధతి చౌధరి కూడా సెమీస్ చేరింది. క్వార్టర్స్‌లో అరుంధతి 5-0తో మిలీనా (సెర్బియా)పై నెగ్గింది.

ట్రోఫీ పంచుకున్నారు



- సంయుక్త విజేతలుగా భారత్, బంగ్లా
- గందరగోళంగా టైటిల్ ఫైట్
- శాఫ్ అండర్-19 మహిళల ఫుట్‌బాల్

ఢాకా: వివాదాస్పద రీతిలో ముగిసిన శాఫ్ అండర్-19 మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత్, బంగ్లాదేశ్ జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. గురువారం నాటకీయ రీతిలో మలుపులు తిరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 1-1 (11-11) స్కోరుతో బంగ్లాదేశ్‌తో సమంగా నిలిచింది. 8వ నిమిషంలో శిబానా దేవి గోల్‌తో భారత్ 1-0తో పైచేయి సాధించింది. కానీ, సెకండాఫ్ ఇంజ్యూరీ టైమ్‌లో సగోరిక గోల్‌తో బంగ్లా 1-1తో స్కోరు సమం చేసింది. దీంతో మ్యాచ్ ఫలితం షూటౌట్‌కు దారి తీసింది. నరాలు తెగే ఉత్కంఠ మధ్య జరిగిన పెనాల్టీ షూటౌట్‌లో ఇరుజట్లూ 5-5తో నిలవడంతో.. సడన్ డెత్ అనివార్యమైంది. అందులో కూడా 6-6తో సమంగా నిలిచాయి. ఈ సమయంలో షూటౌట్ ఆపేసిన రెఫరీ.. రెండు జట్ల కెప్టెన్లనూ పిలిచి టాస్ వేసింది. ఇందులో భారత్‌ను అదృష్టం వరించింది. కానీ, బంగ్లా జట్టు స్టేడియంలోనే నిరసనకు దిగడంతో వాతావరణం మారిపోయింది. మరో వైపు వీక్షకులు కూడా భారత ప్లేయర్లపై నీళ్ల బాటిళ్లు విసురుతూ రచ్చ చేయడంతో మన అమ్మాయిలు స్టేడియం వీడి డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయారు. అనేక తర్జనభర్జనల అనంతరం మ్యాచ్ కమిషనర్.. ఇరుజట్లనూ సంయుక్త విజేతలుగా నిర్ణయించాడు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు ఎదురుకాలేదని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) వర్గాలు తెలిపాయి. తమ సమ్మతితోనే జాయింట్ విన్నర్‌గా ప్రకటించాడని చెప్పాయి.

యువ భారత్‌తో ఫైనల్‌కు ఆసీస్ సై



టామ్ స్ట్రాకర్ (6/24)



ఉత్కంఠ సెమీస్‌లో పాక్ ఓటమి

అండర్-19 ప్రపంచకప్

బెనోని (సౌతాఫ్రికా): అండర్-19 వరల్డ్ కప్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్‌తో పోరుకు ఆస్ట్రేలియా సిద్ధమైంది. గురువారం ఉత్కంఠగా జరిగిన రెండో సెమీఫైనల్లో ఆస్ట్రేలియా వికెట్ తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. మొదట పాకిస్థాన్..పేసర్ టామ్ స్ట్రాకర్ (6/24) ధాటికి 48.5 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. అజాన్ అవైస్ (52), అరాఫత్ మిన్హాస్ (52) హాఫ్ సెంచరీలతో మెరిశారు. ఛేదనలో 49.1 ఓవర్లలో 9 వికెట్లకు 181 పరుగులు చేసిన ఆస్ట్రేలియా విజయం అందుకుంది. హ్యారీ డిక్సన్ (50), ఆలీవర్ పెక్ (49) సత్తా చాటారు. అలీ రజా 4, అరాఫత్ 2 వికెట్లు పడగొట్టారు. స్ట్రాకర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఆదివారం ఇదే వేదికలో భారత్, ఆసీస్ మధ్య టైటిల్ ఫైట్ జరగనుంది. తొలి సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ నెగ్గిన సంగతి తెలిసిందే.

అఖర్లో హైడ్రామా..: మోస్తరు లక్ష్య ఛేదనలో ఆసీస్ ఓపెనర్లు డిక్సన్, సామ్ తొలి వికెట్‌కు 33 పరుగులతో శుభారంభం ఇచ్చారు. ఆపై ఆసీస్ 26 పరుగుల తేడాతో 4 వికెట్లు చేజార్చుకొని 59/4తో నిలిచింది. అయితే డిక్సన్, ఆలీవర్ ఐదో వికెట్‌కు 43 పరుగులు జోడించి ఆదుకున్నారు. అనంతరం క్యాంప్‌బెల్ జతగా ఆలీవర్ ఆరో వికెట్‌కు 44 రన్స్ చేర్చడంతో ఆస్ట్రేలియా కోలుకుంది. కానీ పాక్ బౌలర్లు మళ్లీ విజృంభించడంతో వెంటవెంటనే మూడు వికెట్లు చేజార్చుకున్న ఆస్ట్రేలియా 46 ఓవర్లు ముగిసేసరికి 164/9తో నిలవడంతో మ్యాచ్‌లో ఉత్కంఠ ఏర్పడింది. ఒక్క వికెట్ పడగొడితే పాకిస్థాన్‌దే గెలుపు. అయితే మెక్‌మిలన్, వైడ్లర్ (నాటౌట్ 2) తెలివిగా ఆడుతూ మ్యాచ్‌ను చివరి ఓవర్ వరకూ లాగించారు. ఆఖరి ఓవర్లో మూడు పరుగులు కావాల్సి ఉండగా.. జీషన్ వేసిన తొలి బంతి మక్‌మిలన్ బ్యాటును తాకుతూ లెగ్‌స్టంప్‌ను ముద్దాడినంత పనిచేసి బౌండరీ లైన్ దాటింది. షార్ట్‌ఫైన్ లెగ్ ఫీల్డర్ ఒబైద్ డైవింగ్ చేస్తూ బంతిని ఆపేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. అంతే..ఆస్ట్రేలియా జట్టు సంబరాల్లో మునిగిపోయింది.

సంక్షిప్తస్కోరు

పాకిస్థాన్: 48.5 ఓవర్లలో 179 (అజాన్ 52, అరాఫత్ 52, హస్నేన్ 17, స్ట్రాకర్ 6/24).
ఆస్ట్రేలియా: 49.1 ఓవర్లలో 181/9 (డిక్సన్ 50, పెక్ 49, టామ్ క్యాంప్‌బెల్ 25, మక్‌మిలన్ 19 నాటౌట్, అలీ రజా 4/34, అరాఫత్ 2/20).


అమెరికా సంస్థ ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి ఉత్తమ్

పేదలకు ఉచిత సౌరవిద్యుత్ ఇచ్చేందుకు ముందుకు రావాలి

- ఆ తరహా సంస్థలు ఉంటే సమాచారం అందజేయండి
- అమెరికా సంస్థ ప్రతినిధులతో ఉపముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద వర్గాలకు ఉచితంగా లేదా తక్కువ ధరకు సౌరవిద్యుత్‌ను అందించే సంస్థలు ముందుకు రావాలని, ఆ దిశగా అమెరికాలో ఏమైనా సంస్థలు పనిచేస్తుంటే సమాచారం అందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. సచివాలయంలో గురువారం అమెరికాలోని వాషింగ్టన్ డీసీ కేంద్రంగా పనిచేసే సెంటర్ ఫర్ స్ట్రాటజీస్ సంస్థ ప్రతినిధులతో వారు భేటీ అయ్యారు. భారత్‌లోని అనేక రాష్ట్రాల్లోని విద్యుత్ సంస్థలతో కలిసి పని చేస్తున్నామని ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ రిచర్డ్ రూసో నివేదించారు. కాలానుగుణంగా చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా, టెక్నాలజీని డిస్కమ్‌లు అన్వయం చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. తెలంగాణతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. కాగా పేద వర్గాలకు ఉచితంగా లేదా తక్కువ వ్యయంతో సోలార్‌విద్యుత్‌ను అందించే సంస్థలు ఉంటే ఆ వివరాలను తమకు అందజేయాలని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ కోరారు. విద్యుత్ రంగంలో ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు అందించే సంస్థల సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ది డూప్ ఫైటింగ్: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పదేళ్లుగా కేసీఆర్ కుటుంబానికి సేవ చేసింది చాలని, ఇకపై మోదీ నాయకత్వంలో దేశానికి సేవ చేయడానికి ముందుకు రావాలని సూచించారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు భవిష్యత్ లేదని అన్నారు. ఢిల్లీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీలోనే ఉండదని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసిన వారు ఈ సారి బీజేపీకే ఓటేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్.. డూప్ ఫైటింగ్ చేస్తున్నాయని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ లోపాలకు సంబంధించిన వాస్తవాలు ప్రభుత్వం దగ్గర ఉన్నప్పటికీ.. విచారణ పేరిట సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారని ఆరోపించారు.

మహాలక్ష్మితో 15.21కోట్ల మంది ఉచిత ప్రయాణం

రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం ద్వారా 15.21 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. గతేడాది డిసెంబరు 9న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. సుమారు రెండు నెలల వ్యవధిలో ఉచిత ప్రయాణం ద్వారా మహిళలు చార్జీల కింద రూ.535.52 కోట్లు ఆదా చేసినట్టు సజ్జనార్ వివరించారు. ఈ పథకం అమలుతో ఆర్టీసీ బస్సులో 90 నుంచి 95 శాతం ఆక్యుపెన్సీ రేటు నమోదు అవ్వడం గమనార్హం.

మేడారం జాతరకు రండి

- గవర్నర్‌కు మంత్రి సీతక్క ఆహ్వానం


గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న సీతక్క

ములుగు, ఫిబ్రవరి 8: ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలంలో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు హాజరుకావాలని గవర్నర్ తమిళిసైని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఆహ్వానించారు. రాజ్‌భవన్‌లో గురువారం గవర్నర్‌ను కలిసిన సీతక్క ఆహ్వాన పత్రికతోపాటు చీరను అందజేశారు. కాగా ఈసారి ఆహ్వాన పత్రికలను బాక్స్ రూపంలో ప్రత్యేకంగా తయారు చేయించారు. వనదేవతల గద్దెలను ప్రతిబింబించేలా రూపొందించిన ప్రతిమలు, పసుపు, కుంకుమ, ఆహ్వాన పత్రిక అందులో ఉన్నాయి.

జీహెచ్ఎంసీకి రూ.200 కోట్లు!

- ఏళ్ల అనంతరం సర్కారు నుంచి నిధులు
- మంత్రి సమీక్ష.. మరునాడే ఉత్తర్వులు

హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో అల్లాడుతోన్న జీహెచ్ఎంసీకి ఎట్టకేలకు ఉపశమనం కలిగింది. హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించిన మరునాడే సంస్థకు సర్కారు నిధులు విడుదల చేసింది. పాతబస్తీలో రహదారుల విస్తరణకు సంబంధించిన భూసేకరణ కోసం రూ.200 కోట్లు విడుదల చేస్తూ పురపాలక శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఏర్పాటు అనంతరం రోడ్ల విస్తరణ కోసం ప్రభుత్వం ఈ స్థాయిలో నిధులు విడుదల చేయడం ఇదే ప్రథమం. భారీ ప్రాజెక్టుల బాధ్యతలు అప్పగించిన గత సర్కారు.. సంస్థ ఆర్థిక ఇబ్బందులను పట్టించుకోలేదు. దీంతో అప్పులు చేసి ఆయా పనులను చేపట్టింది. సమీక్షా సమావేశంలో చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని అధికారులు చెబుతున్నారు. పాతబస్తీలో మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ప్రతిపాదించిన 29 రహదారుల విస్తరణలో భాగంగా భూసేకరణకు రూ.200 కోట్లు వినియోగించనున్నారు. దీంతో అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఓల్డ్ సిటీ రోడ్ల విస్తరణలో ముందడుగు పడనుంది.

కొడంగల్- నారాయణపేట్ ఎత్తిపోతల పథకానికి రూ.2,945 కోట్లు

- 3 నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగునీటి కల్పనే లక్ష్యం
- ప్రాజెక్టుకు పరిపాలన అనుమతులు జారీ

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్. పొరుగున ఉన్న నారాయణపేట్, మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగునీటిని అందించడమే లక్ష్యంగా చేపట్టిన కొడంగల్- నారాయణపేట్ ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జా జీవో ఆర్టీ నెంబరు- 14 తో పరిపాలన అనుమతులు గురువారం జారీ చేశారు. ఈ ఎత్తిపోతల పథకానికి రూ. 2,945.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సర్వే, సమగ్ర అధ్యయనం, డిజైన్లు, పర్యవేక్షణ తదితర పనులన్నింటికీ కలిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మహబూబ్‌నగర్ చీఫ్ ఇంజనీర్ చేపట్టాల్సిన పనులపైనా ఆదేశాలు ఇచ్చారు. కాగా, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన సొంత నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి పూనుకున్నారు. అదే క్రమంలో కర్ణాటక సరిహద్దుల్లో ఉంటూ అభివృద్ధికి దూరంగా, కరువు ప్రాంతాలుగా ఉన్న కొడంగల్, నారాయణపేట్, మక్తల్... 3 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ప్రభుత్వం అనుమతులు జారీ చేయటం గమనార్హం.

మురళీధర్‌రావు రాజీనామా



- కార్యదర్శికి అందించిన ఈఎన్‌సీ
- నేడు ఆమోదం.. కొత్త ఈఎన్‌సీ నియామకంపై నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) సి.మురళీధర్‌రావు గురువారం తన పదవికి రాజీనామా చేశారు. కృష్ణా ప్రాజెక్టుల అప్పగింత వివాదంతో పాటు పలు అంశాల నేపథ్యంలో.. రాజీనామా చేయాల్సిందిగా ప్రభుత్వం బుధవారం రాత్రి ఆయన్ను కోరింది. ఈమేరకు.. గురువారం ఉదయం సచివాలయానికి చేరుకున్న ఆయన తన రాజీనామా పత్రాన్ని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందించారు. మరోవైపు రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లును తొలగిస్తూ బుధవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అన్నారం బ్యారేజీ లోపాలపై 2డీ అధ్యయనం కోసం పుణేలోని సీడబ్ల్యూపీఆర్ఎస్‌లో ఉన్న ఆయన.. ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో తన బాధ్యతను దిగువశ్రేణి అధికారులకు శుక్రవారం అప్పగించనున్నారు. ఇక కొత్త ఈఎన్‌సీ నియామకంపై ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకోనుంది. ఈఎన్‌సీ(జనరల్) రాజీనామాను ఆమోదించడంతో పాటు కొత్త ఈఎన్‌సీ(జనరల్), రామగుండం ఈఎన్‌సీ పోస్టులను భర్తీ చేయనుంది. అలాగే పలువురికి స్థానచలనం కల్పించనున్నట్టు సమాచారం. కాగా.. సీనియారిటీపరంగా మురళీధర్‌రావు స్థానంలో.. ఈఎన్‌సీ(అడ్మిన్)గా పనిచేస్తున్న గుమ్మడి అనిల్‌కుమార్‌ను నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకం అంచనా వ్యయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినందుకు గాను ఆయన్ను గత ప్రభుత్వం ప్రాధాన్యం లేని ఈఎన్‌సీ(అడ్మిన్) పోస్టులో కూర్చోబెట్టింది. ఇక.. ఈఎన్‌సీ(జనరల్) పోస్టు కోసం ఈఎన్‌సీ(ఓఅండ్ఎం)గా పనిచేస్తున్న బి.నాగేంద్రరావు కూడా పోటీ పడుతున్నారుగానీ ఆయన పదవీకాలం మూడునెలల్లోనే ముగియనుంది. అనిల్ కుమార్ 2025 అక్టోబరులో పదవీ విరమణ చేయనున్నారు. అంటే.. ఆయనకు 20 నెలల పదవీ కాలం మిగిలి ఉంది. పదవీ కాలం 20 నెలల దాకా ఉండటం... గత ప్రభుత్వంలో పీడనకు గురయ్యారనే సానుభూతి.. ఈయన నియామకానికి అనుకూల అంశాలుగా అధికారులు భావిస్తున్నారు. ఇక రామగుండం ఈఎన్‌సీగా.. ప్రస్తుతం సీఈ(ఎన్‌హెచ్‌పీ)గా పనిచేస్తున్న శంకర్‌నాయక్ లేదా ఆదిలాబాద్ చీఫ్ ఇంజనీర్(సీఈ)గా పనిచేస్తున్న టి.శ్రీనివాస్‌లో ఎవరో ఒకరిని నియమించే అవకాశాలున్నాయి.

ఇక కొలువుల జాతర

తొలగిన అడ్డంకులు.. గురుకులాల ఉద్యోగ ఫలితాల వెల్లడి.. త్వరలో పోలీస్ ఉద్యోగాల భర్తీ పూర్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వివిధ ఉద్యోగ నియామకాలకు ఎదురవుతున్న ప్రధాన అడ్డంకులు తొలగిపోవడంతో వాటి భర్తీ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. తాజాగా గురుకులాల్లో 9,210 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన పరీక్షల ఫలితాలను ప్రకటించిన ప్రభుత్వం.. సుమారు 15 వేల పోలీసు ఉద్యోగాలకు సంబంధించి వారం రోజుల్లో నియామక పత్రాలను అందించాలని నిర్ణయించింది. అలాగే.. గ్రూప్-4 పరీక్షల ఫలితాలు వెల్లడించాలని, గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి తిరిగి నోటిఫికేషన్ జారీ చేయాలని, ఇతర పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఇప్పటి వరకు కొన్ని సాంకేతిక సమస్యలు అడ్డంకిగా ఉన్నాయి. పోస్టుల భర్తీలో మహిళా రిజర్వేషన్ అమలు విషయంలో సంక్లిష్టత ఉండేది. ఈ రిజర్వేషన్ వర్టికల్‌గానా, లేక సమాంతరంగానా అనే అంశంపై సందిగ్ధం ఉంది. తాజాగా రాజస్థాన్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా రిజర్వేషన్లను సమాంతరంగా అమలుపరచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి సర్క్యులర్ జారీచేశారు. ఈ విధానంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి టీఎస్‌పీఎస్సీ, ఇతర నియామక బోర్డులు సన్నద్ధమవుతున్నాయి. ఏడాది లో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం.

గ్రూపు-4 పోస్టులకు తొలగిన అడ్డంకి !

మహిళా రిజర్వేషన్ అమలుపై స్పష్టత రావడంతో.. గ్రూపు-4 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను వెల్లడించాలని టీఎస్‌పీఎస్సీ అధికారులు భావిస్తున్నారు. సుమారు 8,039 గ్రూపు-4 పోస్టుల కోసం ఇప్పటికే పరీక్షలను పూర్తి చేశారు. తుది కీని కూడా ప్రకటించారు. అయితే.. ఫలితాలను విడుదల చేయాల్సి ఉంది. మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి స్పష్టత లేకపోవడంతో వీటిని వెల్లడించలేదు. తాజాగా మహిళా రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో. వీటి ఫలితాలను ప్రకటించడానికి అధికారులు చర్యల్ని తీసుకుంటున్నారు.

గ్రూపు-1 అభ్యర్థులకు మరోసారి పరీక్ష !

ఇప్పటికే రెండుసార్లు ప్రిలిమ్స్ రాసిన గ్రూప్-1 అభ్యర్థులు మరోసారి ఆ పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది. గతంలో ప్రకటించిన 503 పోస్టులకు అదనంగా మరో 60 పోస్టులను జతచేసి, కొత్తగా నోటిఫికేషన్‌ను జారీచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ అప్లై చేయాల్సిన అవసరం లేదు. కొత్తవారు మాత్రం దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా ప్రభుత్వం అవకాశం ఇవ్వబోతున్నది. అలాగే.. అభ్యర్థుల వయో పరిమితిని కూడా రెండేళ్ల పాటు పొడిగించాలని నిర్ణయించారు. గత నోటిఫికేషన్ సమయంలోనే ప్రభుత్వం పదేళ్ల పాటు వయోపరిమితిని పొడిగించిన సంగతి తెలిసిందే. తాజా నిర్ణయం ద్వారా అది 12 ఏళ్లకు పెరగనుంది.

గ్రూపు-2, 3 పోస్టుల పరీక్షలు..

గ్రూపు-2, 3 పోస్టుల భర్తీకి కూడా త్వరలోనే పరీక్షలు నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. మొత్తం 783 గ్రూపు-2 పోస్టుల కోసం సుమారు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. నిజానికి ఈ పరీక్షలను 2023 ఆగస్టు 29, 30 తేదీల్లో నిర్వహించాల్సి ఉన్నప్పటికీ.. పేపర్ లీకేజీ నేపథ్యంలో నవంబరు 2, 3 తేదీలకు వాయిదా వేశారు. ఆ తర్వాత అభ్యర్థుల ఆందోళనతో మళ్లీ జనవరి 6, 7 తేదీలకు వాయిదా వేశారు. కొత్త టీఎస్‌పీఎస్సీ ఏర్పాటు ప్రక్రియ నేపథ్యంలో జనవరిలోనూ ఈ పరీక్షలు జరగలేదు. ఇక.. సుమారు 1,363 గ్రూపు-3 పోస్టుల కోసం 5.8 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షల తేదీలను త్వరలోనే ప్రకటించనున్నారు. వీటితోపాటు.. ఇతర పోస్టుల భర్తీ విషయంలోనూ త్వరగా నిర్ణయం తీసుకోవాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది. ఇందులో ముఖ్యంగా లైబ్రేరియన్లు(71), డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు (18), ఇంటర్మీడియెట్ జూనియర్ లెక్చరర్లు(1392), అసిస్టెంట్ ఇంజనీర్లు(833), వెటర్నరీ సర్జన్లు(185), టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ (175), ఉద్యాన అధికారులు, అకౌంట్స్ ఆఫీసర్స్ తదితర పోస్టులున్నాయి.

త్వరలోనే డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం త్వరలోనే మెగా డీఎస్సీని ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 5,089 టీచర్ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీని ప్రకటించిన సంగతి తెలిసిందే. వాటికి మరికొన్ని పోస్టులను జోడించి మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గతంలో ప్రకటించిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 1,739, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 2,575, భాషాపండిట్ పోస్టులు 611, పీఈటీ పోస్టులు 164 ఉన్నాయి. వాటికి మరో 6వేల పోస్టులను జత చేసి, మెగా డీఎస్సీ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఒకే మార్కులు వస్తే స్థానికతకు ప్రాధాన్యం

పోటీ పరీక్షల్లో అభ్యర్థులకు సమాన మార్కులు వస్తే.. స్థానికతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. తెలంగాణ స్థానికత ఉన్న అభ్యర్థికి మెరుగైన ర్యాంకును ఇస్తామని.. ఇద్దరి స్థానికతా ఒకటే అయితే అభ్యర్థి వయసుకు ప్రాధాన్యమిస్తామన్నారు. స్థానికత, పుట్టిన తేదీ ఒకటే అయితే.. ఆయా సబ్జెక్టుల్లోని మార్కుల ఆధారంగా నిర్ణయం తీసుకుంటారు. అప్పటికీ తేలకపోతే.. ఉన్నత విద్యను, ఉన్నత విద్యలో సాధించిన మార్కులశాతాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. వాటిలోనూ సమానంగా ఉంటే కమిషన్‌దే తుది నిర్ణయం అవుతుంది.

9,210 గురుకుల పోస్టుల భర్తీ వేగిరం

- పీడీలు, లైబ్రేరియన్లు, పీజీటీ పోస్టులకు 1:2 నిష్పత్తిలో ఫలితాలు విడుదల చేసిన ట్రిబ్
- నేటి నుంచి ధ్రువ పత్రాల తనిఖీ
- హారిజాంటల్ విధానంలోనే ఉద్యోగాల భర్తీ

హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సాధారణ గురుకులాల్లోని 9,210 పోస్టులను హారిజాంటల్ విధానంలోనే భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయా శాఖలకు మెమో జారీ చేసింది. సర్కారు నుంచి స్పష్టత రావడంతో తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) గురువారం తెల్లవారుజామున 3 గంటలకు డిగ్రీ, జూనియర్ కళాశాలల్లోని ఫిజికల్ డైరెక్టర్ (పీడీ), లైబ్రేరియన్ పోస్టుల ఫలితాలను 1:2 నిష్పత్తిలో వెల్లడించింది. అభ్యర్థుల మార్కుల ఆధారంగా మెరిట్ జాబితాలను వెబ్‌సైట్‌లో ఉంచింది. అలాగే గురుకుల పాఠశాలల్లోని పీడీ, లైబ్రేరియన్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను గురువారం రాత్రి వెల్లడించింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను శుక్రవారం నుంచి పరిశీలించనున్నట్లు బోర్డు పేర్కొంది. కానీ, ట్రిబ్ సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో జాబితాను పరిశీలించుకునేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు అభ్యర్థులకు ఫోన్లు చేయడంతోపాటు మెసేజ్‌లు పంపుతున్నారు. కాగా, గురుకుల డిగ్రీ, జూనియర్ కాలేజీ పీడీ, లైబ్రేరియన్ పోస్టులకు ఎంపికైనవారి పత్రాలను ఉదయం 9 నుంచి హైదరాబాద్ చైతన్యపురిలోని (ఎల్బీ నగర్ దగ్గర, మెట్రో పిల్లర్ 1570 వద్ద) ఎస్సీ మహిళా 'లా' కాలేజీ ప్రాంగణంలో పరిశీలించనున్నట్టు బోర్డు తెలిపింది. పాఠశాల పీడీ, లైబ్రేరియన్, పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను శుక్ర, శని వారాల్లో పరిశీలించనున్నారు. పోస్టులకు అవసరమైన అర్హతలు లేకపోవడంతో.. 1:2 నిష్పత్తి మేర అభ్యర్థులు లేరని బోర్డు అధికారుల ద్వారా తెలిసింది. కాగా, శని, ఆది, సోమ వారాల్లో ట్రిబ్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. డిగ్రీ, జూనియర్ లెక్చరర్, డ్రాయింగ్, ఆర్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్, క్రాఫ్ట్ , మ్యూజిక్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ ఉద్యోగాలకు మెరిట్ జాబితాలు రావాల్సి ఉంది.

టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డిని తప్పించాలి

- నేనూ.. తెలంగాణ సగటు ఆడబిడ్డనే..
- తెలంగాణ తల్లి విగ్రహం, గీతం గురించి సీఎం వ్యాఖ్యలు హాస్యాస్పదం:కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ మహేందర్ రెడ్డిపై జ్యుడిషియల్ విచారణ జరిపించాలని, ఆయన్ను పదవి నుంచి తప్పించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ అంశంపై గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి యువతకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. రిటైర్డ్ అధికారులను కేసీఆర్ ఆయా పోస్టుల్లో నియమిస్తే విమర్శించిన కాంగ్రెస్.. ఇప్పుడదే పనిచేస్తోందని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో ఉన్న వారిని టీఎస్‌పీఎస్సీ సభ్యులుగా నియమించబోమన్న సీఎం.. టీడీపీలో పనిచేసిన రజనీకుమారిని ఎలా నియమించారని నిలదీశారు. 'ఉద్యమ సమయంలో జై తెలంగాణ అని అనని వ్యక్తి.. ఇప్పుడు తెలంగాణ తల్లి, రాష్ట్ర గీతం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. నేను కూడా తెలంగాణ సగటు ఆడబిడ్డనే కదా.. నేనెట్లుంటా.. మిగతా ఆడబిడ్డలు ఎట్లుంటరు.. గట్లే తెలంగాణ తల్లి విగ్రహం ఉంటది. ఆ విగ్రహం నాలా ఉందనడం సరికాదు. సీఎం రేవంత్ పర్సనల్‌గా కేసీఆర్ కుటుంబం పట్ల విద్వేషాన్ని పెట్టుకొని.. నిర్ణయాలు తీసుకుంటున్నారు' అని అన్నారు. ఢిల్లీలో ఓ మాజీ న్యాయమూర్తి వద్ద పనిచేసిన వ్యక్తి కోసం కొత్త పోస్టు సృష్టించి అసెంబ్లీకి సలహాదారుడిగా నియమించడం వెనుక ఉద్దేశం ఏమిటని కవిత ప్రశ్నించారు. సీఎం రేవంత్ తన వ్యక్తిగత కేసులలో వాదించిన దేవనాసైగల్‌ను సుప్రీంకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా, తేరా రజినీకాంత్ రెడ్డిని అదనపు అడ్వొకేట్ జనరల్‌గా నియమించారని ఆరోపించారు. వ్యక్తిగత బృందాన్ని కోర్టుల్లో నియమించడం అధికార దుర్వినియోగమేనని మండిపడ్డారు.

సాగునీటి శాఖలో ఎన్నికల టెండర్లు రద్దు!

(మొదటి పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. రూ.10 వేల కోట్లతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టడమే కాకుండా గ్రావిటీతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని ప్రతిపాదించింది. దాంతో, చెన్నూరు ఎత్తిపోతల పథకం కథ క్లోజ్ కానుంది. చిన్నా పెద్దా కలిపి మొత్తంమీద 69 టెండర్లను రద్దు చేసి కొత్త ప్రాజెక్టులకు టెండర్లను పిలవనున్నారు. ఇప్పటికే టెండర్లు దక్కించుకొని అడ్వాన్సుగా అభ్యర్థులకు ముడుపులు కూడా చెల్లించుకున్న కాంట్రాక్టర్లు, తాజా నిర్ణయంతో గగ్గోలు పెడుతున్నారు. వాస్తవానికి, ఈ టెండర్లన్నింటినీ ఎక్సెస్ ధరతో సదరు కాంట్రాక్టర్లకు కట్టబెట్టారు. ఒక్కో టెండర్‌ను 4.5 శాతం నుంచి 4.6 శాతం రేట్లు పెంచి మరీ కట్టబెట్టారు. తద్వారా, 10 శాతం మేర అభ్యర్థులకు ఖర్చు పెట్టాలని కాంట్రాక్టర్లకు నిర్దేశించారని, దానిని కూడా రెండు వాయిదాల్లో చెల్లింపులు చేయాలని సూచించారని ప్రచారం జరిగింది. అందులో 5 శాతాన్ని ఎన్నికల ముందే అప్పజెప్పి.. మళ్లీ అధికారంలోకి వచ్చి.. పనులు చేపడితే మిగిలిన 5 శాతాన్ని ఇవ్వాలనే విధంగా వీరితో మౌఖిక ఒప్పందాలు జరిగాయని తెలుస్తోంది. అయితే, ముడుపులు తీసుకున్న వారంతా ఓడిపోవడం, ప్రభుత్వం కూలిపోవడంతో అడ్వాన్స్ కింద చెల్లించిన మొత్తాలను తిరిగి రాబట్టుకోవడం దైవాధీనంగా మారింది. ఇప్పుడు ఏకంగా టెండర్లను రద్దు చేయడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని కాంట్రాక్టర్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అంచనా వ్యయం రూ.55,086 కోట్లు. కాగా.. గత ఏడాది నవంబరు దాకా రూ.27,553 కోట్లు ఖర్చు చేశారు. అయినా.. ఒక్క ఎకరా కొత్త ఆయకట్టుకు కూడా నీరివ్వలేదు. అలాగే, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణ అంచనా వ్యయం రూ.1,27,872 కోట్లు కాగా.. దీనికి 2023 నవంబరు దాకా రూ.93,872 కోట్లు ఖర్చు పెట్టారు. అయితే, ఇప్పటిదాకా ఈ ప్రాజెక్టు హెడ్ వర్క్‌గా భావించే కన్నెపల్లి (మేడిగడ్డ) పంప్‌హౌస్ నుంచి ఐదేళ్లలో ఎత్తిపోసిన నీళ్లు 160 టీఎంసీలు మాత్రమే. ఇక, సాగునీరు అందింది కేవలం 1.62 లక్షల ఎకరాలకేనని తాజా లెక్కలతో తేల్చారు. అలాగే, సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మ బ్యారేజీ బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ.16,438 కోట్లు కాగా.. రూ.8,186 కోట్లు ఖర్చు చేశారు. అయినా, ఒక్క ఎకరా కూడా సాగులోకి రాలేదని తేల్చారు. గడిచిన పదేళ్లలో రూ.1.82 లక్షల కోట్లు వెచ్చించగా.. కేవలం 17.24 లక్షల ఎకరాలే సాగులోకి వచ్చినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో, తక్కువ వ్యయం-ఎక్కువ ఆయకట్టు సూత్రంతో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఖర్చు చేయాలని నిర్ణయించింది


రద్దు చేయనున్న టెండర్లు	వాటి విలువ
పాలమూరు-రంగారెడ్డిలో వట్టెం కెనాల్ ప్యాకేజీ-1	రూ.455 కోట్లు
వట్టెం కెనాల్ ప్యాకేజీ-2	రూ.400 కోట్లు
కరివెన రీచ్-1	రూ.487 కోట్లు
కరివెన రీచ్-2	రూ.764 కోట్లు
ఉద్దండపూర్ లెఫ్ట్ మెయిన్‌కెనాల్	రూ.636 కోట్లు
ఉద్దండపూర్ రైట్ మెయిన్‌కెనాల్	రూ.870 కోట్లు
ప్యాకేజీ-1	రూ.901 కోట్లు
ప్యాకేజీ -2	రూ.704 కోట్లు
ప్యాకేజీ-3	రూ.536 కోట్లు
ప్యాకేజీ-4	రూ.525 కోట్లు
ప్యాకేజీ-5	రూ.377 కోట్లు
మొత్తం	రూ.6,655 కోట్లు
చెన్నూరు ఎత్తిపోతల పథకం	రూ.1,658 కోట్లు
చెక్‌డ్యామ్‌లు, ఇతర పనులు	రూ.564 కోట్లు
మొత్తం	రూ.8,877 కోట్లు

ప్రాజెక్టులే కాదు.. చెక్‌డ్యామ్‌లు కూడా..

అసెంబ్లీ ఎన్నికల ముందు గత ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా చెక్‌డ్యామ్‌లను మంజూరు చేసింది. అవసరం ఉన్నా లేకున్నా వీటికి పరిపాలన అనుమతులు ఇచ్చింది. ప్రాజెక్టులు లేనిచోట శాసనసభ్యులకు చెక్‌డ్యామ్‌లతో ఆదాయం సమకూర్చాలని ఇబ్బడిముబ్బడిగా టెండర్లు పిలిచి కట్టబెట్టారు. అయితే, వీటి పనులేవీ ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలోనే, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారు రూ.500 కోట్లకుపైగా విలువ చేసే చెక్‌డ్యామ్‌ల టెండర్లు రద్దు చేయనుంది. వాస్తవానికి, ప్రధాన రిజర్వాయర్లకు నదుల ద్వారా వరదలతో పూడిక చేరకుండా అడ్డుకోవడం, భూగర్భ జలాల పెంచడమే చెక్‌డ్యామ్‌ల ప్రధాన ఉద్దేశం. కానీ, గత ప్రభుత్వం మంజూరు చేసిన చెక్‌డ్యామ్‌లన్నీ ఎమ్మెల్యేలకు ఎన్నికల ఖర్చును కూడబెట్టడానికి సంబంధించిన వేనని ప్రభుత్వం గుర్తించింది. దాంతో నిర్దేశిత ప్రయోజనాలు చేకూర్చని పనులకు స్వస్తి పలికే పనిలో ఉంది.

కూల్చితే కూలడానికి కాంగ్రెస్.. కాళేశ్వరం కాదు

- 130 ఏళ్ల పునాది కాంగ్రెస్ పార్టీది
- అంతర్యుద్ధం బీఆర్ఎస్‌లోనే
- తోపు అన్న కేసీఆర్ కామారెడ్డిలో ఎందుకు తుస్సుమన్నడు
- వేముల ప్రశాంత్‌రెడ్డిపై జగ్గారెడ్డి ఫైర్
- నాకు పదవులు అవసరం లేదు
- కాంగ్రెస్‌కు నేనే ఒక వెపన్ అని వెల్లడి



హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): " మా ప్రభుత్వాన్ని కూలుస్తమంటున్నరు. కూలిస్తే కూలడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏమైనా మీరు కట్టిన కాళేశ్వరం అనుకుంటున్నారా? నాసిరకం సిమెంట్‌తో కట్టింది కాదు. 130 ఏళ్ల పునాది ఉన్న పార్టీ.! మా మీద మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడితే మంచిది" అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి హెచ్చరించారు. తొమ్మిదేళ్ల సీఎంగా చేసిన వ్యక్తి... పెద్ద తోపు అన్న కేసీఆర్.. కామారెడ్డిలో ఎందుకు తుస్సుమన్నడని ప్రశ్నించారు. హరీశ్‌రావు దగ్గర కాళేశ్వరం డబ్బులు ఉన్నాయి కాబట్టి.. సంగారెడ్డిలో రూ.60 కోట్లు పంచి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకున్నాడని ఆరోపించారు. తన దగ్గరా రూ.60 కోట్లు ఉంటే.. బీఆర్ఎస్‌కు అక్కడ డిపాజిట్ కూడా దక్కేది కాదన్నారు. ఎమ్మెల్యేగా గెలవలేని జగ్గారెడ్డి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఏం టచ్ చేస్తడంటూ ప్రశాంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఈ మేరకు స్పందించారు. గాంధీ భవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. తాను బీఆర్ఎస్ టార్గెటెడ్ లీడర్‌నని జగ్గారెడ్డి చెప్పారు. తనతో పాటుగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వంటి వాళ్లు టార్గెటెడ్ లీడర్లుగా ఉన్నారన్నారు. తమలాంటి వారి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ రూ.60 కోట్ల వరకు ఖర్చు చేసిందన్నారు. ఆ పార్టీ దగ్గర కాళేశ్వరం డబ్బులు ఉన్నాయని, తమ దగ్గర అప్పులు తప్ప ఏమున్నాయన్నారు. హరీశ్‌రావు నల్లధనం ఎక్కడ పెట్టారో సీఎం రేవంత్‌రెడ్డికి చెబుతానని, అన్ని లెక్కలూ బయటికి రావాలని అన్నారు. ఎదుటి వాడు ఏమంటాడో ప్రశాంత్‌రెడ్డి ఆలోచించి మాట్లాడాలని, ఎక్కువ మాట్లాడితే అన్నీ బయటికి తీస్తామన్నారు. " బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు సీఎంను కలవగలిగేవారా? కేటీఆర్, హరీశ్‌రావు దగ్గరికి పోయేవాళ్లు. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వచ్చినా మా సీఎం కలుస్తున్నడు" అన్నారు. కుట్రలు చేస్తే.. 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వచ్చి తీరుతారన్నారు. జగ్గారెడ్డికి పదవులు అవసరం లేదని, కాంగ్రెస్ పార్టీకి తానే ఒక ఆయుధమని చెప్పారు. ఆయుధానికి పదవులు అవసరం లేదన్నారు. " మీకు పోస్టులు ఉంటేనే లీడర్లు. నేను బ్యాక్‌గ్రౌండ్ లేకుండానే లీడర్ అయ్యా. జగ్గారెడ్డి అంటే బ్రాండ్. మీలెక్క ఎవరి పేరో చెప్పి నాయకుడిని కాలేదు" అంటూ ప్రశాంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. అంతర్యుద్ధం కాంగ్రెస్ పార్టీలో కాదు.. బీఆర్ఎస్‌లోనే జరిగి తీరుతుందన్నారు. కేసీఆర్‌కు వెనక నుంచి గడ్డపార గుచ్చడానికి హరీశ్‌రావు సిద్ధంగా ఉన్నాడన్నారు. ముస్లింలు, ఎస్టీలకు ఇస్తానన్న రిజర్వేషన్, నిరుద్యోగ భృతి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తమ పైన రాజకీయ బురద చల్లితే.. ఊరుకోమని, వారు అమలు చేయని హామీలపైనా వారిని నిలదీస్తామని స్పష్టం చేశారు. ప్రోటోకాల్ ఇవ్వడం విషయంలో.. బీఆర్ఎస్ పార్టీ చూపిన దారిలోనే తామూ నడుస్తున్నామన్నారు. కేసీఆర్ రాసిన స్క్రిప్టు చదవడం తప్ప ప్రశాంత్‌రెడ్డికి ఏమీ తెలియదని ఎద్దేవా చేశారు.

నేను హోంమంత్రినైతే..
బీఆర్ఎస్ వాళ్లను కంట్రోల్ చేస్తా

- వాళ్లను జైలుకు పంపాలన్నది నా కోరిక
- మీడియాతో చిట్‌చాట్‌లో రాజగోపాల్‌రెడ్డి
- మీ లాగే మాకూ ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతోంది!
- మంత్రి పదవిపై కేటీఆర్‌తో రాజగోపాల్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు హోంమంత్రి పదవిపై ఆశలున్న విషయాన్ని బహిర్గతం చేశారు. గురువారం ఆయన అసెంబ్లీ ఆవరణలో.. లాబీల్లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. "నాకు హోం మంత్రి కావాలని ఉంది. హోంమంత్రినైతే.. బీఆర్ఎస్ వాళ్లను కంట్రోల్ చేస్తా..! ఆ పార్టీ వాళ్లను జైలుకు పంపాలన్నది నా కోరిక" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత మంత్రి వర్గ విస్తరణ ఉంటుందన్న ఆయన.. అధిష్ఠానం నుంచి తనకు హామీ కూడా ఉందన్నారు. కేసీఆర్‌ను గద్దె దించేందుకే తాను కాంగ్రెస్‌లోకి వచ్చానన్నారు. తాను హోంమంత్రి అయితే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్, సంతోష్, జగదీశ్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. భువనగిరి, నల్లగొండ లోక్‌సభ స్థానాల నుంచి తమ కుటుంబ సభ్యులెవరూ పోటీ చేయకూడదన్నదే తమ ఆలోచన అన్నారు. పార్టీ ఆదేశిస్తే మాత్రం పోటీ చేస్తామన్నారు. ఎవరికి టిక్కెట్ ఇచ్చినా గెలిపిస్తామన్నారు.

కేటీఆర్.. కోమటిరెడ్డి ముచ్చట్లు

అసెంబ్లీ లాబీల్లో రాజగోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారి మధ్య ఆసక్తికర సంభాషణ కొనసాగింది. "మీకు మంత్రి పదవి ఎప్పుడొస్తుంది..?" అని కేటీఆర్ ప్రశ్నించడంతో.. రాజగోపాల్‌రెడ్డి వ్యంగ్యాన్ని జోడిస్తూ సమాధానమిచ్చారు. "మాకు కూడా మీలాగే ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతోంది"అని వివరించారు. దానికి కేటీఆర్ స్పందిస్తూ.. "ఫ్యామిలీ పాలన కాదు. బాగా పనిచేస్తే కీర్తి ప్రతిష్ఠలు వస్తాయి" అని వ్యాఖ్యానించారు. "ఎంపీగా మీ కూతురు కీర్తి పోటీ చేస్తుందా? లేక కుమారుడు సంకీర్త్ పోటీలో ఉంటాడా?" అని కేటీఆర్ అడగడంతో.. "దయ చేసి నన్ను వివాదాల్లో లాగమాకు..!" అంటూ రాజగోపాల్‌రెడ్డి వెళ్లిపోయారు.

పార్టీని అర్థం చేసుకునేసరికి
మా పదవీకాలం అయిపోతుందేమో..!!

- మీడియాతో చిట్‌చాట్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మా పార్టీ నాయకత్వాన్ని అర్థం చేసుకునేసరికే మా పదవీ కాలం పూర్తయిపోతుందేమో.. మీడియాతో చిట్ చాట్ సందర్భంగా కొందరు బీజేపీ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్య ఇది. కృష్ణా జలాల వివాదం-ప్రాజెక్టుల అప్పగింతపై శాసనసభలో పార్టీ వైఖరి ఎలా ఉండాలి? అనే అంశంపై గురువారం సభ ప్రారంభమయ్యే వరకు ఎమ్మెల్యేలకు సమాచారం లేదు. దీంతో కొంత ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొన్నామని ఒకరిద్దరు ఎమ్మెల్యేలు వాపోయారు. ఈ అంశంపై వారు కొద్దిసేపు పరస్పరం చర్చించుకున్నారు. అప్పటికే గవర్నర్ ప్రసంగం ప్రారంభం కావడంతో హడావుడిగా సభలోకి వెళ్లిపోయారు. కాగా, గవర్నర్ ప్రసంగంలో కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రస్తావన లేదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శంకర్ విలేకరులతో మాట్లాడారు. గవర్నర్ స్థాయి దిగజార్చే విధంగా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్లు.. కవిత మాటలు

- మహేందర్‌రెడ్డి లిక్కర్ స్కాం చేశారా?: కొండా సురేఖ



'టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి.. మీలాగా ఏమైనా లిక్కర్ స్కామ్ చేశారా? పరీక్షల పేపర్లు లీక్ చేశారా?' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై మంత్రి కొండా సురేఖ ఫైర్ అయ్యారు. కవిత విమర్శలు చూస్తుంటే.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడుతూ.. 36 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పనిచేసిన సీనియర్ అధికారి అయినందునే మహేందర్‌రెడ్డిని టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించిందని చెప్పారు. ఆయన సమర్థుడు కాకపోతే.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో డీజీపీగా ఎందుకు నియమించారని, అప్పుడు ఆయన అవినీతి గుర్తుకురాలేదా?అని ప్రశ్నించారు. 'అదనపు అడ్వకేట్ జనరల్‌గా కార్యదక్షత కలిగిన రజినీకాంత్ రెడ్డిని నియమిస్తే... ఆమె ఎందుకు భయపడుతున్నారు. తరుచూ మీడియాలో ఉండాలనే కోరికతో కాంగ్రెస్ ప్రభుత్వం మీద అబద్ధపు ప్రచారాలు చేస్తే ఊరుకోబోం' అని వ్యాఖ్యానించారు.

ఎంపీగా పోటీ చేసే ఆసక్తి లేదు: రాజాసింగ్

పార్లమెంటు ఎన్నికల్లో తనకు ఎంపీగా పోటీ చేసే ఆసక్తి లేదని బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పష్టంచేశారు. జహీరాబాద్ నుంచి పోటీ చేయడంపై పార్టీనాయకులు తనను సంప్రదించిన మాట వాస్తవమేనని వెల్లడించారు. బండి సంజయ్ కోసం కరీంనగర్‌లో, కిషన్‌రెడ్డి కోరితే సికింద్రాబాద్‌లో ప్రచారం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అధిష్ఠానం బీజేఎల్పీ నేతను త్వరగా ప్రకటిస్తే బాగుంటుందన్నారు. ఈ పదవిపై తనకు ఆసక్తి లేదని చెప్పారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ సీఎం నినాదంతో ప్రజల వద్దకు వెళ్లామని, అది సాధ్యం కాలేదు కాబట్టి పార్టీ శాసనసభాపక్ష నేతగా బీసీ నేతను నియమించడం సబబన్నది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు.

బడ్జెట్ సమావేశాలు 4 రోజులేనా ?: కడియం

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను 13వ తేదీకే ముగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నట్లు బీఏసీ సమావేశంలో స్పష్టమైందని, సభ కేవలం నాలుగు రోజులే నిర్వహిస్తే ఎలా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై చర్చ జరుగుతుందనే భయంతోనే అధికార పార్టీ బడ్జెట్ సమావేశాలను త్వరగా ముగిస్తుందని ఆరోపించారు. సభ ఎక్కువ రోజులు జరిగితే... ఆరు గ్యారెంటీలతోపాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలపై చర్చ జరుగుతుందనే భయంతోనే సమావేశాలను త్వరగా ముగిస్తున్నారని ఆరోపించారు.

బడ్జెట్ ఆమోదం కోసం నేడు మంత్రి వర్గ భేటీ

బడ్జెట్ ఆమోదం కోసం రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు ముగిశాక..అసెంబ్లీ ప్రాంగణంలోని కమిటీ హాలులో సమావేశం కావాలని నిర్ణయించింది. సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో బడ్జెట్‌ను ఆమోదిస్తారు. మంత్రివర్గం ఆమోదించాక..బడ్జెట్ ప్రతిని గవర్నర్‌కు పంపి ఆమోదం తీసుకుంటారు. శనివారం సదరు బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెడతారు.

సభకు కేసీఆర్ గైర్హాజరు..!

- వస్తారని భావించిన రాజకీయవర్గాలు
- అయినప్పటికీ రాని బీఆర్ఎస్ అధినేత
- బడ్జెట్ ప్రవేశపెట్టేరోజు వచ్చే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గురువారం చేపట్టిన అసెంబ్లీ సమావేశానికి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు గైర్హాజరయ్యారు. అసెంబ్లీ ప్రారంభానికి రెండు రోజుల ముందు నుంచి ఆయన సభకు వస్తారా..? రారా..? అనే అంశంపై రాజకీయ వర్గాల్లో జరిగిన చర్చల్లో ఆయన వస్తారనే అందరూ భావించారు. కానీ కేసీఆర్ సభకు రాలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక చేపట్టిన తొలి అసెంబ్లీ సమావేశాలకు ఆయన అనారోగ్యం కారణంగా హాజరు కాలేకపోయారు. కాగా ఇటీవలే కేసీఆర్ బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చి, పార్టీ నేతలతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలు, అదీ బడ్జెట్‌కు సంబంధించినవి కావడంతో బీఆర్ఎస్ అధినేత పాల్గొంటారని అందరూ భావించారు. అయినప్పటికీ ఆయన హాజరు కాలేదు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సంబంధించి ఈనెల 13 వరకు రోజువారీ షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో.. బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు కేసీఆర్ వస్తారని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

బస్సులో బల్మూరు.. ఆటోలో కౌశిక్





హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశాల తొలిరోజైన గురువారం అసెంబ్లీ గేటు బయట ఆసక్తికరమైన దృశ్యాలు కనిపించాయి. రేవంత్ సర్కారు ప్రవేశపెట్టిన 'ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం' గురించి వారి అభిప్రాయాలు తెలుసుకునేందుకు అధికార పక్ష ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ బస్సులో అసెంబ్లీకి వస్తే.. ఆ ఉచిత ప్రయాణ పథకం కారణంగా ఆటోవాలాలు కష్టాల్లో పడ్డారంటూ వారికి మద్దతుగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆటోలో వచ్చారు. బల్మూరు.. నాంపల్లిలో బస్సెక్కి అసెంబ్లీ బస్టాప్‌లో దిగారు. ఆ తర్వాత అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. ఆయన బస్సులో వస్తున్న క్రమంలో మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక కౌశిక్‌రెడ్డి వచ్చిన ఆటోను అసెంబ్లీ గేటు బయటే పోలీసులు నిలిపివేశారు. కొద్దిసేపటికి ఆటోను బయటే నిలిపి, కౌశిక్ నడుచుకుంటూ గేటు దాటుకొని లోపలికి వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాకంతో రాష్ట్ర వ్యాప్తంగా 21 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యకు పాల్పడారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా తాను ఆటోలో అసెంబ్లీకి వచ్చినట్లు కౌశిక్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని లక్షల మంది ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

ఆ రోజులు అంతమయ్యాయి

(మొదటిపేజీ తరువాయి)


ఇటీవలి ఎన్నికలు నిలిచాయన్నారు. తమ ఆకాంక్షలు ప్రతిబింబించేలా నిజమైన స్వాతంత్ర్య, ప్రజాస్వామ్య పరిపాలనను రాష్ట్ర ప్రజలు కోరుకున్నారని, అందుకే, వారి విజ్ఞతను అభినందిస్తున్నానని అన్నారు. ఎన్నికల్లో వారి తీర్పు పౌర హక్కులకు, ప్రజాస్వామిక పాలనకు నిదర్శనమన్నారు. బడ్జెట్ సమావేశాల తొలి రోజు శాసనసభ, శాసన మండలి సభ్యులను ఉద్దేశించి గురువారం అసెంబ్లీలో ఆమె ప్రసంగించారు. "రాష్ట్ర ప్రజలు మాపై ఉంచిన నమ్మకానికి, విశ్వాసానికి కృతజ్ఞతతో ఉన్నాను. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి ఫిర్యాదులను స్వీకరించడానికి ప్రజా భవన్ ఎల్లవేళలా తెరిచే ఉంటుంది. తెలంగాణలో ఇప్పుడు ప్రజల కోసం ప్రజల ద్వారా ప్రజా పాలన జరుగుతోంది" అని గవర్నర్ వ్యాఖ్యానించారు. నిజమైన ప్రజాస్వామ్య నిబద్ధతతో ప్రజలకు సేవకులుగా ఉంటామని పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందిస్తున్నానన్నారు. ప్రజా పాలన ఉట్టిపడేలా ప్రభుత్వం ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం ప్రజలు తమ ఇబ్బందులను చెప్పుకోవడానికి సరైన వేదిక అని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలించడమే తమ లక్ష్యమని చెప్పారు. ఇచ్చిన హామీకి కట్టుబడి ఆరు గ్యారెంటీలను నిర్దిష్ట గడువులోగానే తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఆరు గ్యారెంటీల్లో రెంటింటిని ఇప్పటికే అమలు చేశామని, మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామని, ఇప్పటికే 15 కోట్ల మంది ఈ పథకాన్ని ఉపయోగించుకున్నారని తెలిపారు. త్వరలోనే మరో రెండు గ్యారంటీలు అమల్లోకి వస్తాయని, రూ.500కే గ్యాస్ సిలిండర్, అర్హులకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు పథకాలను ప్రారంభిస్తామని చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసిన టీఎస్‌పీఎస్సీ ద్వారా 2 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ధరణి కమిటీ ద్వారా భూమికి సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత తదితర హామీలనూ నిర్దిష్ట గడువులోగా అమలు చేస్తామని, రైతులు, యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇచ్చిన వాగ్దానాలకు కూడా కట్టుబడి ఉన్నామన్నారు. వెనుకబడిన తరగతుల సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను అంచనా వేయడానికి అవసరమైన సమాచారాన్ని సేకరించే ఉద్దేశంతో కులగణనను చేపట్టాలని నిర్ణయించిందన్నారు. తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన వారందరికీ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలియజేస్తోందని అన్నారు. ప్రత్యేకించి అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కృషిని గుర్తు చేసుకుంటున్నామని, రాష్ట్ర ఏర్పాటు వంటి చరిత్రాత్మక ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన సోనియా గాంధీకి తన ప్రభుత్వం రుణపడి ఉంటుందని చెప్పారు.



అసెంబ్లీకి చేరుకున్న గవర్నర్ తమిళిసైను పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజలపై భారం మోపకుండా..

పాలమూరు-రంగారెడ్డి వంటి సాగునీటి ప్రాజెక్టుల నుంచి విద్యా రంగం వరకూ తమ భవిష్యత్తు ప్రణాళికలో ఉన్నాయని గవర్నర్ వ్యాఖ్యానించారు. హైదరాబాదుకు గత వైభవాన్ని పునరుద్ధరించాలని, రాష్ట్రమంతటా అభివృద్ధిని వికేంద్రీకరించాలన్న లక్ష్యాలను పెట్టుకున్నామని చెప్పారు. ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకతను పునరుద్ధరించడానికే ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రాన్ని విడుదల చేశామని, ప్రభుత్వ వనరులను గత ప్రభుత్వం ఎంత అసమర్థంగా, నిర్లక్ష్యంగా వినియోగించిందో స్పష్టంగా పేర్కొన్నామని తెలిపారు. గత ప్రభుత్వానికి ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే.. పదేళ్ల తర్వాత అప్పుల రాష్ట్రాన్ని అప్పగించారని, ప్రజలపై భారం మోపకుండా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడమే తమకు తక్షణ సవాలని చెప్పారు. "గత దశాబ్ద కాలంలో నష్టపోయిన సంస్థలను తిరిగి కోలుకునేలా చేస్తాం. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థ విలువలను పునరుద్ధరిస్తాం. అందుబాటులో ఉంటూ, రాజ్యాంగ సూత్రాలను పాటిస్తాం. టీఎస్‌పీఎస్సీ, ఎస్‌హెచ్ఆర్సీ, సమాచార కమిషన్, విశ్వవిద్యాలయాలు వంటి సంస్థలకు స్వేచ్ఛను కల్పిస్తాం" అని వివరించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వాతావరణ మార్పుల నుంచి మార్కెట్ ఒడిదుడుకుల వరకు వారు ఎదుర్కొనే ప్రతి సవాలును గుర్తించి వారి అభివృద్ధికి దోహదపడే పటిష్ఠ విధానాలను అమలు చేస్తామని తెలిపారు. రైతు భరోసా, రుణాల మాఫీ, పంట మార్పిడి, ఉద్యానవన అభివృద్ధి, నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులతో రైతాంగ సాధికారతను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.



సభా పర్వం

ఎంఎస్ఎంఈలకు నూతన విధానం

సామర్థ్య పెంపు, ఆర్థిక సహాయం, మార్కెట్ సౌలభ్యం, పారిశ్రామిక ఖాయిలాల నివారణకు తోడ్పాటునందిస్తూ నూతన ఎంఎస్ఎంఈ విధానాన్ని తీసుకువస్తామని గవర్నర్ తమిళిసై ప్రకటించారు. ఇందుకు ప్రత్యేక సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్థికాభివృద్ధికి పరిశ్రమలు, సేవా రంగాలు కీలకమని, ఉత్తమ పద్ధతుల అధ్యయనం ద్వారా ఆ రెండు రంగాలను పరిపుష్టం చేస్తామని, ఇందుకు నూతన విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోందని వెల్లడించారు. మౌలిక సదుపాయాల నిర్వహణకు కొత్త వ్యవస్థలను తీసుకురానుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, దివ్యాంగులు, మైనారిటీ వర్గాలు పారిశ్రామికంగా ముందడుగు వేసేలా నిర్దిష్ట చర్యలు చేపడుతుందన్నారు. 1000 నుంచి 3000 ఎకరాల విస్తీర్ణంతో జనావాసాలకు దూరంగా 10 నుంచి 12 ఫార్మా విలేజ్ క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటైన కొన్ని రోజులకే దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ పారిశ్రామిక దిగ్గజాలతో మాట్లాడారని, ఫలితంగా రూ.40 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి వారు సంసిద్ధత వ్యక్తం చేశారని వివరించారు. కృత్రిమ మేధ (ఏఐ) కేంద్రాలను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలంటూ కంపెనీలను ఆహ్వానించామని, తద్వారా దేశంలోనే హైదరాబాదును కృత్రిమ మేధకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, 50-100 ఎకరాల్లో 'ఏఐ సిటీ'ని ఏర్పాటు చేస్తామని వివరించారు. 'ఇండస్ట్రీ 4.0' అవసరాలను తీర్చడానికి రూ.2000 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఐటీఐలన్నింటినీ ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మార్చబోతున్నామన్నారు. సౌర, పవన, హైబ్రిడ్ (సౌర, పవన)తోపాటు పంప్/బ్యాటరీ ఇంధనం వంటి అన్ని రకాల హరిత ఇంధనాలను ప్రోత్సహించడానికి సమగ్ర 'ఇంధన పాలసీ'ని రూపొందిస్తున్నామన్నారు. సమగ్ర పర్యాటక విధానంతో ప్రభుత్వం ముందుకు వస్తుందని తెలిపారు. బడ్జెట్ ప్రక్రియ మొక్కుబడి తంతు కాదని, ఖర్చు చేసే ప్రతి రూపాయీ తెలంగాణ సంక్షేమం, పురోగతికి దోహదపడేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. "చివరిగా.. మాటల కంటే చేతలు ముఖ్యం. ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుతాయి. సంస్కరణలను అమలు చేస్తాం. అభివృద్ధి, సంపద సృష్టిలో తెలంగాణ నూతన శిఖరాలకు చేరుతుంది. ఉజ్వల తెలంగాణ సాధన దిశగా ప్రయాణాన్ని కొనసాగిద్దాం" అంటూ గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు.



గవర్నర్ ప్రసంగం పేలవంగా ఉంది

- ధాన్యానికి బోనస్‌ను ప్రస్తావించలేదేం?
- రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఏమైంది?
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): "డిసెంబరు 9న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తానని, అదే రోజున రూ.2లక్షల రుణమాఫీ దస్త్రంపై సంతకం చేస్తానని ఎన్నికలకు ముందు రేవంత్ ప్రకటించారు. కానీ, ఆతృతలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రీ పోన్(రెండు రోజుల ముందే) చేసుకున్నారు.. హామీల అమలును మాత్రం పోస్ట్‌పోన్ చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హామీల అమలుపై గవర్నర్ ప్రసంగంలో ఎందుకు ప్రస్తావించలేదు? రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను మాత్రమే ప్రస్తావించారు. అంటే విగిలిన హామీలు వచ్చే ఏడాది అమలు చేయబోమని చెప్పకనే చెప్పారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగమంటే విజన్ డాక్యుమెంటులా ఉండాలి. కానీ, హామీల అమలు కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఈ ప్రసంగం నిరాశ కలిగించింది. చాలా పేలవంగా ఉంది" అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'రైతుభరోసా కింద రూ.15వేలు, ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్, ఆసరా పింఛన్ రూ.4వేలకు పెంపు, ప్రతి మహిళకు నెలకు రూ.2,500సాయం, నిరుద్యోగులకు రూ.4వేల భృతి వంటి పథకాలను గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించలేదు. ఏ ఒక్కరికి కూడా గవర్నర్ ప్రసంగం భరోసా కల్పించలేకపోయింది" అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో మొత్తం 13 సంక్షేమ పథకాలున్నాయని, వీటిలో ఇప్పటిదాకా రెండు పథకాలనే అమలు చేశారని గుర్తు చేశారు. కానీ, 2 పథకాలు అమలు చేశాం... మరో రెండు త్వరలో అమలు చేస్తాం... ఇంకా రెండే ఉంటాయంటూ గవర్నర్‌తోనూ అబద్ధాలు చెప్పించారని ఆరోపించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని స్వయంగా నిర్వహిస్తానని చెప్పిన సీఎం.. ఒక్క రోజే దరఖాస్తులు స్వీకరించారని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం తుస్సుమన్నదని విమర్శించారు. సీఎం దావోస్ పర్యటనతో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ప్రకటించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఏ కంపెనీ ఎంత పెట్టుబడి పెట్టనుందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీలో ప్రతిపక్ష నేత చాంబర్ మార్పు

- ఇన్నర్ లాబీ నుంచి ఔటర్ లాబీకి
- విపక్ష నేతను అవమానించడమే
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆగ్రహం



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షనేత కేసీఆర్ చాంబర్‌ను ప్రస్తుతం ఉన్న ఇన్నర్ లాబీలో కాకుండా ఔటర్ లాబీలో మార్చడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఇలా చేసిందని, మొదటి అసెంబ్లీ సమావేశాల్లో గత ప్రతిపక్ష నేతలకు కేటాయించిన కార్యాలయాన్ని చూపి.. ఇప్పుడు మార్చడం.. తమపై కక్ష సాధింపు చర్యల్లో భాగమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక కూడా శాసనసభలో ప్రతిపక్ష నేతకు ఏళ్ల తరబడి కేటాయిస్తున్న కార్యాలయాన్ని కాకుండా.. మరో చోట చిన్న గదిని కేటాయించారంటూ వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. 39 మంది ఎమ్మెల్యేలకు నేతృత్వం వహిస్తున్న ప్రతిపక్ష నేత కార్యాలయాన్ని ఔటర్ లాబీలోని చిన్న గదిలోకి మార్చడం ఏమిటని ప్రశ్నించారు. ఈ అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, తదితరులు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతను అవమానించేలా ప్రభుత్వ చర్య ఉందని, దీనిపై స్పందించాలని కోరారు. అనంతరం మీడియా పాయింట్‌లో మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్‌వోపీకి కొత్తగా కేటాయించిన చాంబర్ ఇరుకుగా ఉందని, పాత చాంబర్ విస్తీర్ణంలో కనీసం నాలుగో వంతు కూడా లేదని తెలిపారు. గతంలో కేటాయించిన చాంబర్‌ను స్పీకర్ అవసరాల కోసం వినియోగించుకుంటామని కోరితే ఇచ్చామని, దానికి బదులుగా పక్కనే ఉన్న మూడు గదులను రెనోవేషన్ చేసి ఇవ్వాలని కోరామని చెప్పారు. కానీ, ఈరోజు చూస్తే ప్రతిపక్షనేత వినియోగించే పాత చాంబర్‌కు తాళం వేసి ఉందని, కొత్తగా కేటాయించిన చాంబర్ ఎల్‌వోపీ స్థాయికి తగినట్లుగా లేదని తెలిపారు. ఈ వ్యవహారం ప్రతిపక్ష నేతను అవమానించేలా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షనేతకు సముచిత గౌరవం ఇవ్వాలని కోరారు. కాగా, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతోందని, కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ పాటించేలా ఆదేశాలు జారీచేయాలని స్పీకర్‌కు విన్నవించినట్లు తెలిపారు. అధికారపార్టీ ఎమ్మెల్యేల మాదిరిగానే తమకూ భద్రత కల్పించేలా డీజీపీకి ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

అసెంబ్లీ ఇంకా నాలుగు రోజులే

నేడు గవర్నర్ ప్రసంగంపై చర్చ.. రేపు శాసన సభలో బడ్జెట్.. 11న సెలవు, 12న బడ్జెట్‌పై చర్చ, సమాధానం

- 13న ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం
- తీర్మానాలు, నివేదికలుంటాయన్న సీఎం
- పొడిగించాలన్న కడియం శ్రీహరి
- అవసరమైతే మరోసారి భేటీ: దుద్దిళ్ల
- కేసీఆర్‌కు బదులుగా హరీశ్ రావడంపై శ్రీధర్‌బాబు అభ్యంతరం
- అసెంబ్లీ సమావేశాలపై బీఏసీ సమావేశం



బీఏసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దుద్దిళ్ల, పొన్నం. చిత్రంలో కడియం, కూనంనేని, అక్బరుద్దీన్

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు మరో నాలుగు రోజుల పాటే కొనసాగనున్నాయి. శుక్రవారంతో కలిపి, ఈ నెల 13 వరకు కొనసాగుతాయి. ఆ తర్వాత సమావేశాలు వాయిదా పడే అవకాశాలున్నాయి. అవసరమైతే మరోసారి ఫ్లోర్ లీడర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి, సమావేశాల పొడిగింపుపై నిర్ణయం తీసుకుందామంటూ శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పినప్పటికీ... కేవలం ఐదు రోజులతోనే సమావేశాలను ముగించాలన్న నిర్ణయంతో ప్రభుత్వం ఉంది. గురువారం నుంచి శాసన సభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఉభయ సభల సభ్యులనుద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించారు. అనంతరం సభ శుక్రవారానికి వాయిదా పడింది. ఆ వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చాంబర్‌లో శాసన సభా వ్యవహారాల కమిటీ(బీఏసీ) సమావేశం జరిగింది. సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి, బీజేపీ నుంచి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మజ్లిస్ నేత అక్బరుద్దీన్ ఒవైసీ, నలుగురు ప్రభుత్వ విప్‌లు పాల్గొన్నారు. సమావేశాలను ఐదు రోజుల పాటే నిర్వహించాలని నిర్ణయించినట్లు రేవంత్, శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ నెల 8న గవర్నర్ ప్రసంగం పూర్తయిందని, 9న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుందని తెలిపారు. శుక్రవారం తీర్మానంపై చర్చ అనంతరం అదే రోజు ప్రభుత్వం సమాధానం ఇస్తుందన్నారు. 10న అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెడతామని, 11న సభకు సెలవు ఇచ్చి, 12న బడ్జెట్‌పై చర్చను చేపడదామని వివరించారు. అదే రోజు బడ్జెట్‌పై సభ్యులు లేవనెత్తిన సందేహాలను ప్రభుత్వం నివృత్తి చేస్తుందన్నారు. 13న ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టి సభ ఆమోదం కోరతామన్నారు. 13న కొన్ని తీర్మానాలు, నివేదికలను మంత్రులు సభలో ప్రవేశపెడతారని సీఎం రేవంత్ వెల్లడించారు. బడ్జెట్‌పై ఎక్కువ రోజులు చర్చించాల్సి ఉందని, ఈ దృష్ట్యా మరిన్ని రోజులు సమావేశాలను పొడిగించాలని కడియం శ్రీహరి కోరారు. దీనికి శ్రీధర్‌బాబు స్పందిస్తూ... అవసరమైతే ఆ రోజు బీఏసీ సమావేశాన్ని నిర్వహించి పొడిగింపుపై నిర్ణయం తీసుకుందామని చెప్పారు.

హరీశ్‌రావు హాజరుపై వివాదం

బీఏసీ సమావేశానికి బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు హాజరుకావడంపై వివాదం ఏర్పడింది. నిజానికి బీఆర్ఎస్ తరఫున కేసీఆర్, కడియం శ్రీహరి హాజరవుతారంటూ స్పీకర్‌కు తెలియజేశారు. కానీ... కేసీఆర్‌కు బదులుగా హరీశ్‌రావు, కడియం బీఏసీ భేటీకి వచ్చారు. హరీశ్‌రావును గమనించిన శ్రీధర్‌బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు బదులుగా హరీశ్ ఎలా హాజరవుతారంటూ ప్రశ్నించారు. ఇది సరైన సంప్రదాయం కాదన్నారు. ఈ విషయమై తమ నేత కేసీఆర్ స్పీకర్‌తో ఫోన్‌లో మాట్లాడారని హరీశ్ వివరించారు. తనకు బదులుగా హరీశ్ హాజరవుతారంటూ కేసీఆర్ చెప్పడంతో స్పీకర్ అంగీకరించారని తెలిపారు. స్పీకర్ వెళ్లిపొమ్మంటే వెళ్లిపోతానని, ఉండమంటే ఉంటానని అన్నారు. ఇది మంచి పద్ధతి కాదని, సభ్యులుకానివారు సమావేశానికి రావడం సంప్రదాయం కాదని శ్రీధర్‌బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక నుంచి సత్సంప్రదాయాలను కొనసాగిద్దామని అన్నారు. దీంతో నొచ్చుకున్న హరీశ్‌రావు సమావేశం నుంచి వెళ్లిపోయారు.

నేటి శాసన సభా కార్యకలాపాలు

శుక్రవారం ఉదయం 10 గంటలకు శాసన సభ ప్రారంభమవుతుంది. తొలుత బీఏసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సీఎం రేవంత్ సభకు వివరిస్తారు. అనంతరం సింగరేణి కంపెనీకి సంబంధించిన 102వ వార్షిక నివేదికను, తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ 6వ నివేదికను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెడతారు. తెలంగాణ స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 6వ నివేదికను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రవేశపెడతారు. ఆ తర్వాత గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను చేపడతారు.



శ్రీశైలం డ్యామ్‌ను పరిశీలిస్తున్న ఎన్‌డీఎస్‌ఏ, కేఆర్ఎంబీ సభ్యుల బృందం

శ్రీశైలం డ్యామ్‌ను పరిశీలించిన ఎన్‌డీఎస్ఏ, కేఆర్ఎంబీ బృందం

దోమలపెంట, ఫిబ్రవరి 8: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్టును నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) సభ్యులు వివేక్ త్రిపాఠి, రాకేశ్ కశ్యప్‌ల అధ్వర్యంలోని కేఆర్ఎంబీ 10 మంది సభ్యుల బృందం గురువారం పరిశీలించింది. వారికి తెలంగాణ, ఆంధ్ర జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్లు ప్రమీల, కబీర్ బాషా, డ్యామ్ ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి స్వాగతం పలికారు. డ్యామ్ భద్రత, నీటి నిల్వలు, ఇరు రాష్ట్రాల నీటి వినియోగం తదితర వివరాలను నిపుణుల బృందం అడిగి తెలుసుకుంది. అనంతరం శ్రీశైలం డ్యామ్ క్రస్ట్ గేట్లు, గ్యాలరీ, రోప్స్, డ్యామ్ ముందు ఏర్పడిన ప్లాంజ్‌పూల్(గొయ్యి), డ్యామ్ భద్రతా నిర్వహణ తదితర విషయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం ప్రాజెక్టు సీఈ కబీర్ బాషా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జాతీయ జల శక్తి కమిటీ సూచన మేరకు డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం డ్యామ్ నిర్వహణలోని ఇబ్బందులు, గేట్ల పని తీరు, అప్రోచ్ రోడ్డు ఇతర మరమ్మతుల గురించి పరిశీలించారని తెలిపారు. శుక్రవారం ఇరు రాష్ట్రాల అధికారులతో ఎన్‌డీఎస్ఏ, కేఆర్ఎంబీ సభ్యుల బృందం సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు.

ఉరేసుకొని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



మహ్మద్ (ఫైల్)

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం రాలేదని కలత చెందిన బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థి ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా మైసమ్మగూడలోని ఓ ప్రైవేటు వసతి గృహంలో చోటుచేసుకుంది. పేట్‌బషీరాబాద్ పోలీసుల వివరాల మేరకు.. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం, అయ్యవారిపల్లికి చెందిన బాబుమియా కుమారుడు ఎండీ మహ్మద్ (22) మైసమ్మగూడలోని మల్లారెడ్డి కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే ఓ వసతిగృహంలో ఉంటున్నాడు. కాలేజీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఏ ఇంటర్వ్యూలోనూ ఎంపిక కాకపోవడంతో మహ్మద్ మనస్తాపం చెంది తను ఉంటున్న గదిలోనే ఉరివేసుకున్నాడు. సహవిద్యార్థులు సమాచారమందించడంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బీసీలకు చేసిందేమిటో మోదీ చెప్పాలి: జాజుల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీసీనని గొప్పలుపోతున్న మోదీ తన పదేళ్ల పాలనలో బీసీలకు ఏం చేశారో చెప్పిన తర్వాతే దేశంలోని 70 కోట్ల మంది బీసీల ఓట్లు అడగాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద 'బీసీల సమరభేరి' పేరుతో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక, రాజకీయ విధానంపై కేంద్రప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీనని చెప్పుకుంటున్న మోదీ.. బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, బీసీ కులగణన, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా ఎందుకు కల్పించలేదని నిలదీశారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి: ఎఫ్‌జీజీ

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అత్యంత విలువైన 98 ఎకరాల భూమిని ప్రైవేటు కంపెనీలకు అప్పగించడంపై విజిలెన్స్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా అక్రమార్కులపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకునేలా ఆదేశించాలని గవర్నర్‌ను ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) కోరింది. ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి గవర్నర్ తమిళిసైకి లేఖ రాశారు. గృహ నిర్మాణ సంస్థ 2001లో 98.56 ఎకరాల ప్రభుత్వ భూములను డెవలపర్లకు ఇచ్చి గృహ నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టిందని తెలిపారు. ఈ భూముల విలువ రూ.5 వేల కోట్లుగా ఉందన్నారు. అయితే గృహ నిర్మాణ సంస్థ అధికారులు డెవలపర్లతో కుమ్మక్కై, సంస్థలకే లాభం కలిగేలా షరతులు మార్చారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై 2013లో విజిలెన్స్ కమిషన్ విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని, దీనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నివేదికను పరిశీలించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో 3,30,40,512 మంది ఓటర్లు

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఓటర్ల సంఖ్య 4.22 లక్షలకుపైగా పెరిగింది. ఈ ఎన్నికలనాటికి రాష్ట్రంలో 3,26,18,205 మంది ఓటర్లు ఉండగా.. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, సవరణలు, తొలగింపు ప్రక్రియల తర్వాత ఓటర్ల సంఖ్య 3,30,40,512కు చేరింది. ఈ మేరకు తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ గురువారం ఓటర్ల తుది జాబితా విడుదల చేశారు. దీని ప్రకారం రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3,30,40,512 మంది ఓటర్లు ఉండగా... వీరిలో పురుషులు 1,64,31,777, మహిళలు 1,65,87,221, థర్డ్‌జెండర్ 2,737, సర్వీస్ ఓటర్లు 15,378 ఎన్ఆర్ఐ ఓటర్లు 3,399 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

ప్రముఖ కథా రచయిత శ్రీపతి ఇకలేరు



శ్రీపతి (ఫైల్)

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తెలుగు కథా సాహిత్యంలో శ్రీపతిగా ప్రసిద్ధులైన పుల్లట్ల చలపతిరావు (86) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. ఆయన జీవిత సహచరి విశ్రాంత అధ్యాపకురాలు శారద గత ఏడాది మరణించారు. శ్రీపతి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలోని బైరిపురం. చాలా కాలం కిందటే హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో చాలాకాలం పుల్లట్ల చలపతిరావుగా జాతీయ వార్తలు చదివారు. శ్రీకాకుళోద్యమ తొలినాళ్లలో ఆయన రాసిన 'నర్త్రేడు' కథ విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పాటుకు భూమికగా నిలిచిందని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు గుర్తుచేసుకు న్నారు. విరసం కార్యక్రమాల్లోనూ చాలాకాలం చురుగ్గా పాల్గొన్నారు. ఆయన రాసిన 'మంచుపల్లకి - మరితొమ్మిది', 'కాటుక కళ్లు - కథలు', 'సత్యజిత్ రాయ్ ఎవరు' తదితర రచనలు కథా సంపుటాలుగా వెలువడ్డాయి. ఉద్దానం ప్రాంత సౌందర్యాన్ని ముఖ్యంగా నెమళ్ళ అడవి తదితర ప్రాంతాలను తన కథల్లో శ్రీపతి చాలా అందంగా కళ్ళకు కట్టారని శ్రీకాకుళం సాహితీ నిర్వాహకులు చెప్పారు. శ్రీపతి మరణం పట్ల పలువురు రచయితలు, కవులు విచారం వ్యక్తం చేశారు.

ఐఏఎస్‌కు 10 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

పూసగుచ్చినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఐఏఎస్ అధికారి పేరు రావడంతో.. కేసు కీలక మలుపు తిరిగింది. "ఆ ఐఏఎస్ అధికారి ఆదేశాల మేరకే నేను కీలక అనుమతులను మంజూరు చేశాను. అందుకు ప్రతిగా సంబంధిత సంస్థలు ఇచ్చే మొత్తాన్ని సేకరించి, సేఫ్‌గా ఆ అధికారికి అప్పగించాను. పలు దఫాలుగా సుమారు రూ.10 కోట్ల వరకు ఆ ఐఏఎస్‌కు నగదు రూపంలో ముట్టజెప్పాను" అని శివబాలకృష్ణ ఏసీబీకి ఇచ్చిన వాంగ్మూలంలో వెల్లడించినట్లు తెలిసింది. అంతే కాదు.. తాను వరంగల్‌లో ఎక్కువ భూములు కొనడానికి కూడా ఆ ఐఏఎస్ సూచనలే కారణమని పేర్కొనట్లు సమాచారం. "సదరు ఐఏఎస్ అడిగిన మొత్తం ఇచ్చాక.. నాకు వచ్చిన వాటాను ఎక్కడ.. ఎలా పెట్టుబడులు పెట్టాలో చెప్పేవాడు. హైదరాబాద్ చుట్టుపక్కల కాకుండా.. వరంగల్ వైపు స్థిరాస్తులను కొనుగోలు చేయమని సూచించేవాడు. దాని వల్ల అక్రమ సంపాదనను లెక్కల్లోకి తీసుకురావడమే కాకుండా.. వరంగల్ వైపు పెట్టే పెట్టుబడి మరింత పెరిగే అవకాశాలున్నాయని సలహా ఇచ్చేవాడు. అందుకే అక్కడ ఎక్కువ భూములను కొన్నా" అని శివబాలకృష్ణ కుండ బద్దలు కొట్టినట్లు వివరించారని సమాచారం. ఇప్పటి వరకు ఏసీబీ అధికారులు శివబాలకృష్ణకు చెందిన 214 ఎకరాల వ్యవసాయ భూములను గుర్తించగా.. అందులో సింహభాగం– 102 ఎకరాలు జనగామ జిల్లాలోనే ఉండడం గమనార్హం..!



ఐఏఎస్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

శివబాలకృష్ణ కన్ఫెషన్‌ను రికార్డు చేసిన ఏసీబీ.. ఇప్పుడు సదరు ఐఏఎస్‌కు నోటీసులు జారీ చేసి, విచారించాలని నిర్ణయించింది. అందుకోసం అనుమతినివ్వాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం కూడా ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న నేపథ్యంలో ఏసీబీకి అనుమతినిచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈలోగా.. శివబాలకృష్ణ వాంగ్మూలంలో చెప్పిన విషయాలను క్రాస్‌చెక్ చేసుకునే పనిలో ఏసీబీ నిమగ్నమైంది. ఇప్పటికే శివబాలకృష్ణ ఫోన్‌ను సీజ్ చేసి, కాల్ డేటా రికార్డ్(సీడీఆర్)ను సేకరించగా.. సదరు ఐఏఎస్ అధికారితో జరిగిన సంభాషణలు, చాటింగ్ వివరాలను(ఇంకా కొంత డేటాను రిట్రీవ్ చేయాల్సి ఉంది) వెలికి తీస్తోంది. శివబాలకృష్ణ చెబుతున్న రోజుల్లో సదరు ఐఏఎస్ అధికారి నుంచి ఫోన్లు వచ్చాయా? ఆ అధికారికి డబ్బులిచ్చానని చెబుతున్న సమయంలో.. ఆ ప్రాంతాల్లో సెల్‌టవర్ లొకేషన్ వివరాలు ఏం చెబుతున్నాయి? ఇద్దరి టవర్ లొకేషన్ ఒకటేనా? అనే కోణాలతోపాటు.. వీలైన చోట్ల సీసీటీవీ ఫుటేజీ సేకరణపై దృష్టి సారించింది.

రెండు డొల్ల కంపెనీలు

ఏసీబీ అరెస్టు చేసిన శివబాలకృష్ణ సోదరుడు శివ నవీన్‌కుమార్ ఈ కేసులో అత్యంత కీలక వ్యక్తి అని ఏసీబీ వర్గాలు చెబుతున్నాయి. ఎవరి నుంచి ఎంత మొత్తం తీసుకోవాలి? వాటిని ఎక్కడికి మళ్లించాలి? ఎక్కడ పెట్టుబడులు పెట్టాలి?.. ఇలా అన్ని వ్యవహారాలను నవీన్‌కుమార్ చక్కబెట్టేవాడని వివరించాయి. నిధులను దారి మళ్లించేందుకు నవీన్‌కుమార్ రెండు డొల్ల కంపెనీలను ఏర్పాటు చేసినట్లు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలను సేకరించారు. ఆ కంపెనీల పేర్లతో ఆదాయ పన్ను(ఐటీ) సైతం చెల్లించినట్లు గుర్తించారు. దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. విచారణకు నవీన్‌కుమార్ సరిగా సహకరించడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో.. డాక్యుమెంట్స్, టెక్నికల్ ఎవిడెన్స్‌పై దృష్టిసారించారు. నవీన్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయనున్నారు. మరోవైపు శివబాలకృష్ణ వాంగ్మూలంలో పేర్కొన్న స్థిరాస్తి సంస్థలకూ నోటీసులు జారీ చేసి, విచారించేందుకు ఏసీబీ సిద్ధమవుతోంది. కేసు దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నప్పుడు కూడా పలు రియల్‌ఎస్టేట్ సంస్థల ప్రతినిధులను విచారించినా..ఇప్పుడు శివబాలకృష్ణ వాంగ్మూలం మేరకు వారిని ప్రశ్నించనున్నట్లు స్పష్టమవుతోంది.

రంగంలోకి ఈడీ, ఐటీ

వందల కోట్ల రూపాయల అక్రమాలు, మనీలాండరింగ్ జరగడంతో ఈ కేసులో పీఎంఎల్ఏ కింద విచారణ చేపట్టేందుకు ఈడీ అధికారులు రంగంలోకి దిగనున్నట్లు తెలిసింది. ఏసీబీ దర్యాప్తు ఓ కొలిక్కి వచ్చాక.. కేసు పత్రాలను తెప్పించుకుని, విచారించనున్నట్లు సమాచారం. ఈ కేసులో శివబాలకృష్ణ అక్రమాస్తుల వ్యవహారంపై ఆదాయపన్ను(ఐటీ) శాఖ అధికారులు ఇప్పటికే దృష్టి సారించారు. ఇటీవలి విచారణలో శివబాలకృష్ణ తన బంధుమిత్రులను బినామీలుగా వాడుకున్నట్లు తేలడంతో.. 'బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్ యాక్ట్-2018' కింద చర్యలకు సిద్ధమైనట్లు తెలిసింది.

హెచ్ఎండీఏలో ఐదు దస్త్రాలను సీజ్ చేసిన ఏసీబీ!

- శివబాలకృష్ణ కేసులో వందల సంఖ్యలో ఫైళ్ల పరిశీలన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): శివబాలకృష్ణ కేసులో హెచ్ఎండీఏలో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. నాలుగో రోజు సోదాల్లో భాగంగా గురువారం ఐదు కీలక అనుమతులకు సంబంధించిన ఫైళ్లను ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. శివబాలకృష్ణ అధికార దుర్వినియోగాన్ని నిగ్గుతేల్చేందుకు ఈ నాలుగు రోజుల్లో.. అమీర్‌పేట స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని హెచ్ఎండీఏలో పదుల సంఖ్యలో ఫైళ్లను తనిఖీ చేశారు. ముఖ్యంగా బహుళ అంతస్తుల భవనాలు, లేఅవుట్ల అనుమతులకు సంబంధించి.. దరఖాస్తులు వచ్చింది మొదలు.. వాటికి పర్మిషన్లు ఇచ్చేదాకా జరిగిన ప్రక్రియను శోధించారు. వందల దస్త్రాలను పరిశీలించినా.. గురువారం ఐదు ఫైళ్లను సీజ్ చేసినట్లు తెలుస్తోంది. వాటిని స్కాన్ చేసి, డిజిటల్‌లోకి మార్చడంతోపాటు.. ఒరిజినల్ పత్రాలను తమతో తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే.. ఆ ఐదు దస్త్రాలు ఏయే రియల్ ఎస్టేట్ సంస్థలకు చెందినవనేదాన్ని అధికారులు వెల్లడించలేదు. వాటిల్లో శంకర్‌పల్లి జోన్‌కు చెందిన మూడు బహుళ అంతస్తుల దస్త్రాలు, ఘట్‌కేసర్, శంషాబాద్‌లలో ఒక్కో లేఅవుట్‌కు సంబంధించిన ఫైళ్లు ఉన్నట్లు తెలిసింది. ఆ దస్త్రాలు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల అండదండలున్న సంస్థలవేననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత సర్కారు హయాంలో వారు నిబంధనలను తుంగలోతొక్కి.. తమ దరఖాస్తులకు అనుమతులు తెచ్చుకున్నట్లు ఏసీబీ అనుమానిస్తోంది. మిగతా దస్త్రాల్లో పేపర్‌వర్క్ అంతా సవ్యంగా ఉన్నట్లు ఏసీబీ గుర్తించిందని సమాచారం.

కాంగ్రెస్‌లోకి పట్నం మహేందర్ రెడ్డి దంపతులు!

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి

హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు భారీ షాక్.. ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్‌లోకి రానున్నారు. గురువారం ఆయన తన భార్య, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే మహేందర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైన తరుణంలో అనూహ్యంగా ఆయనను అప్పటి సీఎం కేసీఆర్ మంత్రివర్గంలోకి తీసుకున్నారు. మరోవైపు సునీత గత కొద్ది నెలలుగా బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. రాష్ట్రంలో అధికారం మారాక.. మహేందర్ రెడ్డి సైతం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. మహేందర్ రెడ్డి దంపతులు కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైందని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నెల 11న అధికారికంగా చేరనున్నారని సమాచారం. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సునీత పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. కొందరు మాజీ ఎమ్మెల్యేలు, హైదరాబాద్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు కూడా త్వరలోనే కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. వీరు కూడా మరో మూడు రోజుల్లో చేరతారు. వీలుంటే ఒకే కార్యక్రమంలో వీరందరి చేరిక ఉంటుందని అంటున్నారు. కాగా, తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. 'రాజకీయాల్లో ఉన్నపుడు ఎవరి నిర్ణయం వారు తీసుకుంటారు. మా అన్న, వదిన కాంగ్రెస్ పార్టీలో చేరినా నేను బీఆర్ఎస్ పార్టీని వీడను.. ఇందులోనే ఉంటా' అని స్పష్టం చేశారు.

కేసీఆర్ ఇలాకాలో బీఆర్ఎస్‌కు షాక్

తూప్రాన్‌లో ఏడుగురు కౌన్సిలర్ల రాజీనామా

సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

తూప్రాన్, ఫిబ్రవరి 8: మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. నియోజకవర్గంలోని తూప్రాన్ మున్సిపాలిటీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తూప్రాన్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు జ్యోతికృష్ణ, ప్రియాంక, రాజు, రవీందర్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, నారాయణగుప్తాలు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

డీఎస్సీ 2008 అభ్యర్థులకు భారీ ఊరట

- ఎస్జీటీలుగా నియమించే అంశాన్ని మరోమారు చూడండి
- అప్పటి నోటిఫికేషన్ ఆధారంగానే నిర్ణయాలు తీసుకోండి: హైకోర్టు


హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దాదాపు 15 ఏళ్ల నుంచి న్యాయపోరాటం చేస్తున్న డీఎస్సీ 2008 బీఎడ్ అభ్యర్థులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. వారిని ఎస్జీటీలుగా నియమించే అంశాన్ని మరోమారు పరిశీలించాలని గురువారం హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. 2008 డీఎస్సీ నోటిఫికేషన్ ఆధారంగా మళ్లీ నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చిన 2008 డీఎస్సీ నోటిఫికేషన్‌లో తమ కంటే తక్కువ అర్హత కలిగిన డీఎడ్ అభ్యర్థులకు 30 శాతం ఎస్జీటీ పోస్టులు రిజర్వు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీఎడ్ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా గురువారం ఈ పిటిషన్‌పై జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఒకే రంగానికి సంబంధించిన పోస్టుల్లో ఎక్కువ అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లను మినహాయించడం చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు. ఈ తరహా విభజన న్యాయసమీక్షకు నిలువదని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది గోవింద్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ ప్రభుత్వంలా కాకుండా ఏపీ రాష్ట్రం సంక్షేమ రాష్ట్రమని, ఏపీ ప్రభుత్వం మానవత్వంతో ఆలోచించి అర్హులైన 2008 డీఎస్సీ అభ్యర్థులను కాంట్రాక్టు ఉద్యోగులుగా నియమించుకుందని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఉమ్మడి రాష్ట్రంలో ఈ సమస్య తలెత్తిందని, ఒకే సమస్యపై పోరాడుతున్న అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో కొంత ఉపశమనం లభించిందని తెలిపింది. కానీ తెలంగాణకు చెందిన వారికి ఎలాంటి ఉపశమనం లభించలేదని పేర్కొంది. ఇది అన్యాయమని వ్యాఖ్యానించింది. తెలంగాణకు చెందిన అభ్యర్థులను ఉద్యోగాల్లో నియమించుకునే అంశాన్ని మరోమారు పరిశీలించాలని తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. నాలుగు వారాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొంటూ మార్చి 21కి విచారణ వాయిదా వేసింది.

ఎన్ఐఏ మెరుపుదాడులు

మావోయిస్టు నేత సంజయ్ దీపక్ రావు కేసులో తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళలో సోదాలు

- కీలక పత్రాలు, ఫోన్లు, నగదు స్వాధీనం
- హైదరాబాద్‌లో వరవరరావు మేనల్లుడు వేణుగోపాల్, విరసం మాజీ సభ్యుడు రవి శర్మ ఇళ్లలో తనిఖీలు
- రేపు విచారణకు రమ్మని రవికి నోటీసు
- ఎన్ఐఏ దాడిపై పలు సంఘాల ఖండన

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/హిమాయత్‌నగర్/ మన్సూరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు సంజయ్ దీపక్ రావు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గురువారం నాలుగు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళలో ఈ సోదాలు జరిగాయి. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్, ఎల్‌బీనగర్‌లో ఎన్ఐఏ బృందాలు తనిఖీలు చేశాయి. దేశవ్యాప్తంగా జరిపిన సోదాల్లో నిషేధిత మావోయిస్టు పార్టీకి సంబంధించిన పుస్తకాలు, కీలక పత్రాలు, ఆరు మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, రూ.1.37 లక్షలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నాయి. హిమాయత్ నగర్‌లోని వరవరరావు మేనల్లుడు, వీక్షణం పత్రిక సంపాదకుడు ఎన్.వేణుగోపాల్, ఎల్‌బీనగర్‌లోని విరసం మాజీ సభ్యుడు రవి శర్మ, అనురాధ దంపతుల ఇళ్లలో తెల్లవారుజాము నుంచి ఐదు గంటల పాటు ఎన్ఐఏ బృందాలు సోదాలు జరిపాయి. గత ఏడాది సెప్టెంబరులో పోలీసులు అరెస్టు చేసిన దీపక్‌రావు కేసు విచారణలో అతని వద్ద లభించిన సమాచారం మేరకు పలు అంశాలపై వీరిని ప్రశ్నించాయి. రవి శర్మ నివాసంలో బుక్‌లెట్, కరపత్రాలు, పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాల అనంతరం శనివారం విచారణకు హాజరుకావాలని రవిశర్మకు ఎన్ఐఏ అధికారులు నోటీసులు జారీచేశారు. దీపక్ రావు కేరళ, తమిళనాడు, కర్ణాటకల్లో నక్సల్ సంస్థల కోసం పని చేశాడని, అతని ఆదేశాలతో సీపీఐ మావోయిస్టు ఫ్రంట్ లైన్ సభ్యులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అర్బన్ ఏరియాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని ఎన్ఐఏ ఓ ప్రకటనలో పేర్కొంటూ దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది. కాగా.. సంజయ్ దీపక్‌రావును గత ఏడాది సెప్టెంబరు 15న తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. కూకట్‌పల్లి మలేసియా టౌన్‌షిప్‌లో అతణ్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎన్ఐఏ ఈ కేసులో గత నెల దర్యాప్తు చేపట్టింది. వేణుగోపాల్‌ను ఏ-22, రవిశర్మను ఏ-23గా పేర్కొంది. కేరళకు చెందిన మరో ముగ్గురు కూడా నిందితులుగా ఉన్నారు.



రవి శర్మ

ఆరోపణలు అవాస్తవం: వేణుగోపాల్

ఎన్ఐఏ తనపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని వేణుగోపాల్ స్పష్టం చేశారు. 2021 సెప్టెంబరు 24న సమావేశం ఏర్పాటు చేసి, ప్రభుత్వాన్ని కూలదోసేలా కుట్ర చేశామని ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు. తనను విరసం సభ్యుడిగా ఎన్ఐఏ పేర్కొందని, 2009లో ఆ సంస్థ తనను బహిష్కరించిందని గుర్తుచేశారు. దీపక్ రావు కేసులో తాను నిందితుడిననే ఆధారాల్లేకున్నా.. తన ఇంటిపై దాడిచేశారన్నారు. తన ఫోన్, తన రచనలు, అందుకు సంబంధించిన కొన్ని లేఖలను ఎన్ఐఏ పట్టుకెళ్లిందని చెప్పారు.

దీపక్ రావుతో సంబంధాల్లేవు: రవి శర్మ


ఎన్ఐఏ సోదాల అనంతరం రవి శర్మ మీడియాతో మాట్లాడారు. 'దీపక్ రావు కేసులో మా పేర్లను ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించారు. కానీ దీపక్ రావుతో మాకు ఎలాంటి సంబంధాలు లేవ'ని చెప్పారు. 2016లో జైలు నుంచి విడుదలైన తరువాత ఎన్ఐఏ అధికారులు రవి శర్మ ఇంట్లో సోదాలు చేయడం ఇది రెండో సారి. 2019లో తెలంగాణ పోలీసులు దాడి చేసి రవి శర్మ దంపతులను అరెస్టు చేశారు.

అక్రమ కేసులు ఎత్తివేయకపోవడం వల్లే..

ప్రముఖ రచయిత ఎన్.వేణుగోపాల్, హక్కుల కార్యకర్త రవి శర్మ ఇళ్లపై ఎన్ఐఏ దాడులను నిర్బంధ వ్యతిరేక వేదిక, పౌర హక్కుల సంఘం, విరసం తీవ్రంగా ఖండించాయి. సుప్రీం కోర్టులో కేసు విచారణలో ఉన్న విషయం తెలిసి కూడా ఇద్దరు రచయితల దగ్గర నుంచి సెల్ ఫోన్లు తీసుకెళ్లారని వేదిక విమర్శించింది. తెలంగాణలో కొత్తగా ఏర్పడ్డ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ అక్రమ కేసులను ఎత్తివేయకపోవటం వల్లే ఈ పరిస్థితి నెలకొందని పేర్కొంది. ప్రభుత్వం తక్షణం స్పందించి రాష్ట్రంలో నమోదు చేసిన ఎన్ఐఏ కేసులను ఎత్తివేయాలని వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్, కో కన్వీనర్లు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ఎం.రాఘవాచారి, కె.రవిచందర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్ఐఏ అధికారులు సోదాల పేరుతో చేస్తున్న దాడిని ఖండిస్తున్నామని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు తెలిపారు. తెలుగు తెలియని దీపక్‌రావు తెలుగులో కన్ఫెషన్ ఎలా ఇవ్వగలరని నిలదీశారు. ముఖ్యమంత్రి కాక ముందు రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనకు కట్టుబడి బీజేపీ, బీఆర్ఎస్ కలిసి నమోదు చేసిన ఉపా కేసులను ఎత్తివేయాలని, తెలంగాణ పబ్లిక్ సెక్యూరిటీ చట్టాని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేణుగోపాల్ ఇంటిపై ఎన్ఐఏ దాడి.. భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి అని విరసం సాధారణ సభ్యుడు ఎం.ఎ.సత్యనారాయణరావు పేర్కొన్నారు.

అన్నీ మరచి.. కలిసి పనిచేద్దాం

- అభివృద్ధి, సిద్ధాంతాల్లో మనకు పెద్ద తేడాల్లేవు
- చంద్రబాబుకు అమిత్ షా హామీ!
- ఇరు పార్టీల నడుమ కుదిరిన అవగాహన?



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గతం మరిచిపోదామని.. కలిసికట్టుగా పని చేద్దామని టీడీపీ అధినేత చంద్రబాబుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పినట్లు తెలుస్తోంది. దరిమిలా రెండు పార్టీల నాయకత్వాలూ మళ్లీ జట్టు కట్టాలన్న రాజకీయ అవగాహనకు వచ్చినట్లు సమాచారం. బుధవారం రాత్రి వీరిద్దరి మధ్య చర్చలు జరిగిన విషయం తెలిసిందే. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధాని మోదీ నాయకత్వాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు తిరిగి ఎన్డీయేలోకి రావాలని చంద్రబాబును అమిత్ షా ఆహ్వానించారు. అభివృద్ధి, సిద్ధాంతాల విషయంలో రెండు పార్టీలకూ పెద్ద తేడా లేదని, దక్షిణాదిన బీజేపీని బలోపేతం చేసేందుకు సహకరించాలని కోరారు. రాష్ట్రాన్ని బలోపేతం చేసేందుకు చంద్రబాబుకు పూర్తి సహకారం అందిస్తామని షా, నడ్డా హామీ ఇచ్చారు. దీంతో దేశ, రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కలిసి పని చేయాలని నిర్ణయానికి వచ్చారని తెలిసింది. త్వరలో తెలుగుదేశం-బీజేపీ-జనసేన మధ్య పొత్తుపై లాంఛనంగా ప్రకటన చేస్తారని సమాచారం.

రాష్ట్రం కోసం తప్పదనిపిస్తోంది..: బాబు

"రాష్ట్ర విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎన్డీయేలో చేరాలని అమిత్ షా ఆహ్వానించారు. మనకున్న పరిమితులు, సమస్యలపై చర్చించాం. రాష్ట్ర ప్రయోజనాలరీత్యా చేరక తప్పదేమోనని అనిపిస్తోంది" అని చంద్రబాబు పేర్కొన్నట్లు సమాచారం. బుధవారం రాత్రి అమిత్ షాతో భేటీ తర్వాత ఆయన కొంత మంది టీడీపీ నాయకులతో చర్చల సారాంశాన్ని పంచుకున్నారు. ఎన్డీయేలో చేరడానికి సానుకూలంగా ఉన్న విషయం ఆయన మాటల్లో వ్యక్తమైనట్లు తెలుస్తోంది. 'వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా తీసింది. ఈ దుస్థితి నుంచి రాష్ట్రాన్ని మళ్లీ పట్టాలు ఎక్కించడానికి కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం.' అని వ్యాఖ్యానించారు. మైనారిటీ వర్గాల్లో గణనీయ భాగం ఇప్పుడు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని, ఎన్డీయేలో చేరితే వారు వైసీపీ వైపు మళ్లుతారేమోనన్న అనుమానాలు పార్టీలో ఉన్నాయని షాకు చెప్పానని బాబు వివరించారు. "వైసీపీ తీసుకున్న అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలను కేంద్రం అడ్డుకోలేదు. దీనివల్ల రాష్ట్రం నష్టపోయిందన్న అభిప్రాయం కూడా కొన్ని వర్గాల ప్రజల్లో ఉందని వివరించాను. మైనారిటీలను కొన్ని పార్టీలు రెచ్చగొడుతున్నాయని, సరైన పద్ధతిలో వారికి మన ఆలోచనలను విశదీకరించగలిగితే ఆ వర్గాలను దరి చేర్చుకోవచ్చని షా అభిప్రాయపడ్డారు" అని వివరించారు. గతంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ కలిసి పోటీ చేసిన విషయం కూడా బాబు- షా చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. 'తెలంగాణలో కలిసి పని చేద్దామని ఎన్నికలకు చాలా ముందే ప్రతిపాదించా. కానీ అక్కడి బీజేపీ నేతలు పట్టించుకోలేదు. తప్పక కాంగ్రెస్‌తో జట్టుకట్టాల్సి వచ్చింది. బీజేపీ కలిసి వచ్చి ఉంటే ఆ పరిస్థితి తలెత్తేదే కాదు' అని బాబు చెప్పారు. అమిత్ షా కూడా నిజమేనని అన్నట్లు సమాచారం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శుక్రవారం 9 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

గ్వాలియర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్(ఐఐటీటీఎం)- బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్), ఎంబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నారు. వీటిని స్పెసిఫిక్ అండ్ జనరిక్ బిజినెస్ మాడ్యూల్స్, ఇండస్ట్రీ ప్రాక్టీసెస్, అకడమిక్ డెవలప్‌మెంట్స్, టూరిజం అండ్ బిజినెస్ స్టడీస్ తదితర అంశాలతో రూపొందించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు, స్టడీ టూర్లు ఉంటాయి. నెల్లూరు సహా గ్వాలియర్, భువనేశ్వర్, నోయిడా, గోవా క్యాంపస్‌లు అందుబాటులో ఉన్నాయి. గోవాలో ఎంబీఏ ప్రోగ్రామ్ మాత్రమే ఉంది. ఐఐటీటీఎం నిర్వహించే అడ్మిషన్ టెస్ట్(ఐఐఏటీ) లేదా నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో బీబీఏ, ఎంబీఏ



బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్)

ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. మొత్తం 375 సీట్లు ఉన్నాయి. నెల్లూరు క్యాంపస్‌లో 75, గ్వాలియర్ క్యాంపస్‌లో 112, భువనేశ్వర్ క్యాంపస్‌లో 75, నోయిడా క్యాంపస్‌లో 113 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. సీయూఈటీ 2023 స్కోర్ ఉన్నవారు ఐఐఏటీ 2024 రాయనవసరం లేదు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/10+2/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్)

ఇది రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైం మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్‌కు అవసరమైన అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ కోర్సుని రూపొందించారు. ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ వంటి కోర్ సబ్జెక్టులతోపాటు స్పెషలైజేషన్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. అభ్యర్థులు వారి ఆసక్తి మేరకు టూర్ గైడింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, అడ్వెంచర్ టూరిజం, సప్లయ్ చెయిన్ అండ్ లాజిస్టిక్స్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. చివరి సెమిస్టర్లో ఆన్ జాబ్ ట్రెయినింగ్ ఉంటుంది.

సీట్లు: మొత్తం 750 సీట్లు ఉన్నాయి. నెల్లూరు క్యాంపస్‌లో 75, గ్వాలియర్ క్యాంపస్‌లో 334, భువనేశ్వర్ క్యాంపస్‌లో 112, నోయిడా క్యాంపస్‌లో 189, గోవా క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసే అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. మ్యాట్/క్యాట్/సీమ్యాట్/ఎక్స్‌ఏటీ/జీమ్యాట్/ఏటీఎంఏ/సీయూఈటీ వంటి జాతీయ పరీక్షల్లో ఒకటి రాసి అర్హత పొందిన అభ్యర్థులు సంస్థ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు. స్కోర్ కార్డ్ వ్యాలిడిటీ 2023 జూన్ 1 నుంచి 2024 మే 31 మధ్య ఉండాలి.

ఐఐఏటీ 2024 వివరాలు

- ఈ టెస్ట్‌ని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం వంద మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ అవేర్‌నెస్ నుంచి 50, వెర్బల్ ఎబిలిటీ నుంచి 25, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.
- ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. అడ్మిషన్ టెస్ట్/జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 15 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 5
- **ఐఐఏటీ 2024 తేదీ:** జూన్ 9
- **గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 11, 12
- **ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** జూన్ 15
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూన్ 30
- **అకడమిక్ సెషన్స్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iittm.ac.in

హైదరాబాద్ నార్మ్‌లో పీజీడీఎం

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ఐకార్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్)- 'పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి నాలుగేళ్ల డిగ్రీ(అగ్రికల్చర్/అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్/కమర్షియల్ అగ్రికల్చర్/అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/డెయిరీ సైన్స్/ఫిషరీస్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్/ఫారెస్ట్రీ/హార్టికల్చర్/సెరీకల్చర్/వెటర్నరీ సైన్సెస్/హోం సైన్స్/కమ్యూనిటీ సైన్స్/అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకూ ప్రథమశ్రేణి మార్కులు ఉండాలి. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ తప్పనిసరి.


ఎంపిక: ఇందులో భాగంగా అనలిటికల్ రైటింగ్ స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్షలో అభ్యర్థులు ఇచ్చిన అంశంపై ఇంగ్లీష్‌లో వ్యాసం రాయాల్సి ఉంటుంది. ఇరవై నిమిషాల సమయం ఇస్తారు. తరవాత గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి సీటుకు అయిదుగురిని ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** naarm.org.in

రిమైండర్

సంబల్‌పూర్ ఐఐఎంలో పీహెచ్‌డీ

సంబల్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది నాలుగేళ్ల వ్యవధిగల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాలి. స్టయిపెండ్ సౌకర్యం ఉంది. జాతీయ పరీక్ష స్కోర్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్, అకడమిక్ ప్రతిభ, పర్సనల్ ఇంటర్వ్యూ, అనుభవం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.



స్పెషలైజేషన్‌లు: ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, పాలసీ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టం మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని మాస్టర్స్ డిగ్రీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ లేదా ఐఐటీలు/ఐఐఎం సంస్థల నుంచి రెండేళ్ల పీజీ డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. డిగ్రీతోపాటు సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఎస్ ఉత్తీర్ణులు; కనీసం 6.5 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీఆర్క్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయి నుంచి పీజీ వరకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. పీజీ చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారూ అర్హులే. వీరు 2024 జూన్ 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. పార్ట్ టైం కోర్సులు, ఈవెనింగ్ కోర్సులు, డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. క్యాట్ (2021/2022/2023) లేదా జీఆర్ఈ/గేట్/జీమ్యాట్/జేఆర్ఎఫ్(యూజీసీ/సీఎస్ఐఆర్) వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేని పక్షంలో సంస్థ నిర్వహించే రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

స్టయిపెండ్: ట్యూషన్, కంప్యూటర్, లైబ్రరీ, మెడికల్ ఇన్సూరెన్స్, అలూమ్నీ తదితర ఫీజుల నిమిత్తం కాంప్రహెన్సివ్ ఫెలోషిప్ ఇస్తారు. దీనితోపాటు మొదటి రెండేళ్లు నెలకు రూ.35,000; చివరి రెండేళ్లు నెలకు రూ.40,000 చొప్పున సబ్సిస్టెన్స్ అలవెన్స్ ఇస్తారు.

- ఐఐఎం సంస్థల నుంచి రెండు/మూడేళ్ల వ్యవధి గల ఫుల్ టైం పీజీడీఎం/పీజీపీ ఉత్తీర్ణులకు; ఐఐటీలు/ఢిల్లీ ఎఫ్ఎంఎస్ సంస్థల నుంచి ఎంబీఏ పూర్తిచేసినవారికి; ఎంబీఏ/పీజీడీఎం/పీజీపీ ఉత్తీర్ణతతోపాటు కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్నవారికి పీహెచ్‌డీ మొదటి ఏడాది కోర్సు నుంచి మినహాయింపు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000+జీఎస్‌టీ
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.iimsambalpur.ac.in

జాబ్ కార్నర్

ఐడీబీఐ బ్యాంక్‌లో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్లు

మొత్తం ఖాళీలు 500

దేశవ్యాప్తంగా వివిధ జోన్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఐడీబీఐ బ్యాంక్ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. మణిపాల్(బెంగళూరు), నిట్టే(గ్రేటర్ నోయిడా) విద్యా సంస్థలతో కలిసి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సు ద్వారా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ) ఆ పోస్టులను భర్తీ చేయనుంది. ఎంపికైన వారికి బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ విభాగంలో ఏడాది పీజీడీబీఎఫ్‌లో శిక్షణ ఇస్తారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్నవారికి పీజీడీబీఎఫ్ సర్టిఫికెట్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్ మేనేజర్(గ్రేడ్-ఓ) ఉద్యోగం లభిస్తుంది.

జోన్లు: అహ్మదాబాద్, భోపాల్, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ముంబయి, నాగ్‌పూర్, పుణె, భువనేశ్వర్, పట్నా, చండీగఢ్, ఢిల్లీ, కోల్‌కతా, లఖ్‌నవూ.

పోస్టు: జూనియర్ అసిస్టెంట్ మేనేజర్(గ్రేడ్-ఓ)

అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి. వయసు 2024 జనవరి 31 నాటికి 21 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయోపరిమితి నిబంధనలో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: అర్హులైన అభ్యర్థులకు ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతిభ కనబర్చిన వారు పర్సనల్ ఇంటర్వ్యూలకు అర్హత సాధిస్తారు. అందులో ప్రతిభ, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా తుది ఎంపికలు చేపడతారు.

దరఖాస్తు: అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.200, ఇతరులు రూ.1000 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయనగరం.

రాత పరీక్ష: పరీక్షను మొత్తం 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో నాలుగు విభాగాలుంటాయి. అవి... లాజికల్ రీజనింగ్, డేటా అనాలసిస్, ఇంటర్‌ప్రిటేషన్(60 ప్రశ్నలు, 60 మార్కులు); ఇంగ్లీష్ లాంగ్వేజ్(40 ప్రశ్నలు, 40 మార్కులు); క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(40 ప్రశ్నలు, 40 మార్కులు); జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్(60 ప్రశ్నలు, 60 మార్కులు) అంశాల నుంచి మొత్తం 200 ప్రశ్నలు వస్తాయి. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి 0.25 మార్కు చొప్పున కోత విధిస్తారు.

శిక్షణ, ఫీజు వివరాలు: ఎంపికైన అభ్యర్థులను ఏడాదిపాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సులో శిక్షణ ఇస్తారు. కోర్సు ఫీజు రూ.3,00,000. విడతల వారీగా ఫీజు చెల్లించే వెసులుబాటు కూడా ఉంటుంది. అర్హత గల అభ్యర్థులకు ఐడీబీఐ బ్యాంక్ విద్యారుణం సైతం మంజూరు చేస్తుంది. కోర్సులో చేరేటప్పుడు అభ్యర్థులు మూడేళ్ల సర్వీస్ బాండ్ సమర్పించాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: ఫిబ్రవరి 12
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 26
ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మార్చి 17
వెబ్‌సైట్: www.idbibank.in/

బెల్‌లో ట్రెయినీ ఇంజనీర్లు

మొత్తం ఖాళీలు 55

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ట్రెయినీ ఇంజనీర్: **33 పోస్టులు**
2. ప్రాజెక్ట్ ఇంజనీర్: **22 పోస్టులు**

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 జనవరి 1 నాటికి ట్రెయినీ ఇంజనీర్‌కు 28 ఏళ్లు; ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు 32 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు ట్రెయినీ ఇంజనీర్‌కు రూ.30,000- రూ.40,000, ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు రూ.40,000- రూ.55,000 చెల్లిస్తారు.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను మేనేజర్(హెచ్‌ఆర్), ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ప్రొఫెసర్ యూఆర్ రావు రోడ్, నాగాలాండ్ సర్కిల్ దగ్గర, జాలహళ్లి పోస్ట్, బెంగళూరు చిరునామాకు పంపాలి.

దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: ఫిబ్రవరి 14
వెబ్‌సైట్: https://bel-india.in/

ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని పాఠశాల విద్యాశాఖ 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష(ఏపీ టెట్-2024) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఉపాధ్యాయ నియామక పరీక్షలో 20 శాతం వెయిటేజీ కూడా ఉంటుంది. అభ్యర్థులు 1 నుంచి 5 తరగతుల బోధనకు పేపర్-1(ఎ, బి); 6 నుంచి 8 తరగతుల బోధనకు పేపర్-2(ఎ, బి)లో అర్హత సాధించాల్సి ఉంటుంది.

పరీక్ష: ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)-2024

అర్హతలు: పేపర్‌ను బట్టి ఇంటర్మీడియట్, బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీతో పాటు డీఈడీ/బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ ఉత్తీర్ణులై ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరం చివరి ఏడాది చదివే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహిస్తారు. రోజుకు రెండు సెషన్లలో పరీక్ష ఉంటుంది. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఉంటుంది.

పరీక్ష రుసుము: రూ.750
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18
పరీక్షల నిర్వహణ: 2024 ఫిబ్రవరి 27 నుంచి 2024 మార్చి 9 వరకు
ప్రాథమిక కీ విడుదల: మార్చి 13
ఫలితాల ప్రకటన: మార్చి 14
వెబ్‌సైట్: https://aptet.apcfss.in/

లిటిల్స్




మూర్ఖ పుత్రులు

ఒక ఊరిలో సోమయ్య అనే షావుకారు ఉండేవాడు. అతనికి వందెకరాలకు పైగా భూమి. ఎంతో పేరున్న మనిషి. ఇల్లంతా పనివాళ్లు, చేలో పనులు.. ఎప్పుడూ ఏదో పనిలో నిమగ్నమై ఉండేవాడు. అతనికి పక్కన ఉండే పది ఊర్లలో పేరుంది. అయితే అతనికి ఉండే ఇద్దరు కొడుకులు కూడా అజ్ఞానులని పేరుంది. ఇద్దరి కొడుకులకు అంత విలువ ఉండేది కాదు. తండ్రి ఆస్తిని తింటున్నారు. ఏమీ చేయలేని చవటలు అని తిట్టిపోసేవారు కొందరు. పైగా తన తండ్రి మాటలను లెక్క చేసేవారు కాదు. దీంతో వారిద్దరినీ ఏదో పని కల్పించాలనుకున్నాడు షావుకారు.

ఒక రోజు పక్క ఊరిలోని జమీందారు చనిపోయాడు. వెంటనే షావుకారు తన పెద్ద కొడుకుని పిలిచి జమీందారు కుటుంబాన్ని పరామర్శించి వచ్చేయ్ అన్నాడు. 'ఏమని పరామర్శించాలి' అని అడిగాడు. 'నలుగురు ఎలా చెబుతుంటే అలా చెప్పు' అన్నాడు. షావుకారు పెద్ద కొడుకు ఆ జమీందారు ఊరికి వెళ్లాడు. జమీందారు గురించి ఓ వ్యక్తిని అడిగాడు. 'పరమ దుర్మార్గుడు. చచ్చి మంచి పని అయ్యింది' అన్నాడు. వెంటనే జమీందారు ఇంటికి చేరుకున్నాడు షావుకారు కొడుకు. జమీందారు ఇంట్లో శోకం. జమీందారు భార్య దగ్గరకు వెళ్లి తన గురించి పరిచయం చేసుకున్నాడు. 'పరమ దుర్మార్గుడు. చచ్చి మంచి పని అయ్యింది' అన్నాడు. ఆ మాటలు విని జమీందారు పిల్లలు, బంధువులు అతన్ని చావబాదారు. బతుకు జీవుడా.. అనుకుంటూ ప్రాణాలతో ఇంటికి వచ్చాడు.

తన అన్న పరిస్థితి చూసి తమ్ముడు కోప్పడ్డాడు. వెంటనే విషయం తెలుసుకుని జమీందారు ఇంటికి వెళ్లాడు. 'మా అన్నకు తెలీదు. వాడు అజ్ఞాని. ఈ సారి మీ ఇంట్లో ఇలా జరిగితే చెప్పండి. వచ్చి నేను పరామర్శిస్తాను' అన్నాడు తమ్ముడు. వెంటనే అతన్ని కూడా చావబాదారు ఆ ఇంట్లో వాళ్లు.


సరైన నీడ ఏది?




చుక్కలు కలిపి రంగులు వేయండి



5 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 225

9	1	4				2		
	5		2					
2		6			8	3		
7				1			4	9
		3		7		6		
4	6			8				1
		2	1			5		7
					3		2	
		7				1	9	3

సుడోకు - 224 సమాధానం

1	2	3	5	6	4	8	7	9
9	5	4	7	2	8	3	1	6
7	8	6	9	3	1	4	5	2
3	4	7	1	5	9	2	6	8
2	9	8	6	7	3	5	4	1
6	1	5	8	4	2	9	3	7
5	6	2	3	8	7	1	9	4
8	7	9	4	1	5	6	2	3
4	3	1	2	9	6	7	8	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.